సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 62

శుక్రవారం 24-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'



'ఫైనల్' వేటలో...

నేడు ఐపీఎల్ రెండో క్వాలిఫయర్‌లో రాజస్తాన్‌తో హైదరాబాద్ ఢీ. - 10లో



డివిడెండ్ జోష్.. సూచీల ఖుష్

స్టాక్ సూచీల కొత్త రికార్డు.. ఇన్వెస్టర్లకు రూ.4.28 లక్షల కోట్ల సంపద - 10లో




ఇటు నేను.. అటు ఎవరు?

'ఇండియా' కూటమి నాయకులు అధికారంలోకి రాకముందే ప్రధాని పదవి కోసం పోటీ పడుతున్నారని మోదీ ఎద్దేవా చేశారు. - వివరాలు 6లో



మహిళలంటే చిన్నచూపు!

మహిళలను బీజేపీ రెండో శ్రేణి పౌరులుగానే చూస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. - వివరాలు 6లో



ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో మరో ఎన్‌కౌంటర్.. గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. - వివరాలు 6లో



శభాష్ కామ్యా..!

కామ్య కార్తికేయన్ ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్ వైపు నుంచి చిన్న వయస్సులోనే అధిరోహించి చరిత్ర సృష్టించింది. - వివరాలు 6లో

న్యూస్‌రీల్

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు



ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతున్నాయని పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ చెప్పారు. ధాన్యం సేకరణలో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు నిరూపిస్తే ఎలాంటి శిక్షలకైనా సిద్ధమని అన్నారు.

- వివరాలు 3లో▶

పౌరసరఫరాల శాఖపై విచారణకు ఆదేశించాలి



కాళేశ్వరం నిర్మాణంపై రిటైర్డ్ జడ్జితో విచారణ చేయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ అక్రమాలపైనా విచారణకు ఆదేశించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

- వివరాలు 3లో▶


'రేవ్'లో డ్రగ్స్ నిజమే!



బెంగళూరు శివారులోని ఓ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రేవ్ పార్టీలో పాల్గొన్న 103 మందిలో 98 మంది రక్త నమూనాలను సేకరించి పరీక్షించగా నటి హేమతోపాటు కన్నడ యువ నటి ఆశురై మరికొందరు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది.

- వివరాలు 14లో▶

బీఆర్ఎస్ నేత దారుణ హత్య



వనపర్తి జిల్లా లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి (50) దారుణహత్యకు గురయ్యారు. బుధవారం రాత్రి ఇంటి సమీపంలోని కల్లం దొడ్డి వద్ద నిద్రించారు. అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డళ్లతో నరికి చంపారు.

- వివరాలు 3లో▶

కొలువు సరే.. జీతాలేవీ?

డ్యూటీలో చేరి 3 నెలలైనా తొలి వేతనం అందుకోని నర్సింగ్ ఆఫీసర్లు

స్వయంగా సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలిచ్చినా అంతులేని నిర్లక్ష్యం

15 రోజుల్లోగా పూర్తికావాల్సిన నియామకాల ప్రక్రియ

కొందరికి ఇంకా ఎంప్లాయ్ ఐడీ కూడా ఇవ్వని వైనం

వివరాలు పంపడంలో కొందరు సిబ్బంది చేతివాటం!

హెచ్ఓడీ, డీఎంహెచ్ఓ ఆఫీసుల స్టాఫ్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు



జనవరి 31న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందుకున్న ఆనందంలో నర్సింగ్ ఆఫీసర్లు

జీతాల్లేక ఇబ్బంది పడుతున్న 6,956 మంది నర్సింగ్ ఆఫీసర్లు | సర్కారు ఇప్పటికైనా స్పందించి వేతనాలు ఇవ్వాలని వేడుకోలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మొదటగా చేపట్టిన నియామకం నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టుల భర్తీ. ఎల్బీ స్టేడియంలో జనవరి 31వ తేదీన అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. తర్వాత వారంతా తమకు కేటాయించిన ఆస్పత్రుల్లో విధుల్లో చేరిపోయారు. మూడు నెలలుగా ఆస్పత్రుల్లో రేయింబవళ్లు డ్యూటీలు చేస్తున్నారు. కానీ వారికి ఇప్పటివరకు ఒక్కపైసా వేతనం అందలేదు. తొలి జీతం అందుకుని సంతోషంతో కుటుంబ సభ్యులకు స్వీట్లు పంచుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఈ పోస్టులకు ఎంపికై వారిలో చాలా మంది వారి స్వస్థలాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో నియామకం అయ్యారు. అద్దె ఇళ్లలో ఉంటున్నారు. వారికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో.. అద్దె కూడా చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత వల్లే తమకు వేతనాలు అందడం లేదని.. నర్సింగ్ ఆఫీసర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం 6,956 మంది నర్సింగ్ ఆఫీసర్లు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 డిసెంబర్ 30వ తేదీన 5,204 నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. గత ఏడాది ఆగస్టు 2న పరీక్ష నిర్వహించింది. 40,936 మంది దరఖాస్తు చేయగా.. 38,674 మంది పరీక్షలు రాశారు. ఫలితాలు వెల్లడించి, నియామకాలు చేపట్టాల్సి ఉన్నా.. ఎన్నికల నేపథ్యంలో ప్రక్రియ ఆగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 15న ఆ నోటిఫికేషన్‌కు

మిగతా 2వ పేజీలో ▶

3 నెలలైనా ప్రక్రియ పూర్తి చేయక..

నర్సింగ్ ఆఫీసర్ల నియామక ప్రక్రియను ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం పర్యవేక్షించాలి. అభ్యర్థులు తమ నియామక పత్రాల ను సంబంధిత ఆస్పత్రి సూపరింటిండెంట్, డీఎంహెచ్‌వోకు అందజేస్తే.. వారికి సర్వీస్ నిబంధనల ప్రకారం.. ఎంప్లాయ్ ఐడీ, బ్యాంక్ ఖాతా కేటాయిస్తారు. ఆ వివరాలను ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయానికి, అక్కడి నుంచి నర్సింగ్ విభాగానికి పంపి అప్‌డేట్ చేస్తారు. అప్పటి నుంచీ ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు లభిస్తుంది. అయితే 3 నెలలైనా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, కింది స్థాయి అధికారుల అవినీతితోనే జాప్యం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మేడిగడ్డ వద్ద మళ్లీ శబ్దాలు



7వ బ్లాకులోని గేటు ఎత్తుతుండగా ప్రకంపనలు

బ్యారేజీ కింద భారీగా బొరియ ఏర్పడినట్టు అనుమానాలు.. దీనితో ప్రమాదమేననే అంచనా

మొరాయించిన గేట్లు ఎత్తే పనులు తాత్కాలికంగా నిలిపివేత

పనులు కొనసాగిస్తే బ్యారేజీ మరింతగా కుంగిపోవచ్చనే అంచనాలు

జియోఫిజికల్/టెక్నికల్ టెస్ట్‌ల తర్వాతే ముందుకు కదలనున్న మరమ్మతులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద మళ్లీ ధ్వనులు, ప్రకంపనలు వచ్చాయి. కుంగిన ఏడో బ్లాకులోని 16వ నంబర్ గేటును పైకి ఎత్తడానికి నీటిపారుదల శాఖ ప్రయత్నించగా.. బ్యారేజీ కింద భూగర్భంలో నుంచి భారీగా బోలు శబ్దాలు (Hallow Sounds), ప్రకంపనలు రావడంతో వెంటనే ఆ పనులను నిలిపేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సెన్సర్లు సైతం శబ్దాలు, ప్రకంపనలను గుర్తించి అలర్ట్ చేశాయి. దీంతో బ్యారేజీ పెను ప్రమాదానికి లోనయ్యే అవకాశం కనిపిస్తోందంటూ నీటిపారుదల శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి..

గతంలో వరదల సమయంలో బ్యారేజీ పునాదుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోయి, 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో భారీ బొరియ ఏర్పడి ఉండవచ్చని ఇప్పటికే నిర్వహించిన జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల ద్వారా ఓ అంచనాకు వచ్చినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు చెప్తున్నాయి. టన్నుల కొద్దీ బరువుండే గేటును పైకి ఎత్తే క్రమంలో పునాదులపై ఒత్తిడి

మిగతా 2వ పేజీలో ▶

త్వరలో మేడిగడ్డకు సీఎం రేవంత్

- కాళేశ్వరం బ్యారేజీలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు: మంత్రి ఉత్తమ్
- రేపు బ్యారేజీలను పరిశీలించనున్న ఎన్‌జీఆర్ఐ బృందం

2లో

తెలిసిన వాళ్లతోనే స్వతంత్ర కమిటీ!

జలాశయాలకు ఏటా తనిఖీలు

2లో

కూటమి సేవలో ఘనాపాటి



సర్వశ్రేష్ఠ త్రిపాఠి

చంద్రబాబు విధ్వంస కుట్రలో ప్రధాన పాత్రధారి.. పల్నాడులో హింసాకాండకు ఐజీ వత్తాసు

కీలక అధికారుల ఆకస్మిక బదిలీల వెనుక సూత్రధారి

పోలీసులను కట్టడి చేసి టీడీపీ గూండాగిరీకి అండదండలు

కౌంటింగ్ రోజు మరోసారి అలజడికి కొమ్ము కాస్తున్న వైనం

పచ్చ ముఠాలను ఇంతవరకు అరెస్ట్ చేయకపోవడమే నిదర్శనం

టీడీపీ అధినేత ఒత్తిడితోనే త్రిపాఠికి పోస్టింగ్ 5లో



పోలింగ్ రోజున నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిపై దాడి చేసి కార్లను ధ్వంసం చేస్తున్న టీడీపీ గూండాలు (ఫైల్)



బుద్ధుని బోధనలే స్ఫూర్తి

బుద్ధ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్

బుద్ధ జయంతిని పురస్కరించుకుని గురువారం మహేంద్రహిల్స్‌లోని 'మహాబోధి బుద్ధ విహార'లో నిర్వహించిన వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో బౌద్ధ ఉపాసకుడు అంజనేయరెడ్డి తదితరులు

వివరాలు 2లో

ఆ అభ్యర్థులకు హైకోర్టు రక్షణ

జూన్ 6 వరకు పిన్నెల్లి, గోపిరెడ్డి, పెద్దారెడ్డి తదితరులను అరెస్టు చెయ్యొద్దని పోలీసులకు ఆదేశం 5లో

ఆ వీడియో లీక్ అయింది

- అది మేము విడుదల చేయలేదు
- ఈసీకి సంబంధం లేదు
- మీడియాతో సీఈవో ముకేష్ కుమార్ మీనా

5లో

రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం



కాంగ్రెస్ ప్రభుత్వానివి తెలివితక్కువ విధానాలు

ముందుచూపు లేని సీఎం పాలన

- తెలంగాణను రక్షించుకునేందుకు మరో ఉద్యమం రావాలి
- నిజాం వారసులుగా నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్
- ప్రజల నెత్తిన భస్మాసుర హస్తం పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం

14లో

రైతుల్ని తిట్టడానికా..?

అధికారం ఇచ్చింది అందుకేనా?

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



- రైతుబంధు అడిగితే ఓ మంత్రి చెప్పుతో కొడతామంటున్నరు
- మరో మంత్రి రైతుల్ని కుక్కల్లా మొరుగుతున్నారని కసురుకున్నడు
- జగిత్యాల, భూపాలపల్లి జిల్లాల్లో రెండు ధాన్యం సేకరణ కేంద్రాల పరిశీలన

14లో



మీరూ మీరే ఓట్లేసుకుంటుంటే మధ్యలో నేనెందుకని వెళ్లిపోతున్నాన్సార్!



తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుపాను ప్రభావం

మరోవైపు పెరుగుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

చాలాచోట్ల 40 డిగ్రీలు, ఆ పైన నమోదు

రాష్ట్రానికి వర్ష సూచన

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా 25వ తేదీ ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో తుపానుగా, ఆ తర్వాత తీవ్ర తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నెల 26 నాటికి బంగ్లాదేశ్, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ఉత్తర ప్రాంత జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా

మిగతా 2వ పేజీలో ▶

'నైట్ విజన్ గాగుల్స్'తో విమానం ల్యాండింగ్

భారత వాయుసేన మరో ఘనత



భారత వాయుసేన (ఐఏఎఫ్) మరో అరుదైన ఘనత సాధించింది. నైట్ విజన్ గాగుల్స్ (ఎన్‌వీజీ) సాయంతో తక్కువ వెలుతురు ఉన్న సమయంలో సీ-130జే రవాణా విమానాన్ని విజయవంతంగా ల్యాండ్ చేసింది. దీనికి సంబంధించిన రెండు వీడియోలను 'ఎక్స్'లో షేర్ చేసింది. ఎన్‌వీజీ విజువల్స్ కావడంతో ఈ దృశ్యాలు ఆకుపచ్చ రంగులో విభిన్నంగా ఉన్నాయి.

6లో

'ఈజీ' ఐపాస్



టీజీ ఐపాస్‌కు భారీగా మార్పులు!

కొత్త పారిశ్రామిక పాలసీపై సర్కారు దృష్టి

రాయితీలు, ప్రోత్సాహకాలకు ప్రాధాన్యత ఇచ్చే చాన్స్

గత ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదంటున్న కొత్త సర్కారు

పరిశ్రమలకు రూ.3,736 కోట్ల బకాయిలు!

సాక్షి, హైదరాబాద్: పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కొత్త పారిశ్రామిక పాలసీని తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రస్తుతమున్న విధానాల కంటే మెరుగైన విధానాలను అమలు చేయాలని యోచిస్తోంది. పరిశ్రమల శాఖ అధికారులు ఈ మేరకు నూతన పారిశ్రామిక విధానం రూపకల్పనపై కసరత్తు చేస్తున్నారు. దీనిపై సీఎం రేవంత్ ఇటీవల పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా ఈ సందర్భంగా అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన టీజీ ఐపాస్ (గతంలో టీఎస్ ఐపాస్) చట్టంలో సమూల

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

సోనియాపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని తెలంగాణ ప్రజలు 'తెలంగాణ తల్లి'గా భావిస్తున్నారని అటువంటి తెలంగాణ తల్లిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం మల్లు రవి మీడియాతో మాట్లాడారు. జూన్ 2న జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సోనియాగాంధీని తాము ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 1,500 మందిని పొట్టనబెట్టుకున్నందుకు సోనియాగాంధీని రాష్ట్రావిర్భావ దినోత్సవానికి ఆహ్వానిస్తారా అంటూ కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో తలుపులన్నీ మూసి తెలంగాణ బిల్లును పాస్ చేసి, తెలంగాణ ఇచ్చిన గొప్ప నాయకురాలు సోనియాగాంధీ అని కొనియాడారు. అటువంటి నాయకురాలిని వేడుకలకు ఆహ్వానించడంలో తప్పు ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ చరిత్ర తెలియని కిషన్‌రెడ్డి పాలనకు అనర్హుడన్నారు. త్వరలో దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

పార్వతీ బ్యారేజీని సందర్శించిన కేంద్ర బృందం



పరిశీలిస్తున్న కేంద్ర బృందం నిపుణులు

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం సమీపంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పార్వతీ బ్యారేజీతో పాటు సరస్వతీ పంపుహౌస్‌ను పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ నిపుణులు గురువారం పరిశీలించారు. సరస్వతీ పంపుహౌస్‌కు వెళ్లి మోటార్లను పరిశీలించి, ఫొటో తీసుకున్నారు. బ్యారేజీ వద్దకు వెళ్లి 54 నుంచి 61 గేట్ల వద్ద కుంగిపోయిన గార్డర్లను పరిశీలించారు. బ్యారేజీ కిందిభాగంలో జరుగుతున్న మరమ్మతులు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బృందంలో సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ నిపుణులు జేఎస్ఎడ్ లబాడ్కర్, ధనుంజయ్ నాయుడు, ప్రకాశ్ పాలయ్ ఉన్నారు.

'గొల్లకురుమలకు ఆ నగదు బదిలీ చేయాలి'

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రెండేళ్ల క్రితం లబ్ధిదారుల వాటా కింద డీడీలు తీసిన గొల్లకురుమలకు యూనిట్ మొత్తం నగదు బదిలీ చేయాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం(జీఎంపీఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అప్పులు చేసి కట్టిన డబ్బులకు గానూ.. కేవలం వాటాధనం మాత్రమే ఇప్పుడు తిరిగి రిటర్న్ చేస్తామనడం సరి కాదని జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ స్పష్టం చేశారు. లబ్ధిదారుల వాటా ధనం కింద 80వేల మంది ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున డీడీలు తీసి రెండేళ్లుగా వేచి చూస్తున్నారని తెలిపారు. సకాలంలో గొర్రెలివ్వకుండా గత బీఆర్ఎస్ సర్కారు మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని తమ మేనిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నెరవేర్చకుండా పాత ప్రభుత్వం అడుగుజాడల్లోనే నడవాలని చూస్తోందని రవీందర్ విమర్శించారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేస్తుందా? లేదా సమాధానం చెప్పాలన్నారు.

త్వరలో మేడిగడ్డకు సీఎం రేవంత్

కాళేశ్వరం బ్యారేజీలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు: మంత్రి ఉత్తమ్

- అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమావేశం
- ఇప్పటికే పనులు ప్రారంభించామన్న అధికారులు
- రేపు బ్యారేజీలను పరిశీలించనున్న ఎన్‌జీఆర్ఐ బృందం



గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ సిఫార్సులకు అనుగుణంగా.. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని అధికారులను నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వానాకాలం ప్రారంభానికి ముందే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులను పూర్తి చేయాలన్నారు. తాను, సీఎం రేవంత్‌రెడ్డి కలసి నాలుగైదు రోజుల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సందర్శనకు వచ్చి పునరుద్ధరణ పనులను పరిశీలిస్తామని చెప్పారు. గురువారం సచివాలయంలో నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్సీ (ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు, మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ డైరెక్టర్ దేశాయ్‌లతో ఉత్తమ్ సమావేశమయ్యారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ఏడో నంబర్ బ్లాకులోని గేట్లను పైకి ఎత్తే ప్రక్రియను ప్రారంభించామని మంత్రికి ఎల్అండ్‌టీ సంస్థ డైరెక్టర్ వివరించారు. బ్యారేజీకి గ్రౌంటింగ్ పూర్తి చేయడంతోపాటు ఏడో బ్లాకు పునాదుల కింద షీట్‌పైల్స్ వేస్తామని తెలిపారు. తర్వాత ఏడో నంబర్ బ్లాకులో పగుళ్లు వచ్చిన 19, 20, 21 నంబర్ పియర్ల మధ్య ఉన్న గేట్లను సైతం ఎత్తుతామని వెల్లడించారు. షీట్‌పైల్స్‌ను తయారు చేయించి ఇప్పటికే బ్యారేజీ వద్దకు తెప్పించామన్నారు. ఇక సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు ఎగువ, దిగువ భాగంలో రక్షణ పనులు ప్రారంభమయ్యాయని.. దెబ్బతిన్న సీసీ బ్లాకులను పూర్వస్థితికి చేర్చే పనులు జరుగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు.

బ్యారేజీల్లో బోర్లు వేసి పరీక్షలు..

జేఎస్ ఎడ్లబడ్కార్ (జియో టెక్నికల్ పరీక్షల నిపుణులు), ధనుంజయ నాయుడు (జియో ఫిజికల్ పరీక్షల నిపుణుడు), ప్రకాశ్ పాలీ (నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ నిపుణుడు)తో కూడిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల బృందం గురువారం జలసౌధలో నీటిపారుదల శాఖ ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేంద్రరావులతో సమావేశమైంది. బ్యారేజీల పరిశీలనలో తమ దృష్టికి వచ్చిన అంశాలు, వాటికి పరీక్షల నిర్వహణకు రాష్ట్ర నీటిపారుదల శాఖ చేసిన ప్రతిపాదనలపై తమ సంస్థ డైరెక్టర్‌కు త్వరలో నివేదిక సమర్పిస్తామని ఈ బృందం తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలకు నిర్వహించనున్న జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షల కోసం బ్యారేజీల లోపల బోర్లను వేయాలని సూచించింది. బోరు రంధ్రాల నుంచి అధునాతన పరికరాల ద్వారా శబ్దాలు పంపించడం ద్వారా.. బ్యారేజీల కింద భూగర్భంలో ఏర్పడిన ఖాళీ ప్రదేశాలను గుర్తించడానికి జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. టెస్టుల్లో భాగంగా బోర్లు వేయడం, ఇతర పనులను నీటిపారుదల శాఖే నిర్వహించాలని.. తమ నిపుణులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తారని శాస్త్రవేత్తలు తెలిపారు.

రేపు ఎన్‌జీఆర్ఐ బృందం పరిశీలన

హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) నిపుణుల బృందం శనివారం మూడు బ్యారేజీలను పరిశీలించనుంది. సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎన్‌జీఆర్ఐతోపాటు ఢిల్లీలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్)తో బ్యారేజీలకు పరీక్షలు జరపాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సిఫారసు చేసిన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది.

ప్రపంచానికి ఆదర్శంగా బుద్ధుడి బోధనలు

- నేను కూడా ఎంతో స్ఫూర్తిని పొందా
- ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన సందేశం దేశానికి అవసరం
- బుద్ధ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



గురువారం మహేంద్రాహిల్స్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి

కంటోన్మెంట్ (హైదరాబాద్): గౌతమ బుద్ధుడి బోధనలే తనకు స్ఫూర్తి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అన్ని మతాలను కలిపితే బౌద్ధమతం అని అన్నారు. ధ్యానాన్ని ఒక పనిగా చేయడం కాకుండా, ప్రతి పనిని ధ్యానంలా చేయాలన్న బుద్ధుని బోధన తనకెంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తాను ఇప్పటికీ ఏ పని చేసినా ధ్యానంలా చేస్తానన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని గురువారం మహేంద్రాహిల్స్‌లోని 'మహాబోధి బుద్ధ విహార'లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2,500 ఏళ్ల క్రితమే, 29 ఏళ్ల వయసులోనే.. రాజ్యం, అధికారం అన్నీ ఉండి కూడా శాంతి బోధన, శాంతి స్థాపన, సమాజం మేలు కోసం గౌతమ బుద్ధుడు అనుసరించిన మార్గం నేటికీ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్ చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఒక రకమైన ఉద్వేగాన్ని పెంపొందించడం ద్వారా స్పర్ధలు పెంచే వాతావరణం నెలకొని ఉందని అన్నారు. ఈ పరిస్థితుల్లో గౌతమ బుద్ధుడు బోధించిన సందేశం దేశానికి చాలా అవసరం అని సూచించారు. సమాజంలో పెరిగిపోతున్న అసూయ, అశాంతి లాంటి వాటిని అధిగమించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. తద్వారా ఓ మంచి సందేశాన్ని, సమాజానికి మేలు చేయాలన్న ఆలోచనను ఇతరులకు పంచాలని చెప్పారు.

మహాబోధి సొసైటీకి సహకరిస్తాం

మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో రూ.1.32 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ధ్యాన మందిరానికి నిధులు అందజేయాలంటూ సొసైటీ సభ్యులు చేసిన విజ్ఞప్తికి సీఎం అంగీకారం తెలిపారు. సొసైటీకి ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. చక్కని నిర్వహణ సామర్థ్యం కలిగిన మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో విద్యా సంస్థను నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ రెడ్డితో పాటు పలువురు బుద్ధ ఉపాసకులు, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

తెలిసిన వాళ్లతోనే స్వతంత్ర కమిటీ!

- నీటిపారుదల శాఖతో సంబంధంలేని నిపుణులు ఉండాలన్న జస్టిస్ చంద్రఘోష్ కమిషన్
- అందుకు విరుద్ధంగా తమ గురువులు, రిటైర్డ్ ఇంజనీర్లతో కమిటీ ఏర్పాటు
- నీటిపారుదల శాఖ ముఖ్యుల తీరుపై విమర్శలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించేందుకు నీటిపారుదల శాఖతో ఎలాంటి సంబంధం లేని ఇంజనీరింగ్ నిపుణులతో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఆదేశించగా, అందుకు విరుద్ధంగా బాగా తెలిసిన వాళ్లతోనే కమిటీ వేసినట్టు ఆ శాఖపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నీటిపారుదల శాఖలోని ముఖ్య ఇంజనీర్లు చదువుకునే రోజుల్లో వారికి గురువులుగా వ్యవహరించిన వారు, శాఖకు కన్సల్టెంట్లుగా సేవలందిస్తున్న వారు, శాఖలో రిటైరైన వారితో కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణకోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కమిషన్ ఆదేశాల మేరకు స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేస్తూ నీటిపారుదల శాఖ ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ సమర్పించనున్న నివేదిక ఆధారంగా న్యాయవిచారణ ప్రక్రియను చంద్రఘోష్ కమిషన్ ముందుకు తీసుకెళ్లనుంది. న్యాయ విచారణ ప్రక్రియకు కీలకమైన ఈ కమిటీలో స్వతంత్ర నిపుణులే ఉండాలని కమిషన్ కోరింది. అయితే, నీటిపారుదల శాఖ ముఖ్య ఇంజనీర్లతో అనుబంధం ఉన్న ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్‌రావు (సివిల్-స్ట్రక్చరల్ నిపుణులు), రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ (మెకానికల్ నిపుణులు), ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎస్.రమణమూర్తి (జియోటెక్నికల్ నిపుణులు), ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ టి.శశిధర్ (హైడ్రాలజీ అండ్ ప్లానింగ్ నిపుణులు), రిటైర్డ్ సీఈ కె.శ్రీకాంత్ (ఫీల్డ్ నిపుణులు)తో కమిటీ వేయడాన్ని నీటిపారుదల శాఖలో కొందరు అధికారులు ప్రశ్నిస్తున్నారు. కమిటీ సమర్పించే నివేదికను నీటిపారుదల శాఖ అధికారులు ప్రభావితం చేసే అవకాశాలుంటాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

జలాశయాలకు ఏటా తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు ఏటా వర్షాకాలం ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాల్సిన తనిఖీలు నిర్వహించలేదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తీవ్రంగా తప్పుబట్టడంతో ఎట్టకేలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మేల్కొంది. కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యాలపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ గతేడాది ప్రాథమిక నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జలాశయాలకు డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం తనిఖీలు నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని తాజాగా నీటిపారుదల శాఖ ఆదేశించింది. ప్రతి ఏటా వర్షాకాలానికి ముందు మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు, వర్షాకాలం ముగిసిన తర్వాత అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు రెండు పర్యాయాలు జలాశయాలకు తనిఖీలు నిర్వహించి వాటి స్థితిగతులపై నివేదికలు రూపొందించాలని ఈ సెక్షన్ స్పష్టం చేస్తోంది.

ఆ కంపెనీల కోసమే బీజేపీ

ప్రజల కోసం పనిచేసేది కాంగ్రెస్

- వనరులను జనాలకు కట్టబెట్టాలనేది మా ధ్యేయం
- దేశ ఆస్తులు, వ్యవస్థలను బీజేపీ కొందరికే కట్టబెడుతోంది
- పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: దేశ ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంటే బీజేపీ మాత్రం బహుళ జాతి కంపెనీల కోసమే పనిచేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధ, గురువారాల్లో ఆయన పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అమర్జీత్ కౌర్ సాహోకు మద్దతుగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. బుధవారం సాయంత్రం కొట్కాపుర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. అనంతరం గురువారం ఉదయం ఫరీద్ కోట్‌లో పంజాబ్ రాష్ట్ర ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వాతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత పలు గ్రామాల్లో జరిగిన సభల్లో ప్రసంగించారు. జాతీయ వనరులు, సంపద ఈ దేశ ప్రజలకే చెందాలని మల్లికార్జున ఖర్గే నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే, ఈ దేశంలోని ఆస్తులను, వ్యవస్థలను అమ్మి కొద్ది మందికి కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశంలో శాంతి, సౌభాతృత్వం వెల్లివిరియాలని ఇండియా కూటమి ఓవైపు పోరాటం చేస్తుంటే, జాతి, మతం పేరిట విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధి పొందాలని బీజేపీ కూటమి కుట్ర చేస్తోందని విమర్శించారు.

అధికారంలోకి రాగానే ప్రతి ఇంటి పెద్ద ఖాతాలో లక్ష

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని, కానీ బీజేపీ ప్రస్తుతం అమల్లో ఉన్న ఓబీసీ, బీసీ, ఎస్సీల రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందని భట్టి ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం దేశ సంపద పంపిణీ జరగాలని, తమిళనాడులో అమలవుతున్న 69% రిజర్వేషన్ల తరహాలోనే ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లు పెంచుతుందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ప్రతి ఇంటి పెద్ద బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయల నగదు జమ చేయనున్నట్లు చెప్పారు.

పదేళ్ల కాలంలో వంద లక్షల కోట్ల అప్పులు

పేదలకు రూపాయి లబ్ధి చేకూర్చకుండా అదానీ, అంబానీ వంటి కొద్ది మంది పెద్దలకు మాత్రం రూ.16 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారంటూ భట్టి విక్రమార్క మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మోదీ 10 ఏళ్ల పాలనలో రూ.100 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. ప్రాణాలు లెక్కచేయకుండా సరిహద్దుల్లో కాపలాకాస్తున్న వీర జవాన్ల స్థాయిని మోదీ ప్రభుత్వం కార్మికుల స్థాయికి దిగజార్చిందని విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తుందని ప్రకటించారు. అలాగే ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. రైతు, శ్రామికుల రుణమాఫీకి ఇండియా కూటమి కట్టుబడి ఉందన్నారు. జై జవాన్..జై కిసాన్ కాంగ్రెస్ నినాదం అని ఆయన పునరుద్ఘాటించారు.

మేడిగడ్డ వద్ద మళ్లీ శబ్దాలు

▶ మొదటి పేజీ తరువాయి

పెరుగుతుందని.. పునాదుల కింద భూగర్భంలో బొరియ ఉండటంతో ఆ ఒత్తిడికి బ్యారేజీ మరింత కుంగిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గ్రౌటింగ్ ద్వారా భూగర్భంలోని ఖాళీలను పూడ్చివేశాకే గేట్లను పైకెత్తే పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. నిజానికి 7వ బ్లాకు కుంగిన తర్వాత అక్కడి నుంచి నీటి లీకేజీని ఆపడానికి.. ఏకంగా 40వేల ఇసుక బస్తాలు వేశారు. అయినా బ్యారేజీ కింద భారీగా ఖాళీ ఉందని అంచనాకు రావడం గమనార్హం.

ఇప్పటికే హెచ్చరించిన ఎన్డీఎస్ఏ..: మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉండగా.. గతేడాది అక్టోబర్ 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి నీటిని వదిలేశారు. 7వ బ్లాకులోని 15 నుంచి 22 నంబర్ వరకు గేట్లు మొరాయించాయి. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ.. బ్యారేజీలను పలుమార్లు పరిశీలించి ఇటీవల మధ్యంతర నివేదిక సమర్పించింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం 2019 జూలైలో పూర్తవగా.. అదే ఏడాది వచ్చిన వరదల సమయంలో బ్యారేజీ ప్రమాద సంకేతాలను వెలువరించిందని పేర్కొంది. బ్యారేజీలకు వానాకాలంలోగా నిర్వహించాల్సిన మరమ్మతులు, చర్యలను సిఫారసు చేసింది. పగుళ్లు వచ్చిన 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను జాగ్రత్తగా పైకి ఎత్తాలని స్పష్టం చేసింది. నీటి పారుదల శాఖ అధికారులు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ సిబ్బందితో కలసి ఈ నెల 17న 15వ నంబర్ గేటును పైకి ఎత్తారు. తర్వాత 16వ నంబర్ గేటును ఎత్తడానికి ప్రయత్నించగా.. శబ్దాలు, ప్రకంపనలు వచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

పరీక్షలన్నీ చేయించడంపై దృష్టి

మేడిగడ్డ బ్యారేజీ దిగువన ఇసుక కొట్టుకుపోవడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశం.. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉందన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కుంగిన ఏడో నంబర్ బ్లాకు దిగువకే ఈ బొరియ పరిమితమై లేదని.. మొత్తం బ్యారేజీ కింద ఓ చివరి నుంచి మరో చివరి వరకు ఖాళీ ప్రదేశం ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై స్పష్టత వచ్చాక.. నిపుణుల కమిటీ సూచనల మేరకు ఇసుక, సిమెంట్ మిశ్రమాన్ని పంపించి పూడ్చివేయాల్సి ఉంటుందని చెప్తున్నారు. తొలుత ఆ ఖాళీ ప్రదేశాన్ని గుర్తించడానికి సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లతో జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించడానికి నీటిపారుదల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

రేవంత్ వ్యాఖ్యలపై హైకోర్టుకు బీజేపీ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తమ పార్టీపై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టులో వేసిన ప్రైవేట్ పిటిషన్‌ను జూలైకి వాయిదా వేయడం చట్టవిరుద్ధం అంటూ.. బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ అంశంపై వెంటనే విచారణ చేపట్టేలా ట్రయల్‌కోర్టుకు ఆదేశాలివ్వాలని కోరుతూ లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ వేసింది. ''నేను చెబుతూనే ఉన్నా, బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారు. రిజర్వేషన్లు రద్దు చేస్తారు. అందుకే 400 సీట్లు అడుగుతున్నారు. కేంద్రంలో ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజ్యాంగంలోని ప్రియాంబుల్‌ను మారుస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇప్పుడు ఎవరిని చెప్పుతో కొట్టాలో కరీంనగర్‌లోని అరగుండు, నిజామాబాద్ గుండును అడుగుతున్నా..'అని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తద్వారా ఓటర్లను ప్రభావితం చేసి ఓట్లు పొందే యత్నం చేశారన్నారు. బీజేపీ పరువుకు నష్టం కలిగించేలా సీఎం వ్యాఖ్యలున్నాయని ఆయన జేఎఫ్‌సీఎం కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ఈ నెల 22న విచారణ సందర్భంగా వివరాలు సమర్పించేందుకు మధ్యాహ్నానికి వాయిదా కోరగా, అందుకు నిరాకరించిన జడ్జి, జూలై 6కు విచారణ వాయిదా వేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. కాసం వెంకటేశ్వర్లు తరఫున న్యాయవాది హంసా దేవినేని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన తెలంగాణ ఎడ్‌సెట్

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించిన తెలంగాణ ఎడ్‌సెట్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఏపీ, తెలంగాణలోని 79 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష రెండు విడతల్లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 33,879 మంది నమోదు చేసుకోగా మొదటి విడత పరీక్షకు 16,321 మందికిగాను 14,633 (86%)మంది హాజరయ్యారు. రెండో విడత పరీక్షకు 16,950 మందికి 14,830(87.49%) మంది హాజరయ్యారు. మొత్తం 29,463 మంది పరీక్షలు రాసినట్లు సెట్ కన్వీనర్ టి.మృణాళిని, కోఆర్డినేటర్ శంకర్ గురువారం మీడియాకు తెలిపారు. అంతకుముందు రెండో విడత పరీక్ష ప్రశ్న పత్రం సెట్లను ఎంజీయూ ఇన్‌చార్జ్ వీసీ నవీన్‌మిట్టల్, సెట్ కమిటీ సభ్యుడు, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రితో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవి, ప్రొ. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి వర్ష సూచన

▶ మొదటి పేజీ తరువాయి

పెరుగుతున్నట్లు వివరించింది. గురువారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్టంగా ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా హనుమకొండ 21.0 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ప్రణాళికా విభాగం వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా అర్లి ప్రాంతంలో గరిష్టంగా 44.4 డిగ్రీల సెల్సియస్, కామారెడ్డి జిల్లా డొంగ్లిలో 43.1 డిగ్రీల సెల్సియస్, నిజామాబాద్ జిల్లా కల్దుర్కిలో 42.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు శుక్రవారం నుంచి మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ సూచించింది.

గురువారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	42.3
భద్రాచలం	39.5
దుండిగల్	36.5
హకీంపేట్	36.5
హనుమకొండ	35.0
హైదరాబాద్	36.4
ఖమ్మం	40.0
మహబూబ్‌నగర్	39.0
మెదక్	40.0
నల్లగొండ	40.0
నిజామాబాద్	39.6
రామగుండం	40.0

'ఈజీ' ఐపాస్

▶ మొదటి పేజీ తరువాయి

మార్పులు చేస్తూ కొత్త పారిశ్రామిక విధానం ఉంటుందని తెలుస్తోంది. పరిశ్రమల శాఖ అధికారులు మాత్రం ఈ విషయంలో గోప్యత పాటిస్తున్నారు.

రెండు పథకాలు అమలు చేసిన బీఆర్ఎస్ సర్కార్

కొత్త పారిశ్రామిక విధానంలో ప్రోత్సాహకాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశముందని అంటున్నారు. వాస్తవానికి పరిశ్రమల ఏర్పాటు కోసం పెట్టుబడులతో వచ్చే వారికి సత్వర అనుమతులు ఇచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీజీ ఐపాస్‌ను అమలు చేసింది. మరోవైపు పెట్టుబడులు పెట్టే వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు రెండు ప్రత్యేక పథకాలను కూడా అమలు చేసింది. టీ ఐడియా (జనరల్ కేటగిరీ), టీ ప్రైడ్ (ఎస్సీ, ఎస్టీ) స్కీమ్‌ల కింద పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పెట్టుబడి సబ్సిడీ, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ, సేల్స్ ట్యాక్స్ తదితరాల్లో రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చెప్పింది. అయితే గత ప్రభుత్వంలో రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వలేదని, నూతన పారిశ్రామిక విధానంలో తాము వీటికి పెద్దపీట వేస్తామన్నట్టుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది.

పేరుకుపోయిన బకాయిలు

కొత్త ప్రభుత్వం చెప్తున్న వివరాల ప్రకారం.. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలను పెండింగులో పెట్టడంతో భారీగా బకాయిలు పేరుకుపోయాయి. చాలా పరిశ్రమలు మూత పడ్డాయి. అధికారిక లెక్కల ప్రకారం.. ఈ ఏడాది మే 20వ తేదీ నాటికి తెలంగాణలో ఉన్న పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల బకాయిలు దాదాపు రూ.3,736.67 కోట్లు. వీటిలో రూ.3,007 కోట్లు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించినవి కాగా, రూ.728 కోట్లు భారీ, మెగా పరిశ్రమలకు సంబంధించినవి ఉన్నాయి. ఇదిలా ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొన్ని పరిశ్రమలకు ప్రోత్సాహకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.684 కోట్ల విలువైన చెక్కులు చెల్లలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే అప్పటికప్పుడు పరిశ్రమలకు ప్రోత్సాహకాలు చెల్లించేలా కొత్త పారిశ్రామిక విధాన రూపకల్పన జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

2014-15 నుంచి టీజీ ఐపాస్ తీరుతెన్నులు

ఏర్పాటైన పరిశ్రమలు	:	25,609
తయారీ రంగం	:	23159
సర్వీసు రంగం	:	2450
మొత్తం పెట్టుబడులు	:	రూ.2.86 లక్షల కోట్లు
ఉద్యోగ అవకాశాలు	:	18,41,062

కొలువు సరే.. జీతాలేవీ?

▶ మొదటి పేజీ తరువాయి

మరో 1,890 పోస్టులను కలిపింది. మొత్తంగా డీఎంఈ పరిధిలో 5,650 పోస్టులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో 757, ఎంఎన్‌జే, గురుకులాల్లో మిగతా పోస్టులను సిద్ధం చేశారు. ఫలితాల తర్వాత 6,956 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని 26 మెడికల్ కాలేజీలు, ఇతర స్పెషాలిటీ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వారికి పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో బీసీలు 45.97%, ఎస్సీలు 30.64%, ఎస్టీలు 12.81% మంది ఉన్నారు. ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్ కేటగిరీలో అభ్యర్థులు లేకపోవడంతో 138 పోస్టులు భర్తీ కాలేదు. కొత్తగా ఎంపికైన నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు రూ.36,750–రూ.1,06,990గా పేస్కేల్ ఖరారు చేశారు. దీంతోపాటు టీఏ, డీఏ, హెచ్ఆర్ఏ తదితర అలవెన్సులు ఉంటాయి. కొత్తగా ఎంపికైన వారందరికీ కలిపి నెలకు దాదాపు రూ.35 కోట్లు ఖజానా నుంచి చెల్లించాల్సి ఉంటుంది.

దొరికిందే చాన్స్‌గా 'ముడుపుల' వ్యవహారం

డ్యూటీలో చేరిన 15 రోజుల్లోగా నియామక ప్రక్రియ పూర్తికావాలి. కానీ మూడు నెలల తర్వాత కూడా కొన్నిచోట్ల క్లర్కుల స్థాయిలోనే ఫైళ్లు ఆగిపోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో నర్సింగ్ ఆఫీసర్లకు ఎంప్లాయి ఐడీలు కూడా ఇవ్వలేదు. ట్రెజరీలకు వివరాలు పంపలేదు. మూడు నెలలుగా వేతనాలు రాక నర్సింగ్ ఆఫీసర్లు ఇబ్బంది పడుతుంటే.. కిందిస్థాయి సిబ్బంది 'ముడుపులు' అందితేనే ఫైల్ కదులుతుందని డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐడీ, ప్రాన్ కార్డుల కోసం హెచ్ఓడీ, డీఎంహెచ్ఓ ఆఫీసు స్టాఫ్ డబ్బులు అడుగుతున్నారని ఓ నర్సింగ్ ఆఫీసర్ వాపోయారు. ముడుపులు ఇచ్చినోళ్ల వివరాలనే ట్రెజరీకి పంపుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి.. తమకు వెంటనే వేతనాలు అందేలా చూడాలని నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్నారు.

వేతనాలు వెంటనే ఇవ్వాలి

కొత్తగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లకు ప్రభుత్వం ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు మంజూరు చేయాలని వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చాం. శాశ్వత పద్ధతిలో నియమితులైన వారందరికీ వేతనాలు, గుర్తింపు కార్డులు త్వరగా ఇవ్వాలి..

– వి.మరియమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నర్సెస్ అసోసియేషన్

ప్రభుత్వం నుంచి ఆమోదం రావాలి

మొదటిసారి శాలరీలు డ్రా చేయాలంటే అందరూ చేరేంతవరకు ఆగాల్సి ఉంటుంది. నర్సింగ్ ఆఫీసర్లు అంతా చేరడానికి ఫిబ్రవరి వరకు పట్టింది. తర్వాత వాళ్ల నుంచి 27 కాలమ్స్ డేటా సేకరించాలి. కానీ ఆ డేటాను అందరూ ఇవ్వడం లేదు. కొందరు పాన్‌కార్డు లేదంటారు. అంతేకాదు ప్రతీ దానికి ఒక డాక్యుమెంట్ కావాలి. వివరాలన్నీ ఒకేసారి పట్టుకొని రావాలని ట్రెజరీ అధికారులు అంటున్నారు. ఇవన్నీ అందజేస్తే అప్పుడు నర్సింగ్ ఆఫీసర్లకు ఎంప్లాయీ ఐడీ ఇస్తారు. ఐడీ వచ్చాక ముంబై నుంచి ప్రాన్ నంబర్ తెప్పించాలి. చాలా మంది వివరాలు సరిగా ఇవ్వలేదు. దాంతో ఆలస్యం అవుతోంది. సప్లిమెంటరీ బిల్లులు తొందరగా పాస్ కావు. రెగ్యులర్ బిల్లు అయితే ప్రభుత్వం వెంటనే జీతాలు వేస్తుంది. ఇప్పుడు నర్సింగ్ ఆఫీసర్లది సప్లిమెంటరీ బిల్లు కావడం వల్లే ఈ సమస్య.

– డాక్టర్ వాణి, డీఎంఈ

మార్క్‌ఫెడ్ పాలకవర్గానికి నోటీసులు

నాలుగేళ్లలో ఒక్కసారి కూడా జరగని జనరల్ బాడీ సమావేశం


సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్ చైర్మన్ సహా ఏడుగురు డైరెక్టర్లకు సహకారశాఖ నోటీసులు ఇచ్చింది. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు దాటినా ఇప్పటివరకు ఒక్కసారి కూడా జనరల్ బాడీ సమావేశం నిర్వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. అంతేగాక ఈ విషయంపై కోర్టు కూడా సీరియస్ అయ్యింది. ఎనిమిది వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సహకారశాఖ తాజాగా నోటీసులు జారీ చేసింది. పాలకవర్గం రద్దు చేస్తే చైర్మన్ సహా ఇతర డైరెక్టర్లను తొలగిస్తారు. జనరల్ బాడీ సమావేశం అనుమతి లేకుండానే మార్క్‌ఫెడ్ బోర్డులో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారని, పెద్దఎత్తున అక్రమాలకు తెరలేపారన్న ఆరోపణలు ఉన్నాయి. పాలకవర్గం తొలగింపు సహా దానికి బాధ్యులైన అధికారులపైనా వేటు పడుతుందని అంటున్నారు.

2020లో కొలువుదీరిన పాలకవర్గం

మార్క్‌ఫెడ్ పాలకమండలిని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) సభ్యులు ఎన్నుకుంటారు. రాష్ట్రంలో ఉన్న ప్యాక్స్ చైర్మన్లు ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఏడుగురు డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రస్తుతం చైర్మన్‌గా మార గంగారెడ్డి ఉన్నారు. 2020 మార్చి 11న పాలకవర్గం కొలువుదీరింది. పాలకవర్గ జనరల్ బాడీ దాదాపు 550 మంది ప్యాక్స్ చైర్మన్లతో ఉంటుంది. నిబంధనల ప్రకారం ఏడాదిలో రెండుసార్లు (ఆర్నెళ్లకోసారి లేదా ఏడాదిలో రెండుసార్లు) జనరల్‌బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్వహించకుంటే, మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం... ఏడాది పూర్తయిన మరునాడే ఆ పాలకవర్గం చట్టరీత్యా రద్దు కావాలి. అయినా చైర్మన్, డైరెక్టర్లు పదవులు అనుభవిస్తున్నారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం లభిస్తుందో లేదోనన్న భయం వల్లే జనరల్‌బాడీ సమావేశం నిర్వహించలేదన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుత చైర్మన్ మార గంగారెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన ప్రభుత్వ పెద్దలను కలిసి ఎలాగోలా పదవిని కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. అయితే సహకారశాఖ నోటీసులు ఇవ్వడంతో ఆయన ప్రయత్నాలకు గండిపడినట్టేనని అంటున్నారు.

'రైతులు ఇబ్బందులు పడకుండా చూడండి'

సాక్షి, హైదరాబాద్: విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులెవరూ ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులకు వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, వ్యవసాయ సంచాలకులు బి.గోపి సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడుతూ... రైతులు లూజుగా ఉన్న సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు దుకాణం నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రం చేసుకోవాలని తెలిపారు. వెల్లడించారు. వ్యవసాయ అధికారులు అన్ని విత్తన డీలర్ల దుకాణాలు సందర్శించి, విత్తన నిల్వల నివేదికలను పై ఎప్పటికప్పుడు అధికారులకు అందజేయాలని ఆదేశించారు. గ్రామాలవారీగా రైతు అవగాహన సమావేశాలు నిర్వహించాలని చెప్పారు.



పౌరసరఫరాల శాఖపై విచారణకు ఆదేశించాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్
- ఆ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై నా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి
- ధాన్యం కొనుగోళ్లలో రూ.800 కోట్ల అవినీతి... మంత్రి ఉత్తమ్ చర్చకు వస్తే నిరూపణకు సిద్ధమని ప్రకటన
- తన ప్రశ్నలకు బదులివ్వలేక మంత్రి కేసు పెట్టించారని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్, నల్లగొండ టూటౌన్: కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యారేజీల నిర్మాణంపై రిటైర్డ్ జడ్జితో విచారణ చేయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖలో జరిగిన అక్రమాలపై కూడా విచారణకు ఆదేశించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చకు వస్తే తాను నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను ఆ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై మాట్లాడితే మంత్రి ఉత్తమ్ సమాధానం చెప్పలేక మొహం చాటేశారని ఎద్దేవా చేశారు. పైగా, ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నేతగా, బాధ్యత గల ప్రజా ప్రతినిధిగా ప్రశ్నిస్తే పోలీసులతో తనపై కేసు పెట్టించారని పేర్కొన్నారు. ఇదేనా ప్రజా పాలన అని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. తాను వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేయకపోగా కేసులు పెట్టి మంత్రి మొహం చాటేయడం వెనక అర్థమేమిటని నిలదీశారు. ప్రజల కోసం ఎన్ని కేసులు ఎదుర్కోవడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

ఒకేరోజు మార్గదర్శకాలు, టెండర్ల ప్రకటన ఎలా?

గత జనవరి 25న సన్నబియ్యం కొనుగోలు టెండర్ల కోసం కమిటీ వేసి మార్గదర్శకాలు రూపొందించారని మహేశ్వర్‌రెడ్డి వివరించారు. అదే రోజు గ్లోబల్ టెండర్లకు ప్రకటన చేశారని, ఒక్క రోజులోనే కమిటీ ఏర్పాటు, సమావేశాలు, మార్గదర్శకాల రూపకల్పన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. టెండర్లలో పాల్గొనేందుకు పంజాబ్, హరియాణా నుంచి కాంట్రాక్టర్లు ముందుకు వస్తే, కొందరు అధికారులు వారిని బెదిరించారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే.. ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని జలసౌధలో రైస్ మిల్లర్లతో సమావేశంలో ఒప్పందాలు చేసుకున్నారని నిందించారు. జలసౌధలో చేసిన ఒప్పందాలను బయటపెట్టాలా.. అని సవాల్ విసిరారు. క్వింటాల్‌కు రూ. 216 అదనంగా మిల్లర్ల నుంచి వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మిల్లర్లు బియ్యం ఇస్తామంటే డబ్బులే ఇవ్వాలని డిమాండ్ చేశారని, మిల్లర్లకు బెదిరింపులకు పాల్పడింది వాస్తవం కాదా అని ఆయన నిలదీశారు.

కమీషన్లు వసూలు చేస్తున్న మంత్రులు

నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌తో కలిసి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు టోల్‌గేట్లు పెట్టిన మాదిరిగా కమీషన్లు వసూలు చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఆర్ ట్యాక్స్, ట్రిబుల్ ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, యూ ట్యాక్స్ పేరిట రూ.వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో అనే అనుమానంతో మంత్రులందరూ దోపిడీ మీద పడ్డారన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రూ.800 కోట్ల అవినీతి

ధాన్యం కొనుగోళ్లలో రూ. 800 కోట్ల అవినీతి జరిగిందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఈ నెల 23 లోగా పూర్తి మెటీరియల్ లిఫ్ట్ చేయాలని టెండర్‌లో కోరారని, పూర్తి ధాన్యం లిఫ్ట్ చేయకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని పేర్కొన్నారని గుర్తు చేశారు. గడువు ముగిసినా పూర్తి ధాన్యం లిఫ్ట్ చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పూర్తి ధాన్యం కొనుగోలు చేయని బిడ్డర్లకు ఎందుకు ఎక్స్‌టెన్షన్ ఇస్తున్నారో చెప్పాలన్నారు. క్వింటాల్‌కు రూ. 2,259 చొప్పున లక్షా 59 వేల మెట్రిక్ టన్నులు ఎందుకు విక్రయించాల్సి వచ్చిందో వివరించాలని కోరారు. మళ్లీ మధ్యాహ్న భోజనం, హాస్టళ్ల విద్యార్థుల కోసమని క్వింటాల్‌కు రూ.5,700 చొప్పున 22లక్షల క్వింటాళ్ల బియ్యం ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని నిలదీశారు. తనకు ఎవరినీ వ్యక్తిగతంగా కార్నర్ చేయాలన్న ఉద్దేశం లేదని, ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపైనే ప్రశ్నిస్తున్నానని చెప్పారు.

ఉత్తమ్‌పై ఇంకు చల్లొద్దు..

ఆయన తెల్ల కాగితం లాంటివాడు.. బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డికి జగ్గారెడ్డి హితవు



సాక్షి, హైదరాబాద్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీజేపీ ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు చేయడం శోచనీయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, మహేశ్వర్‌రెడ్డి మంత్రి ఉత్తమ్‌పై బట్టకాల్చి మీద వేస్తున్నాడని ఆక్షేపించారు. ఉత్తమ్ మీద ఆయనకు ఎందుకు కోపమొచ్చిందో అర్థం కాలేదని, ఉత్తమ్ తెల్లకాగితం లాంటి వాడని అన్నారు. ఆయన మీద ఇంకు చల్లే ప్రయత్నాలు చేయవద్దని హితవు చెప్పారు. కాంగ్రెస్ రైతు పక్షపాతి అని, మా ప్రభుత్వం ఏర్పడ్డాక వర్షాలు పడి ధాన్యం తడిసిందని, తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు చెప్పారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ఉత్తమ్ మీద మహేశ్వరరెడ్డి ఇప్పటికైనా ఆరోపణలు ఆపితే బాగుంటుందన్నారు.

ఏలేటి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ ప్రసాద్



నల్లగొండ: మంత్రి ఉత్తమ్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కేఎల్ఎన్. ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్లమెంటులో తెలంగాణ వాణిని వినిపించిన ఘనత ఉత్తమ్‌కుమార్‌రెడ్డిదని అన్నారు. నిజాయితీగల నాయకుడైన ఉత్తమ్‌పై మహేశ్వర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ తోడ్పడుతుంటే ఓర్వలేకే బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

ధాన్యంపై నిరాధార ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లలో అవినీతి జరిగిందంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల కమిషనర్ చౌహాన్‌పై నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అసత్య, నిరాధారాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఖండించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తక్షణమే మహేశ్వర్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన సోనియాగాంధీని విమర్శించే అర్హత కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులను బెదిరిస్తున్నారని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని సుధాకర్ విమర్శించారు.

బీసీ సంఘాలు సంఘటితం కావాలి

బీజేపీ నేత డాక్టర్ కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: బీసీల హక్కులను కాలరాస్తున్న రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా బీసీ సంఘాలు ఏకమై సంఘటితంగా పోరాటం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. అలాంటి పార్టీలను అడ్డుకోకపోతే బీసీ సమాజం తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో చట్ట విరుద్ధంగా ముస్లిం ఉపకులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు తీర్పునివ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న మమతాబెనర్జీ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ, ఇతర విపక్ష పార్టీల నైజం బయటపడిందన్నారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని ఇచ్చిన ఈ తీర్పు.. మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదన్నారు. తెలంగాణలో బీసీ–ఈ పేరుతో 4 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అదనంగా ఇవ్వడంతో బీసీలకు అన్యాయం జరుగుతున్న వైనాన్ని బీజేపీ అనేకసార్లు ప్రశ్నించిందని గుర్తుచేశారు. తాము బీసీల హక్కుల రక్షణ కోసం పోరాడుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు విపక్షాలు పట్టించుకోలేవడం లేదన్నారు. కేవలం మైనారిటీ ఓట్ల కోసం బీసీల ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కేటగిరీ 11–బీ కింద ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కలకత్తా హైకోర్టు తీర్పును అమలు చేయబోమని మమతాబెనర్జీ మాట్లాడటం రాజ్యాంగాన్ని అవమానపర్చడమేనని అన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్
- ఇప్పటివరకు 39.51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- నిబంధనల ప్రకారం ఉంటే ఒక్క గింజ కూడా కోత పెట్టడం లేదు
- తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా తీసుకుంటాం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని, పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ధాన్యం సేకరణ కోసం చిత్తశుద్ధితో కష్టపడుతున్నారని సంస్థ కమిషనర్ డీఎస్ చౌహాన్ చెప్పారు. మిల్లర్లు ఎవరైనా ఉద్యోగులకు ఒక్క పైసా అయినా ఇచ్చినట్లు నిరూపిస్తే, ఎలాంటి శిక్షలకైనా సిద్ధమని అన్నారు. నిరాధార ఆరోపణలు చేస్తే చట్ట పరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. గురువారం పౌరసరఫరాల భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

నిబంధనల మేరకు లేకపోవడంతో ఇబ్బందులు

'కొన్నిచోట్ల ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులున్నప్పటికీ, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతున్నాం. ఇప్పటివరకు 39.51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రూ.8,690 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.7,208 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. ధాన్యం విక్రయించిన తర్వాత మూడు నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నాం. పలుచోట్ల ధాన్యం నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నాణ్యమైన ధాన్యానికే మద్దతు ధర ఇస్తుంది. గతంతో పోల్చితే ధాన్యం కాంటాలో కోత భారీగా తగ్గింది. నిబంధనల ప్రకారం ఉన్నటువంటి ధాన్యంలో ఒక్క గింజ కూడా కోత పెట్టడం లేదు..'అని చౌహాన్ తెలిపారు.

డీఫాల్ట్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

'డీఫాల్ట్ మిల్లర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం ఇవ్వడం లేదు. మిగతా మిల్లర్లకు పూర్తి పారదర్శకంగా ధాన్యాన్ని అప్పగిస్తున్నాం. డీఫాల్టర్లపై 43 క్రిమినల్ కేసులు బుక్ చేశాం. వారి నుంచి ఇప్పటికే రూ.668 కోట్లు రికవరీ చేశాం. సంస్థకు రూ.58,623.05 కోట్ల అప్పులు ఉండగా, వాటిని రూ.52,276.78 కోట్లకు తగ్గించాం. కేవలం మూడు నెలల్లో రూ.6,400 కోట్ల వరకు అప్పులు తగ్గించుకుని వడ్డీ భారాన్ని కూడా తగ్గించాం. బియ్యం ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. కొందరు మిల్లర్లు తమ ఆస్తులను ఇతరుల పేరు మీదకు మారుస్తున్నారు' అని చౌహాన్ వెల్లడించారు.

సన్న బియ్యం కొనుగోలులో అక్రమాలు జరగలేదు

'సన్న రకం బియ్యంతో పాటు అత్యంత సన్న రకాలను కూడా కొనుగోలు చేశాం. ప్రస్తుతం అత్యంత సన్న రకాల బియ్యం ధర మార్కెట్లో కేజీకి రూ.62.25 ఉంది. సన్నాల ధర రూ.54గా ఉంది. సన్న బియ్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరగలేదు. టెండర్ల ద్వారా విక్రయించిన ధాన్యం ఖాళీ చేయాల్సిన గడువు ముగిసిన నేపథ్యంలో త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం. రైతులకు నష్టం రాకుండా చూస్తాం. 30 లక్షల టన్నుల బాయిల్డ్‌రైస్ సేకరించేలా కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నాం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా శాస్త్రీయ విధానాలు అమలు చేశాం'అని పౌరసరఫరాల కమిషనర్ వివరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు తనపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు. వారి ఆరోపణల వెనుక కుట్ర ఉందనే అనుమానం వ్యక్తం చేశారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డా.కృష్ణయ్య

మూత్రాశయ కేన్సర్‌పై అవగాహనకు

ఆర్ట్ ఎగైనెస్ట్ కేన్సర్ ఎగ్జిబిషన్

ఇండో అమెరికన్ హాస్పిటల్‌లో ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: మూత్రాశయ కేన్సర్‌పై అవగాహన పెంచేందుకు బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, మెర్క్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ''ఆర్ట్ ఎగైనెస్ట్ కేన్సర్''పేరిట పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. బుధ, గురువారాల్లో ఇండో అమెరికన్ హాస్పిటల్‌లో రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన జరిగింది. ప్రతి ఏడాది లక్షలాది మంది జీవితాలపై మూత్రాశయ కేన్సర్ చూపే ప్రభావాన్ని వెల్లడించేందుకు ఇండో అమెరికన్ హాస్పిటల్ ఈ ప్రత్యేకమైన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ కూరపాటి కృష్ణయ్య తెలిపారు. 'ఆర్ట్ ఎగైనెస్ట్ క్యాన్సర్' ఎగ్జిబిషన్‌లో భాగంగా దేశంలోని ప్రముఖ ఆర్ట్ స్కూల్స్ నుంచి ప్రతిభావంతులైన కళాకారులచే రూపొందించబడిన విభిన్న కళాకృతులను ప్రదర్శించారు. ప్రతి ఒక్కరు థీమ్‌కు అనుగుణంగా తమ భావాలకు దృశ్య రూపం అందించటం తో పాటుగా మూత్రాశయ క్యాన్సర్‌పై పోరాటానికి తమ మద్దతును వెల్లడించారు.

బీఆర్‌ఎస్ నేత దారుణ హత్య

- వనపర్తి జిల్లా లక్ష్మీపల్లిలో ఘటన
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మంత్రి జూపల్లి కృష్ణారావుపై తీవ్రస్థాయిలో ధ్వజం



శవయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు (ఇన్‌సెట్‌లో) శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

వనపర్తి: బీఆర్‌ఎస్ మండల నాయకుడు దారుణహత్యకు గురయ్యారు. వనపర్తి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి(50) బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటి సమీపంలోని కల్లం దొడ్డి వద్ద నిద్రించారు. అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డళ్లు, కత్తులతో దాడి చేయడంతో శ్రీధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పాలుపోసే వ్యక్తి గురువారం ఉదయం ఇంటికి రాగా, కల్లందొడ్డిలో పడుకుంటున్న శ్రీధర్‌రెడ్డిని లేపమని తండ్రి శేఖర్‌రెడ్డి చెప్పాడు. దీంతో పాలుపోసే వ్యక్తి అక్కడకు వెళ్లగా మంచంపై శ్రీధర్‌రెడ్డి విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి హుటాహుటిన ఇంటికి వచ్చి శేఖర్‌రెడ్డికి చెప్పాడు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఘటనా స్థలానికి కేటీఆర్

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు శ్రీధర్‌రెడ్డి హత్య సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి లక్ష్మీపల్లికి చేరుకున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు, వారికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి శ్రీధర్‌రెడ్డి మృతదేహాన్ని తీసుకొచ్చే సమయంలో కేటీఆర్ ఇతర నేతలతో కలిసి చిన్నంబావి మండల కేంద్రం నుంచి లక్ష్మీపల్లి గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు కాలినడకన భారీ ర్యాలీ తీశారు. శ్రీధర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డిని పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

మంత్రిని బర్తరఫ్ చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతీకార పాలన చేస్తోందనడానికి గత నాలుగు నెలల్లో ఒక్క కొల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన రెండు రాజకీయ హత్యలే నిదర్శనమని కేటీఆర్ ఆరోపించారు. మంత్రి జూపల్లి ప్రమేయంతోనే వరుస హత్యలు జరుగుతున్నాయని, ఈ హత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించి జూపల్లిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. వారం పదిరోజుల క్రితం కొల్లాపూర్‌లో చోటుచేసుకుంటున్న అరాచకాలను అదుపు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు డీజీపీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. తన కుమారుడి హత్య వెనుక మంత్రి జూపల్లి హస్తం ఉందని శ్రీధర్‌రెడ్డి తండ్రి చెప్పినా, ఫిర్యాదులో మంత్రి పేరు రాయొద్దని పోలీసులు ఒత్తిడి చేస్తున్న తీరుతో మాకు వారిపై నమ్మకం కలగడం లేదన్నారు. జనవరిలో బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేష్ యాదవ్‌ను, ఇప్పుడు శ్రీధర్‌రెడ్డిని రాజకీయంగా అడ్డొస్తారనే ఉద్దేశంతో మట్టుపెట్టారని ఇదొక్క నియోజకవర్గంలోనే నాలుగు నెలల్లో రెండు రాజకీయ హత్యలు చోటు చేసుకున్నట్టు ఆరోపించారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు: జూపల్లి

శ్రీధర్‌రెడ్డి హత్యపై రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. అన్ని కోణాల్లో నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తామన్నారు. హత్యకు గల కారణాలన్నింటినీ వెలుగులోకి తీసుకొచ్చేలా పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్యను అడ్డం పెట్టుకొని తనపై బీఆర్‌ఎస్ నాయకులు బురద జల్లుతున్నారన్నారు. హత్యకు దురలవాట్లు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలే కారణమని మంత్రి ఆరోపించారు. వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యను కేటీఆర్, ఆ పార్టీ నాయకులు రాజకీయ హత్యగా చిత్రీకరించడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

దయ అనేది విశ్వాసానికి చిహ్నం.
దయ లేని వ్యక్తికి విశ్వాసం ఉండదు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 24 మే 2024

రిషి సాహసం!

వచ్చే జులై 4న బ్రిటన్ దిగువసభ ఎన్నికలు నిర్వహిస్తామంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ బుధవారం చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యపరిచింది. కన్సర్వేటివ్ పార్టీ నిరంతరాయంగా పద్నాలుగేళ్ల నుంచి అధికార పీఠాన్ని అంటిపెట్టుకుంది. అయిదేళ్ల గడువుకు అయిదు నెలల ముందే జరుగుతున్న ఈ ఎన్నికలు వారి పాలనకు చరమగీతం పాడతాయా, మరోసారి అందలమెక్కిస్తాయా అన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. కానీ కన్సర్వేటివ్‌లకు ఆ విషయంలో అనుమానం లేదు. ఓటమి ఖాయమన్న దిగులు ఆ పార్టీని ఆవరించింది. విశ్వవిఖ్యాత కవి, రచయిత విలియం షేక్స్‌పియర్ విరచిత 'హామ్లెట్' నాటకంలోని పాత్ర పలికిన ఆత్మగత సంభాషణలో 'టు బీ ఆర్ నాట్ టు బీ...' అందరికీ గుర్తుండిపోయే పదబంధం. బతకటమా, చావటమా అనే సందిగ్ధ స్థితిని అది చెబుతుంది. కన్సర్వేటివ్ పార్టీ ప్రస్తుతం ఆ సంకటస్థితిలోనే ఉంది. నిరుడు జులైలో దిగువ సభకు జరిగిన మూడు ఉప ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం ఒకటే గెల్చుకుంది. ఈ నెల మొదట్లో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ దాని పరిస్థితి ఏమంత బాగులేదు. నిజానికి నిరుడూ, అంతకు ముందు సంవత్సరమూ దేశం అధిక ద్రవ్యోల్బణంతో కుంగిపోయింది. కానీ నెలరోజుల్లో ఉప ఎన్నికలుంటాయనగా అది చెప్పుకోదగ్గ మేర తగ్గింది. అయినా వోటర్లు కరుణించలేదు. మొన్న స్థానిక ఎన్నికల సమయానికి కూడా ఆర్థిక స్థితి మెరుగుపడిన సూచనలు కనబడ్డాయి. వృద్ధి రేటు బాగుందని జీడీపీ గణాంకాలు చాటాయి. ఆర్థిక మాంద్య ప్రమాదం తప్పిందన్న సంకేతాలు వెలువడ్డాయి. కానీ స్థానిక ఎన్నికల్లో జనం లేబర్ పార్టీ వైపే మొగ్గారు. కన్సర్వేటివ్ పార్టీ రేటింగ్ కనీవినీ ఎరుగని రీతిలో 20 శాతానికి పడిపోయిందని, లేబర్ పార్టీ 44 శాతంతో ముందంజలో ఉన్నదని సర్వేలు చెబుతున్నాయి. బహుశా అందుకే కన్సర్వేటివ్ పార్టీ ఎంపీలూ, రిషి మంత్రివర్గ సహచరులూ గడువుకు ముందే పార్లమెంటు రద్దు చేయటం ప్రమాదకరమంటూ వాదించారు. అయితే రిషి సునాక్ లెక్కలు వేరు. సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు కొన్ని గంటల ముందు వెల్లడైన ఆర్థిక గణాంకాలు ఆయనకు ధైర్యాన్నిచ్చాయి. ద్రవ్యోల్బణం మూడేళ్ల కనిష్ఠానికి పడిపోయిందని గణాంకాలు తేల్చాయి. 2022 అక్టోబర్‌లో 11.1 శాతం ఉన్న ద్రవ్యోల్బణం ప్రస్తుతం 2.3 శాతానికి దిగొచ్చింది. కన్సర్వేటివ్‌లు పెట్టుకున్న 2 శాతం లక్ష్యం కన్నా ఇది కాస్తా ఎక్కువే అయినా ఇంతకు మించి ఆశించకూడదన్న అభిప్రాయం అధికారపక్షంలో ఉంది. మరోపక్క అక్రమ వలసదారులను రువాండాకు సాగనంపే చట్టం ఆమోదం పొందాక ఆ తరహా వలసలు కొద్దో గొప్పో తగ్గాయి. ఈ నేపథ్యంలోనే రిషి అత్యుత్సాహంగా ఎన్నికల ప్రకటన చేశారు. అయితే ఈ పరిస్థితి నిలకడగా కొనసాగుతుందా... మళ్లీ దిగజారుతుందా అన్న సంశయం కన్సర్వేటివ్ శ్రేణులను పట్టి కుదుపుతోంది.

అమెరికా నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ప్రపంచంలో ఎప్పుడు ఎక్కడ ఎన్నికలు జరిగినా తప్పుడు సమాచారాన్ని జనం మెదళ్లకు ఎక్కించే ప్రయత్నం రివాజుగా మారింది. బ్రిటన్ కూడా అందుకు మినహాయింపు కాదు. దేశం ఎదుర్కొంటున్న సకల అరిష్టాలకూ యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో కొనసాగటమే కారణమన్న తప్పుడు ప్రచారాన్ని తలకెత్తుకున్నది కన్సర్వేటివ్ పార్టీయే. చివరకు వారి ఏలుబడిలోనే తప్పనిసరై ఆ తంతు ముగించారు. బ్రిటన్ స్వేచ్ఛాజీవి అయింది. అయినా ఆర్థిక ఒడుదొడుకులు దాన్ని పీడించాయి. అధిక ధరలు, నిరుద్యోగం పాలకపక్షాన్ని నిద్రపోనీయకుండా చేశాయి. వోటర్లలో కనబడిన అనాసక్తత వల్ల 2019 డిసెంబర్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ రాకపోవచ్చన్న అంచనాలు కూడా వచ్చాయి. కానీ అనూహ్యంగా కన్సర్వేటివ్ పార్టీ నికరమైన మెజారిటీతో బోరిస్ జాన్సన్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆర్థిక అవ్యవస్థను చక్కదిద్దలేక ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. ఆయన స్థానంలో వచ్చిన లిజ్ ట్రస్ సైతం ప్రజల్ని నిరాశపరిచారు. కనుకనే ప్రధానిగా రిషి సునాక్‌ను కన్సర్వేటివ్ పార్టీ ఎంచుకుంది. కానీ పదవిలోకొచ్చింది మొదలు రిషికి సమస్యలు తప్పలేదు. జాన్సన్, ట్రస్‌ల మాదిరే ఆయనపై కూడా సాధారణ వోటర్లలో ఏవగింపు మొదలైంది. వ్యక్తిగతంగా రిషి రేటింగ్ కూడా తీసికట్టే! సర్వేలన్నీ వరసబెట్టి దీన్నే చాటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలకు సిద్ధపడటమంటే ఏ ప్రధానికైనా ఆత్మహత్యాసదృశమే. కానీ రిషి తెగింపు వెనక కారణం ఉంది. ప్రత్యర్థి లేబర్ పార్టీకి వోటర్ల ఆదరణ బాగానేవున్నా వ్యక్తిగతంగా ఆ పార్టీ నాయకుడు కియర్ స్టార్మర్ పై ప్రజలకంత విశ్వాసం లేదు. అందుకే ఎన్నికలకు ఇంతకన్నా మంచి ముహూర్తం ఉండబోదన్న నిర్ణయానికి రిషి వచ్చివుండొచ్చు. దానికితోడు స్టార్మర్ ప్రధాన నినాదం 'ఆర్థిక సుస్థిరత'. అది ఇప్పటికే సాధించినట్టు గణాంకాలు చెబుతుండగా ఆ నినాదానికి విలువుండదని రిషి నమ్మకం.

రష్యా దురాక్రమణ యుద్ధం, గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ, ఇరాన్ దూకుడు... మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తాయన్న భయాందోళనలు అన్నిచోట్లా ఉన్నట్టే బ్రిటన్‌లోనూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మితవాద పార్టీ కన్సర్వేటివ్‌లు అధికారంలో ఉండటమే ఉత్తమమన్న వాదనను ఆ పార్టీ తెరపైకి తీసుకొస్తోంది. సైనిక వ్యయాన్ని అదుపు చేస్తామన్న లేబర్ పార్టీ వాగ్దానం ప్రమాదకరమని కూడా ఆ పార్టీ ప్రచారం మొదలుపెట్టింది. కనుక రాబోయే ఎన్నికలు రక్షణ, భద్రత చుట్టూ తిరిగే అవకాశం లేకపోలేదు. తనకొచ్చిన అవకాశాన్ని లేబర్ పార్టీ సద్వినియోగం చేసుకుని అధికారంలోకి వస్తుందా లేక వోటర్లను ఒప్పించలేక చతికిల పడుతుందా అన్నది మరికొన్నాళ్లలో తేలిపోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, **తిథి:** బ.పాడ్యమి సా.6.55 వరకు, తదుపరి విదియ
నక్షత్రం: అనూరాధ ఉ.9.58 వరకు, తదుపరి జ్యేష్ఠ
వర్జ్యం: ప.3.43 నుండి 5.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.03 నుండి 8.51 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.11 వరకు
అమృతఘడియలు: రా.1.32 నుండి 3.13 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

రైసీ మరణం రేపుతున్న ప్రశ్నలు

విశ్లేషణ



కేసీ సింగ్

ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడుల నేపథ్యంలో... ఇజ్రాయెల్‌తో, అమెరికాతో ఇరాన్‌కు ప్రచ్ఛన్న ఘర్షణ జరుగుతున్న తరుణంలో ఆ దేశాధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హఠాన్మరణం ఇరాన్‌కు అకాల ఘటనే అని చెప్పాలి. తాలిబాన్ పాలనలో ఉన్న అఫ్గానిస్తాన్, ఇరాన్ దేశాలు ఇజ్రాయెల్‌తో పోరాడటానికి తమ ప్రచ్ఛన్న ఘర్షణలను ముందుకు తీసుకువెళుతున్న దశ ఇది. ఇరాన్ పట్ల భారత్ సానుకూల వైఖరి చేపడుతున్న ఈ దశలో.. రైసీ మరణం అనేక ప్రశ్నలు రేపుతోంది. ఆంక్షల నుండి భారతదేశాన్ని మినహాయించడానికి అమెరికన్లు గతంలో కంటే తక్కువ సుముఖతనే ప్రదర్శిస్తారా అన్నది ప్రధాన ప్రశ్న. భారత్ – ఇరాన్ సంబంధాలపై రైసీ మరణం ఎలాంటి ప్రభావం చూపబోతోందన్నది మరొక కీలకమైన ప్రశ్న.

హమాస్‌కి ధన, ఆయుధాల సరఫరాదారుగా, ప్రేరేపకురాలిగా ఇరాన్‌పై ఆరోపణలున్నాయి. ఇరాక్, సిరియా, లెబనాన్‌లో ఉంటున్న ఇరాన్ అనుకూల సాయుధ గ్రూపులు, ప్రత్యేకించి హిజ్బొల్లాను ఇందులో భాగస్వాములుగా పరిగణిస్తున్నారు. ఇజ్రాయెల్‌పై తన మొట్టమొదటి ప్రత్యక్ష క్షిపణి, డ్రోన్ దాడిని ఇరాన్ ఈ ఏప్రిల్ 13న ప్రారంభించింది. డమాస్కస్‌లోని ఇరాన్ దౌత్య భవనంపై ఇజ్రాయెల్ బాంబు దాడి చేయడం ఇరాన్‌ని రెచ్చగొట్టటం అందుకు కారణం. పశ్చిమాసియాలో ఇరాన్ రహస్య కార్యకలాపాలను సమన్వయం చేస్తున్న కొంతమంది ఇరాన్ సైనిక కమాండర్లు ఈ దాడి ఘటనలో చనిపోయారు.

బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, ఇరాన్ నుండి ఇరాక్, సిరియా, లెబనాన్ మీదుగా మధ్యధరా సముద్రం వరకు నడుస్తున్న షియా ప్రభావిత ప్రాంతంలో తన అణు కార్యక్రమాన్ని, వ్యూహాత్మక విస్తరణను నియంత్రించడానికి ఇరాన్‌తో కలిసి పనిచేసే అవకాశాన్ని అమెరికా ఎంచుకుంది. ఈ నేపథ్యంలోనే ఇరాన్, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలకు జర్మనీ మధ్య 2015లో అణు ఒప్పందం కుదిరింది. అయితే, అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2018లో ఇరాన్‌పై ఆంక్షలు విధిస్తూ ఆ ఒప్పందం నుండి వైదొలిగారు. అదే సమయంలో, అమెరికా అనుసరించే ఇజ్రాయెల్ అనుకూల వైఖరిని మరింతగా పెంచి పోషించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో స్థావరాల ఏర్పాటును అరికట్టడానికి లేదా ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాల మధ్య పరిష్కారం విషయంలో ఇజ్రాయెల్ వైపునుంచి నిబద్ధతను సాధించకుండా అమెరికా రాయబార కార్యాలయాన్ని ఏకపక్షంగా జెరూసలేంకు మార్చివేశారు.

తదుపరి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ విధానాన్ని పునఃపరిశీలించడానికి ప్రయత్నించారు, కానీ మొదటగా కోవిడ్–19 మహమ్మారి, తరువాత ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ అంశంపై పెద్దగా దృష్టి సారించలేదు. ఈలోగా, ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సంతకం చేసిన అబ్రహాం ఒప్పందాలను ఉపయోగించి కొత్త పశ్చిమాసియా, గల్ఫ్ భద్రతా నమూనా అమలు గురించి అమెరికా ఊహించింది. ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకురావడానికి యూఏఈ, బహ్రెయిన్, మొరాకో, సౌదీ అరేబియా వంటి తన అనుకూల అరబ్ దేశాలను అమెరికా ప్రోత్సహించింది. ఇరాన్‌తో, పశ్చిమాసియాతో తన లోతైన రాజకీయ సంబంధాలను కొనసాగించడమే దీని లక్ష్యం. కానీ ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కొత్త సంకీర్ణ ప్రభుత్వంతో, పాలస్తీనా ప్రాధాన్యాన్ని తగ్గించి వేయడాన్ని సమర్థిస్తున్న తీవ్ర మితవాద పార్టీలతో ఎదురయ్యే ప్రమాదాన్ని అమెరికా విస్మరించింది. ప్రాంతీయ భౌగోళిక రాజకీయాలలో పాలస్తీనియన్లు ప్రాముఖ్యం కోల్పోయారని నెతన్యాహు ఈ సందర్భంగా వాదించారు.



హఠాన్మరణం : ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ

ఈ కొత్త దృక్పథం ఆధారంగా భారత్, మధ్య ప్రాచ్యం, యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎమ్ఈసీ) ప్రతిపాదనకు వచ్చింది. యూఏఈ, సౌదీ అరేబియా, అమెరికా, భారతదేశ నాయకులు న్యూఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఈ ప్రతిపాదనను ఘనంగా ఆవిష్కరించటం కోసం సమావేశమయ్యారు. కానీ అదానీ యాజమాన్యంలోని హైఫా ఓడరేవు ల్యాండ్ రూట్ ముగింపు కేంద్రంగా ఉన్న ఇజ్రాయెల్‌ని ఈ సందర్భంగా ప్రస్తావనలోకి తీసుకోలేదు. పాలస్తీనా సమస్యను పరిష్కరించే విషయంలో ఇజ్రాయెల్ నుంచి నిబద్ధత లేకుండా, అబ్రహాం ఒప్పందాలపై సంతకం చేయడాన్ని సౌదీ స్పష్టంగానే ప్రతిఘటించింది. తర్వాత ఒక సంవత్సరం లోపే, ఇరాన్ ప్రేరేపిత గాజా సంక్షోభం ఐఎమ్ఈసీ ప్రాజెక్ట్‌ను ఎత్తివేసింది. యూఏఈ, బహ్రెయిన్ వంటి అబ్రహాం ఒప్పందాలపై సంతకం చేసిన దేశాలు కూడా దేశీయ ప్రజాభిప్రాయాన్ని, అరబ్ ప్రజానీకం ఆగ్రహాన్ని సంతృప్తి పరచడానికి, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తమ బహిరంగ వైఖరిని కఠినతరం చేయవలసి వచ్చింది.

అమెరికా–ఇజ్రాయెల్ ప్రణాళికలను చిత్తు చేసిన ఇరాన్ ఈ క్రమంలో రష్యా–చైనా కూటమికి దగ్గరైంది. రష్యాకు సాయుధ డ్రోన్‌ల ప్రధాన సరఫరాదారుగా ఇరాన్ మారింది. ఈ దశలోనే రైసీ మరణం సంభవించింది. రైసీ తన నాలుగేళ్ల పదవీకాలంలో మూడో సంవత్సరంలో ఉన్నారు. ఇరాన్ న్యాయవ్యవస్థ మాజీ అధిపతిగా, ప్రజాస్వామ్య దేశాలలో ప్రధాన న్యాయమూర్తుల కంటే ఎక్కువ అధికారం ఉన్న పదవిలో, ఆయన రక్తపు మరకలతో కూడిన కలుషిత గతాన్ని కలిగి ఉన్నారు. 1980లలో రాజకీయ ఖైదీల సామూహిక మరణశిక్షను ఆయన పర్యవేక్షించారు. 2021లో తన ఎన్నిక సాధారణ ఇరాన్ అధ్యక్ష ఎన్నికల కంటే తక్కువ స్వేచ్ఛాయుతంగా జరిగింది. సాంప్రదాయికంగా సుప్రీం లీడర్, అతని సలహాదారులు అధ్యక్ష అభ్యర్థుల జాబితాను కత్తిరించడానికి గార్డియన్ కౌన్సిల్‌ను ఉపయోగిస్తారు. గతంలో ప్రజలకు కొంత ఎంపిక అవకాశాన్ని, ఎన్నికల స్వేచ్ఛను అందించడానికి దీన్ని తెలివిగా అమలు చేశారు. 1997లో మొహమ్మద్ ఖతామీ ఎన్నికైనప్పుడు, అతను వ్యవస్థానుకూలమైన, సంప్రదాయవాదులను ఓడించిన, గుర్తింపు పొందిన సంస్కరణవాదిగా ఉండేవారు. పాశ్చాత్య ఆంక్షల కారణంగా ఏర్పడిన ఆర్థిక కష్టాల వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ విధానాన్ని 2021లో నిలిపివేశారు. తరువాత, 2022 సెప్టెంబరులో పోలీసు కస్టడీలో మహ్సా అమిని అనే యువతి మరణం, ముఖ్యంగా మహిళల నుండి విస్తృతమైన నిరసనలను రేకెత్తించింది. వ్యవస్థ నైతిక అధికారం దెబ్బతినడంతో, 2021 ఓటింగ్ శాతం 60 శాతం లేదా అంతకంటే ఎక్కువ నుండి 49 శాతానికి పడిపోయింది. వాస్తవానికి, ఓటర్లు 13 శాతం వ్యతిరేక ఓట్లను వేయడం ద్వారా తమ నిరసన తెలిపారు. ఇది రైసీ ప్రత్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే కూడా ఎక్కువ. ఇప్పుడు 50 రోజుల్లో కొత్త అధ్యక్ష ఎన్నికలు జరగాలి.

ప్రస్తుత పరిస్థితి భారతదేశం–ఇరాన్ సంబంధాలపై ఎలా ప్రభావం చూపుతుందన్నది పెద్ద ప్రశ్న. చాబహార్ ఓడరేవు భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాలకు ప్రధాన చిహ్నం. ఓడరేవును అభివృద్ధి చేయడానికి ఇటీవలి పదేళ్ల ఒప్పందం తరువాత, అమెరికా ఆంక్షల హెచ్చరికను జారీ చేసింది. అఫ్గానిస్తాన్, ఇరాన్ దేశాలు ఇజ్రాయెల్‌తో పోరాడటానికి తమ ప్రతినిధులను ముందుకు తీసుకువెళుతున్నందున, అమెరికన్లు భారతదేశానికి మినహాయింపు ఇవ్వడానికి గతంలో కంటే తక్కువ సుముఖంగా ఉండవచ్చు.

1996–2001 కాలంలో తాలిబాన్లు అఫ్గానిస్తాన్‌ను నియంత్రించినప్పుడు ఇండో–ఇరానియన్ వ్యూహాత్మక కలయిక అత్యంత సన్నిహితంగా ఉండేది. రెండు దేశాలూ అహ్మద్ షా మసూద్ నేతృత్వంలోని ఉత్తర కూటమికి మద్దతు ఇచ్చారు. కానీ 2003 నుండి, ఇరాన్ రహస్య అణు కార్యక్రమం వెల్లడి, అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన తర్వాత, భారతదేశం అమెరికాతో అణు ఒప్పందంపై చర్చలు ప్రారంభించింది. అప్పటి నుండి, ఇరు దేశాల మధ్య సంబంధాలు వ్యూహాత్మక అనుమానం, లావాదేవీలలో సహనం మధ్య హెచ్చుతగ్గులకు లోనయ్యాయి.

రైసీ మరణం ఈ ప్రాథమిక అంశాలను మార్చదు. ఏది ఏమైనప్పటికీ, ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలిలోని సుప్రీం లీడర్, సలహాదారులు, ముఖ్యంగా దాని సెక్రటరీ జనరల్ అలీ అక్బర్ అహ్మదీయన్ ఇరాన్ విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తారు. కానీ రైసీ మరణం ఇరాన్ అంతర్గత రాజకీయ సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే అధికార శూన్యతను పూరించడానికి ఎవరో ఒక నేతను పైకి లేపడం ప్రారంభం కానుంది.

వ్యాసకర్త ఇరాన్ మాజీ రాయబారి,
మాజీ కార్యదర్శి, విదేశాంగ మంత్రిత్వ శాఖ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఊరెళ్లిపోయాం!



37 ఏళ్లుగా అమెరికన్‌గా ఉన్న నేను... నా భార్య, మా బిడ్డతో కలసి ఆమె పుట్టిల్లు మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)కు తరలిపోయాం. ఆమె గర్భిణిగా ఉన్నప్పటి ఆసుపత్రి ఖర్చులను చెల్లించే విషయమై మా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి ఎదురైన చేదు అనుభవమే ఇందుకు కారణం. – ఆండ్రూ పోలినో, డిజిటల్ ప్రొడ్యూసర్

మరింత జటిలం!



మూడో విడత అధికారంలోకి వచ్చాక ఎన్డీయే గోవధను నిషేధిస్తుందని, సీతమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తుందని అమిత్ షా తన ఎన్నికల ప్రచారంలో చెబుతున్న దానిని బట్టి భవిష్యత్తు మరింత సమస్యాత్మకం కాబోతోందనిపిస్తోంది. అసలు మన జీవితాలకు ఇంత సంఘర్షణ అవసరమా?

– ప్రీతిష్ నంది, ప్రముఖ జర్నలిస్టు, కవి

స్పష్టతనివ్వండి



పాండియన్! మీకు దమ్ముంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీయేకు మద్దతు ఇవ్వబోనని, 'ఇండియా' కూటమి వైపు నిలబడతానని మీ సార్ (ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్) చేత ఒక ప్రకటన ఇప్పించగలరా? (పాండియన్ బీజేడీలో ద్వితీయ నేత. నవీన్ పట్నాయక్ విశ్వాసపాత్రుడు).

– సంజయ్ ఘోష్, న్యాయవాది

వస్తు ప్రపంచం



భారతీయ వస్తూత్పత్తి రంగం వర్సెస్ సేవల రంగం అనే అంశంపై చర్చ జరిగినప్పుడు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వస్తూత్పత్తి రంగానికి ప్రాధాన్యమిస్తూ మాట్లాడారు. ఈ ఎంపిక గురించి ఏమంటాం? ఉత్పత్తి, సేవా రంగాలు కలసి నడిస్తేనే కదా అభివృద్ధి! – అరవింద్ సుబ్రహ్మణియన్, ఆర్థిక సలహాదారు

మరపురాని మనిషి



ఇబ్రహీం రైసీ వేలాది అమాయక ఇరానీయులకు ఉరిశిక్ష విధించాడు. టెహ్రాన్ 'ఉరి మనిషి', 'కసాయి'గా పేరు పడ్డాడు. ఆ తర్వాత దేశానికే తలారి అయ్యాడు. అందుకే రైసీ చనిపోయాడని నిర్ధారణ కాగానే ఇరాన్ వ్యాప్తంగా లక్షల మంది రహస్యంగా వేడుక చేసుకున్నారు.

– పీటర్ అడా, ప్రవాస ఇరానీయుడు

మాటలతో చంపేశారు!



ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో పై అంతస్తు బాల్కనీ నుంచి తల్లి చేతుల్లోంచి కిందికి పడబోయిన పసికందును ఆ అపార్ట్‌మెంట్‌లోని మిగతా ఫ్లాట్‌ల వారు భద్రంగా కాపాడిన వీడియో ఒకటి కొద్ది రోజుల క్రితం వైరల్ అయింది. ఆ వీడియోను చూసిన ప్రతి ఒక్కరూ ఆ పసికందు తల్లిని మాటల్లో చెప్పలేని విధంగా దూషిస్తూ పోస్టులు పెట్టారు. ఆ పోస్టులు భరించలేక ఆ తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఏం సమాజం?!

– చిన్మయి శ్రీపాద, గాయని

అచ్ఛే దిన్




నేను భారతదేశం పట్ల ఆశావహ దృక్పథంతో ఉన్నాను. రైతులు, కార్మికుల నుంచి ప్రొఫెసర్లు, కార్పొరేట్ నాయకులు, ప్రభుత్వంలోని ఐ.ఎ.ఎస్., ఐ.ఎఫ్.ఎస్. అధికారుల వరకు... దేశం పట్ల శ్రద్ధ వహించే వారంతా తప్పు మార్గంలో వెళుతున్నామని గ్రహించినట్టు అనిపిస్తోంది.

– కౌశిక్ బసు, కార్నెల్ యూనివర్సిటీ ప్రొఫెసర్

ఆధునిక వైద్య తారలు

ఆధునిక భారతీయ వైద్యశాస్త్రం గురించి మాట్లాడేటప్పుడు తప్పనిసరిగా నలుగురు మహిళల గురించి చెప్పాలి. అమోఘమైన ప్రతిభ, శ్రమతో వారు మన వైద్య చరిత్ర గతినే మార్చారు.

ఫ్లారెన్స్ డిసెంట్ అందులో ఒకరు. ఆమె కలకత్తాలో జన్మించిన ఆంగ్లో ఇండియన్. 1894లో స్కాటిష్ మెడికల్ అండ్ సర్జికల్ కళాశాలల నుంచి ట్రిపుల్ క్వాలిఫికేషన్స్ సంపాదించుకున్న 48 మందిలో ఒకరు. అలహాబాద్ డఫ్రిన్ హాస్పిటల్లో పనిచేస్తూ ఘోషా పద్ధతి వల్ల ఆరోగ్యం కోల్పోయిన భారతీయ స్త్రీల ప్రసవ సంబంధిత సమస్యలపై చేసిన కేస్ స్టడీస్‌ను 1891, 1892, 1895 సంవత్సరాల్లో 'ఇండియన్ మెడికల్ గెజిట్'లో ప్రచురించారు. ఈ అరుదైన సమాచారం తర్వాత కాలంలో వైద్యశాస్త్ర ప్రగతికి చాలా దోహదం చేసింది. 1922లో బొంబాయి ప్రభుత్వ పరిశ్రమలలో పనిచేసే మహిళా కార్మికుల ప్రసూతి స్థితిగతులను అధ్యయనం చేసి ఆమె ఇచ్చిన నివేదిక 'బొంబాయి లేబర్ గెజిట్'లో ప్రచురితమయ్యింది. మరో గొప్ప మహిళ ఎడిత్ మేరీ బ్రౌన్. ఈమె ఆసియా ఖండంలోనే తొలిసారిగా మహిళలకు వైద్య శిక్షణ అందించే మెడికల్ కాలేజ్‌ను లూధియానాలో 1894లో స్థాపించారు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు ఇప్పటి పాకిస్తాన్ ప్రాంతం నుంచి ఎంతో మంది సిక్కు, హిందూ మతస్థులు ఈ ఆసుపత్రికి కాందిశీకులుగా వచ్చి ఆరోగ్యంతో పాటు రక్షణ కూడా పొందారు. ఎడిత్ 1952లో పదవీవిరమణ చేసి కశ్మీర్‌కు వెళ్లారు. 92 ఏళ్ల వయసులో 1956 డిసెంబర్ 6న శ్రీనగర్ లో ఎడిత్ తుదిశ్వాస విడిచారు.



ఫ్లారెన్స్ డిసెంట్


స్కాట్లాండ్‌కు చెందిన మార్గరెట్ ఐదా బల్ఫోర్ 1892లో భారతదేశం వచ్చి లూధియానాలో జనానా ఆసుపత్రి మేనేజర్‌గా చేరారు. ఇక్కడ స్త్రీల ఆరోగ్యం, మంత్రసానులు ప్రసవ సమయాల్లో వాడే పద్ధతులు, ఇతర సాంఘిక పరిస్థితులను అధ్యయనం చేశారు. 1914లో పంజాబ్ లోని సివిల్ ఆసుపత్రుల ఇన్స్పెక్టర్ జనరల్‌గా నియమితులై రెండేళ్ల తర్వాత ఉమెన్స్ మెడికల్ సర్వీస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె రాసిన 'ది వర్క్ ఆఫ్ మెడికల్ ఉమెన్ ఇన్ ఇండియా' పుస్తకం ఎంతో విలువైనది.

పేథాలజిస్ట్‌గా, సర్జన్ గా కొంతకాలం పని చేసిన చార్లెట్ లైటన్ హోల్టన్ 1918–19 కాలంలో ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కళాశాలలో బోధించారు. తర్వాత సిమ్లాలో ఉమెన్స్ మెడికల్ సర్వీస్‌లో సూపరింటెండెంట్‌గా సేవలందించారు. పిమ్మట చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు. 'డఫ్రిన్ ఫండ్' సెక్రటరీగా పనిచేస్తున్న కాలంలో 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' గా ఇప్పుడు పిలుస్తున్న సంస్థ స్థాపనకు ప్రణాళిక రచించారు.

– డా।। నాగసూరి వేణుగోపాల్, । 94407 32392

ఈజ్ ఆఫ్ డూయింగ్ సైన్స్‌లో వెనుకబాటు

అభిప్రాయం



ఈదర శ్రీనివాసరెడ్డి

భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంతగానో దోహదం చేస్తాయి. అయితే శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం పశ్చిమ దేశాలతో పోలిస్తే వెనకబడే ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుండి శాస్త్ర సాంకేతిక రంగాలను ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తూనే వస్తున్నాయి. వీటిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు కేటాయించిన తక్కువ మొత్తంలోని నిధులే ఇందుకు సాక్ష్యాలు. ఆధ్యాత్మికవేత్తలనూ, శాస్త్రవేత్తలనూ, విద్యా వేత్తలనూ, వైద్య నిపుణులనూ, ఖగోళ శాస్త్రజ్ఞులనూ ఖజాన మోయాలి, ఎందుకంటే వీరి వల్ల మానవాళికి ఎనలేని సేవలు ఒనగూరుతున్నాయి. కాని, ఇటువంటివారికి దేశంలో సరైన ఆదరణ లేక ఇతర దేశాలకు వలస వెళ్లవలసి వస్తోంది.



ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న అనేక పరిశోధనాభివృద్ధి సంస్థలు తమకు కేటాయించే నిధులను రెండింతలు చెయ్యాలని కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. 2005–2009 మధ్య మన దేశ జీడీపీలో 0.8 శాతం నిధులు కేటాయించగా, అవి 2017–2019 నాటికి 0.7 శాతానికీ, 2021– 2022 నాటికి 0.64 శాతానికీ పడిపోవడం గమనార్హం. అభివృద్ధి చెందిన దేశాలు ఈ రంగంపై 2 శాతం నుండి 4 శాతం వరకు నిధులు కేటాయిస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిలోని సభ్యదేశాలు సగటున 2.7 శాతం నిధులు ఖర్చు పెడుతున్నాయి. అమెరికా, చైనా, యూకే వంటి దేశాలు 2 శాతం కన్నా ఎక్కువ నిధులు ఖర్చు పెడుతున్నాయి. కాని మన దేశం 1 శాతం నిధులు కూడా ఈ రంగానికి కేటాయించడం లేదు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవతరించాలంటే ఈ నిధులు కనీసం 3 శాతంగా వుండాలి. ఇప్పటి నుంచే 3 శాతం నిధులు కేటాయిస్తూ పోతే కాని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేము.

ఉన్నత విద్య, శాస్త్రసాంకేతిక రంగాల వంటివాటిపై ఖర్చు పెడుతున్న నిధులు సామాన్యులు కొనే పెట్రోలు, డీజిల్ వంటివాటిపై విధించే సెస్సు నుండి వస్తుండటం గమనార్హం. 2020–2021లో ఈ రంగానికి కేటాయించిన నిధులలో 43 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వ వాటా. 30 శాతం ప్రైవేటు రంగం నుండి, 7 శాతం రాష్ట్ర ప్రభుత్వాల నుండి, 9 శాతం ఉన్నత విద్యా సంస్థల నుండి సేకరించారు. అభివృద్ధి చెందిన దేశాలలో నిధులు ప్రైవేటు రంగం నుండే వస్తున్నాయి. కాని మనదేశంలో నాణ్యమైన పరిశోధనలు జరగకపోవటం, మేధాహక్కుల ఉల్లంఘన, పరిశోధనా ఫలితాల చోరీ వంటి వాటి వల్ల ఈ రంగంపై పెట్టుబడులు పెట్టటానికి ప్రైవేటు పరిశ్రమలు ముందుకు రావటం లేదు.

2023లో కొత్త పరిశోధనా నిధులను కేటాయించడానికి కొత్తగా 'అనుసంధాన్ జాతీయ పరిశోధనా నిధుల సంస్థ' ఏర్పాటయ్యింది. దీని ద్వారా రానున్న 5 ఏళ్ల కాలంలో 6 బిలియన్ డాలర్లను పరిశోధనలపై ఖర్చు పెట్టనున్నారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రతిపాదనల్లో భాగంగా 2023–2025 మధ్య కాలంలో పరిశోధనలకు రూ. 50,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. వీటిలో 11 శాతం నిధులు టైర్ 2, టైర్ 3 పరిశోధనా సంస్థలను బలోపేతం చెయ్యటానికి వినియోగించనున్నారు. ఈ నిధుల్లో రూ. 36,000 కోట్లు ప్రైవేటు రంగం నుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మరి ఎంతవరకు ఈ లక్ష్యం నెరవేరుతుందో చూడాలి.


వ్యాసకర్త ఆచార్య నాగార్జున యూనివర్సిటీ
ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

సంకీర్తన – సరైన దృక్పథం

ఇంతగా ధ్యానం చేసినప్పటికీ ఎందుకు మంచి ఫలితాలు రావటం లేదు, సద్గురువు ఉన్నప్పటికీ మనస్సులో చెడు విచారాలు ఎలా కలుగుతున్నాయి వంటి ప్రశ్నలు చాలా మంది సాధకులకు మనసులో తలెత్తుతూ ఉంటాయి. అయితే ఆ విధమైన ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు. అలాగని మనసును నిర్బంధించవలసిన అవసరమూ లేదు. అన్నిరకాలైన ఆలోచనలనూ రేకెత్తించడమే మనసు ప్రకృతి.

రైలులో ప్రయాణాన్ని ఉదాహరణగా తీసుకొందాం. ఒక రైలు బండి తన ద్వారా ప్రయాణించేవారు ఎటువంటివారు అనేదానితో నిమిత్తం లేకుండా ప్రయాణిస్తుంది. అలాగే అది వెళ్లే దారిలో అనేక స్టేషన్లు ఉంటాయి. అది వెళ్లవలసిన ప్రతి స్టేషనూ ఒకే విధంగా ఉండదు. కొన్ని పెద్దవీ, కొన్ని చిన్నవీ; కొన్ని శుభ్రంగానూ, కొన్ని మురికిగానూ ఉంటాయి. వీటినేమీ పట్టించుకోకుండా కేవలం గమ్యస్థానం చేరడమే రైలు పని. రైలు మాదిరిగా నీవు కూడా నీ గమ్యస్థానాన్ని చేరటమే జీవిత ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి. నీ ప్రయాణంలో పట్టుదల వదలకుండా, విశ్వాసం కోల్పోకుండా మనసు ఆడుకొనే ఆటలతో భంగపాటు చెందకుండా ఉండు. 'జీవిత ప్రయాణం' రైలు ప్రయాణం లాంటిదే. రైలులోనే గమ్యం చేరేదాకా ప్రయాణికుడు ఓపికగా, నమ్మకంతో కూర్చొని ఉన్నట్లు... జీవిత ప్రయాణంలో సహనంతో, విశ్వాసంతో స్థిమితంగా ఉండు. గురువు అనే డ్రైవర్ నీ జీవిత ప్రయాణంలో నిన్ను నీ గమ్యస్థానానికి నిక్షేపంగా చేర్చుతాడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మానవుడు జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇటువంటి సమస్యలకు పరిష్కారం అంతరంగం నుండే రావాలి. మనసే ఈ సమస్యలన్నింటినీ సృష్టిస్తుంది. కాబట్టి ఈ సమస్యలను తొలగించడం కూడా మనసే చేయగలుగుతుంది. మనసు సమతాస్థితిలో ఉన్నప్పుడు, వివేకంతో సమస్యలన్నింటినీ బహిర్గతం చేస్తుంది. మందబుద్ధికి ఈ సమస్యలకు అంతమే లభించదు. పైపైన తేలికగా కనపడే సమస్యలన్నీ వట్టి భ్రాంతి మాత్రమే. సుఖ, దుఃఖాలు మానవుని స్వాధీనంలోనే ఉన్నాయి. నీవు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని, భగవన్నామ సంకీర్తన చేస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనే నిమగ్నుడవై ఉన్నట్లయితే నీలో సరైన దృక్పథం వృద్ధి చెందుతుంది. అందువలన నీవు ప్రశాంతంగా ఉండగలవు.

ఢిల్లీ బరిలో స్వతంత్రుల సందడి

- వెల్డర్ నుంచి సామాజిక కార్యకర్త దాకా
- సామాజిక సమస్యలే ఎజెండాగా పోటీ

దండల్లేవు. నినాదాల్లేవు. పెద్ద ఎత్తున ప్రజానీకం లేరు. లౌడ్ స్పీకర్లు అసలే లేవు. ప్రచారానికి నిధులు కూడా లేవు. అయినా ఇల్లిల్లూ తిరుగుతూ ఓట్లడుగుతున్నారు. వారంతా ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన 49 మంది స్వతంత్ర అభ్యర్థులు. వీరిలో ఓ బహుళజాతి సంస్థ ఉద్యోగి మొదలుకుని వెల్డర్, మెకానిక్, సామాజిక కార్యకర్త, స్టాక్ ట్రేడర్ దాకా రకరకాల వాళ్లున్నారు. వీరిలో 67 ఏళ్ల సుభాష్ చందర్ హరియాణాలోని సిర్సా వాసి. కాలుష్యంతో ఢిల్లీ గ్యాస్ చాంబర్‌లా మారిపోయిందన్నది ఆయన ఆవేదన. దీన్ని ఎత్తి చూపేందుకే చాందినీ చౌక్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగానని చెబుతున్నాడు. డబ్బు ఆదా చేసేందుకు రాత్రుళ్లు గురుద్వారాల్లో బస చేస్తున్నాడు.

రూ.10కే భోజనం పెడతా

సౌత్ ఢిల్లీ బరిలో ఉన్న శంకర్ రాజధానిలో పోటీ చేస్తున్న ఏకైక బెంగాలీ అభ్యర్థి! 30 ఏళ్లు ఢిల్లీలోనే ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యారు. గెలిచినా ఓడినా ఎన్నికల తర్వాత ఢిల్లీలో ప్రజలకు రూ.10కే కడుపునిండా భోజనం అందిస్తానని ధీమాగా చెబుతున్నాడు! అల్లా జెత్మలానీ ఓ బహుళజాతి సంస్థలో మంచి హోదాలో పని చేశారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి బాసూరీ స్వరాజ్, సోమనాథ్ భారతిలతో తలపడుతున్నారు. పెచ్చరిల్లిన నిరుద్యోగంపై పోరాడేందుకే బరిలో దిగానంటున్నారు. ఉద్యోగిగా పొదుపు చేసుకున్న డబ్బును ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. సౌత్ ఢిల్లీలో బరిలో ఉన్న నవీన్‌కుమార్ వృత్తిరీత్యా వెల్డర్. చదువుకోలేదు. అందుకే సరైన విద్యా వ్యవస్థ కోసం బరిలో దిగాడు. ఆయన కోసం 12 మందితో కూడిన బృందం పని చేస్తోంది.



తనకు 6 లక్షల ఓట్లు ఖాయమంటున్నాడు! వెస్ట్ ఢిల్లీ నుంచి బరిలో ఉన్న సామాజిక కార్యకర్త అంజు శర్మ పూర్వాశ్రమంలో కాంగ్రెస్ నాయకురాలు. - న్యూఢిల్లీ


బిహార్‌లో ఆరో విడత...
బీజేపీకి అగ్నిపరీక్ష!

8 లోక్‌సభ స్థానాలకు రేపు పోలింగ్

- వాటిలో ఏడు ఎన్డీఏ సిట్టింగ్ సీట్లే
- ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి గట్టి పోటీ

పోలింగ్ జరిగే మొత్తం స్థానాలివి...
వాల్మీకి నగర్, పశ్చిమ్ చంపారన్, పూర్వీ చంపారన్, శివహర్, వైశాలి, గోపాల్‌గంజ్ (ఎస్సీ), సివాన్, మహారాజ్‌గంజ్.

బిహార్‌లో ఇప్పటిదాకా ఐదు విడతల్లో 24 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. శనివారం ఆరో దశలో 8 చోట్ల పోలింగ్ జరగనుంది. వీటిలో ఏకంగా ఏడు ఎన్డీఏ సిట్టింగ్ స్థానాలే కావడం విశేషం. దాంతో వాటిని నిలబెట్టుకోవడం బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్-ఆర్జేడీ-లెఫ్ట్ పార్టీలతో కూడిన ఇండియా కూటమి ఈసారి గట్టి పోటీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో కీలక స్థానాలపై ఫోకస్... - సాక్షి, నేషనల్ డెస్క్



వైశాలిలోని క్రీస్తుపూర్వం మూడో శతాబ్దం నాటి అశోక స్తంభం

వాల్మీకి నగర్... పోటాపోటీ



• సునీల్ కుమార్

గత ఎన్నికల్లో జేడీ(యూ) నేత బైద్యనాథ్ ప్రసాద్ మహతో 3.5 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. ఆయన మరణానంతరం ఉప ఎన్నికలో తనయుడు సునీల్ కుమార్ కుష్వాహ గెలుపొందారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున ఆర్జేడీ అభ్యర్థి దీపక్ యాదవ్ తలపడుతున్నారు. బీఎస్పీ దుర్గేశ్ సింగ్ చౌహాన్‌ను రంగంలోకి దించడంతో పోటీ హీటెక్కింది. నేపాల్ సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గంలో 22 శాతం ముస్లింలు, 15 శాతం ఎస్సీ ఓటర్లుంటారు.

పశ్చిమ్ చంపారన్... కమలం అడ్డా

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2008లో ఉనికిలోకి వచ్చినప్పటి నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. బీజేపీ తరఫున సంజయ్ జైశ్వాల్ గత ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టారు. ఈసారి ఆయనే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ తివారీ, బీఎస్పీ నుంచి ఉపేంద్ర రామ్ పోటీ చేస్తున్నారు. పలువురు ముస్లిం అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా బరిలో ఉండటం విశేషం. సుమారు 4 లక్షలున్న ముస్లిం ఓటర్లు ఇక్కడ కీలకం. బనియా, బ్రాహ్మణ ఓటర్లు రెండేసి లక్షల చొప్పున, యాదవులు, కుర్మి, కుశ్వాహ సామాజిక వర్గ ఓటర్లు 1.5 లక్షల చొప్పున ఉన్నారు. నితీశ్ ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇండియా కూటమి గట్టి పోటీ నేపథ్యంలో బీజేపీ ఎదురీదుతోంది.



• సంజయ్ జైశ్వాల్

గోపాల్‌గంజ్... లాలు సొంత జిల్లా



• అలోక్ కుమార్

తొలుత కాంగ్రెస్ గుప్పిట్లో ఉన్న ఈ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో క్రమంగా ప్రాంతీయ పార్టీలు పాగా వేశాయి. బిహార్ మాజీ ముఖ్యమంత్రి అబ్దుల్ గఫూర్ జనతాదళ్ తరఫున, సమతా పార్టీ తరఫున రెండు సార్లు ఇక్కడ గెలిచారు. ఆర్జేడీ, బీజేపీ ఒక్కోసారి మాత్రమే విజయం సాధించాయి. గత ఎన్నికల్లో జేడీయూ తరఫున అలోక్ కుమార్ సుమన్ 2.86 లక్షలకు పైగా ఓట్ల తేడాతో ఆర్జేడీ నేత సురేంద్ర రామ్‌పై విక్టరీ కొట్టారు. కాగా, ఈసారి కాంగ్రెస్, ఆర్జేడీ, లెఫ్ట్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) ఇండియా కూటమి తరఫున వీఐపీ అభ్యర్థి ప్రేమ్‌నాథ్ చంచల్ పాశ్వాన్ బరిలోకి దిగారు. ఎన్డీఏ నుంచి జేడీయూ సిట్టింగ్ ఎంపీ అలోక్ కుమార్ పోటీలో ఉన్నారు. కాగా, ముస్లిం ఓటర్లు కూడా ఎక్కువగానే ఉన్న నేపథ్యంలో ఇక్కడ మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) దియానాథ్ మాంఝీని రేసులో నిలపడంతో పోటీ రసవత్తరంగా మారింది. బీఎస్పీ కూడా సుజీత్ రామ్‌ను రంగంలోకి దించింది. ఇది లాలు, తేజస్వి సొంత జిల్లా కావడంతో ఆర్జేడీ ఈ సీటుపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. 94 శాతం గ్రామీణ జనాభా గల ఈ సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవడానికి నితీశ్ కుమార్ కూడా తీవ్రంగానే కష్టపడుతున్నారు. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో జేడీయూ, బీజేపీ, ఆర్జేడీ ఖాతాలో తలో రెండు సీట్లు ఉన్నాయి.

పూర్వీ చంపారన్... రాధామోహన్ జోరు



• రాధామోహన్ సింగ్

బీజేపీ సిట్టింగ్ ఎంపీ రాధామోహన్ సింగ్ గత ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. 1989లో ఇక్కడ తొలిసారి కాషాయ జెండా పాతింది కూడా ఆయనే! ఇండియా కూటమి నుంచి వంచిత్ సమాజ్ ఇన్సాఫ్ పార్టీ అభ్యర్థి రాజేశ్ కుమార్ పోటీ చేస్తున్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 6 అసెంబ్లీ సెగ్మెంట్లలో 4 బీజేపీ ఖాతాలో ఉండగా, జేడీయూ, ఆర్జేడీ చెరొకటి దక్కించుకున్నాయి.

వైశాలి... ప్రాంతీయ పార్టీల హవా



• వీణా దేవి

1977లో ఏర్పాటైన ఈ ఎంపీ సీటును కాంగ్రెస్ నుంచి ప్రాంతీయ పార్టీలు చేజిక్కించుకున్నాయి. 1996 నుంచి ఆర్జేడీ కంచుకోటగా మారింది. ఆ పార్టీ సీనియర్ నేత రఘువంశ్ ప్రసాద్ సింగ్ వరుసగా ఐదుసార్లు గెలిచారు. ఆర్జేడీ జైత్రయాత్రకు 2014లో ఎల్జేపీ బ్రేకులేసింది. రఘువంశ్‌పై ఎల్జేపీ అభ్యర్థి రామ్‌కిశోర్ సింగ్ గెలిచారు. 2019లో కూడా ఎల్జేపీ అభ్యర్థి వీణా దేవి చేతిలో రఘువంశ్ ఓటమి చవిచూశారు! ఈసారి కూడా ఎల్జేపీ (రాం విలాస్) నుంచి వీణా దేవే బరిలో ఉన్నారు. ఇండియా కూటమి నుంచి ఆర్జేడీ మున్నా శుక్లాను పోటీకి దించింది. ఆయన హత్య కేసులో బెయిల్‌పై ఉన్నారు. బీఎస్పీ నుంచి శంభు కుమార్ సింగ్ రేసులో ఉన్నారు. ఇక్కడ యాదవులు, కుష్వాహ, నిషాద్ సామాజిక వర్గాల ఓటర్లు కీలకం.

సిట్టింగ్ సీట్లలో గట్టి పోటీ

జార్ఖండ్‌లో 4 స్థానాలకు రేపు పోలింగ్ | అన్నీ ఎన్డీఏ స్థానాలే

ఆరో విడతలో భాగంగా జార్ఖండ్‌లో 4 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. ఇవన్నీ ఎన్డీఏ సిట్టింగ్ స్థానాలే కావడం విశేషం. మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్ట్ బీజేపీ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమంటూ జేఎంఎం ప్రచారంలో హోరెత్తిస్తోంది. బీజేపీకి మద్దతుగా నిలుస్తున్న ఆదివాసీలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆరో విడత స్థానాలపై ఫోకస్...
- సాక్షి, నేషనల్ డెస్క్

ధన్‌బాద్

బొగ్గు గనుల స్థావరం. ఇక్కడి ఓటర్లలో 62 శాతం పట్టణవాసులే. ఎస్సీలు 16 శాతం, ఎస్టీలు 8 శాతముంటారు. యూపీ, బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి వలస వచ్చినవారు ఎక్కువ. 2009 నుంచి బీజేపీ కంచుకోటగా ఉంది. హ్యాట్రిక్ కొట్టిన సిట్టింగ్ ఎంపీ పశుపతినాథ్ పోటీకి దూరంగా ఉండటంతో ఎమ్మెల్యే దుల్లు మహతోకు బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి అనుపమా సింగ్ పోటీ పడుతున్నారు. వీరిపై రెండు పార్టీల్లోనూ అసంతృప్తే ఉంది. బీఎస్పీ, సమతా, ఆజాద్ సమాజ్, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా వంటి పార్టీలు, స్వతంత్రులు... ఇలా మరో డజను మంది బరిలో ఉన్నారు.

రాంచీ

సిట్టింగ్ ఎంపీ సంజయ్ సేఠ్‌ను కాదని 2014లో గెలిచిన రామ్ తహల్ చౌదరికి బీజేపీ ఈసారి టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి సుబోధ్‌కాంత్ సహాయ్ కుమార్తె, ప్రముఖ న్యాయవాది. యశస్వి పోటీ చేస్తున్నారు. తండ్రి ప్రాతినిధ్యం వహించిన స్థానం కావడం ఆమెకు కలిసొచ్చే అంశం. అయితే ఎంపీగా సంజయ్ పని తీరుపై ఏకంగా 73 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినట్టు గతేడాది ఓ సర్వేలో తెలిసింది. రాష్ట్రంలో బీజేపీకి ఆయన బలమైన గళంగా నిలుస్తున్నారు.



జంషెడ్‌పూర్

దీన్ని టాటా నగర్, స్టీల్ సిటీ అని కూడా పిలుస్తారు. టాటా స్టీల్ అతిపెద్ద ప్లాంట్ ఇక్కడ ఉంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ బిద్యుత్ బరణ్ మహతో హ్యాట్రిక్‌పై కన్నేశారు. 2019లో ప్రస్తుత సీఎం చంపయ్ సోరెన్‌పై 3 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారాయన. మాజీ ఎమ్మెల్యే కునాల్ సారంగికి టికెటివ్వకపోవడం ఒడిశావాసుల ఓట్లపై ప్రభావం చూపేలా ఉంది. కాకపోతే కుర్మి-మహతో ఓటర్లు 3 లక్షలకు పైగా ఉండటం మహతోకి కలిసొచ్చే అంశం. 27 శాతమున్న ఆదివాసీలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. జేఎంఎం నుంచి సమీర్‌కుమార్ మొహంతీ బరిలో ఉన్నారు.

గిరిధ్

బీజేపీకి బలమైన స్థానమిది. పొత్తులో భాగంగా ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ)కు విడిచిపెట్టింది. ఏజేఎస్‌యూ సిట్టింగ్ ఎంపీ చంద్రప్రకాశ్ చౌదరి మరోసారి పోటీ చేస్తున్నారు. జేఎంఎం నుంచి మధుర ప్రసాద్ మహతో బరిలో ఉన్నారు. వీరిద్దరికీ స్వతంత్ర అభ్యర్థి జైరాం కుమార్ మహతో గట్టి సవాల్ విసురుతున్నారు. ముగ్గురు నేతలూ కుర్మి సామాజికవర్గీయులే. టైగర్ జైరాంగా పిలిచే జైరాం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజల మంచి స్పందన కూడా వస్తోంది. దీంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

ఆంధ్రప్రదేశ్

ఆ వీడియో లీక్ అయింది

- అది మేము విడుదల చేయలేదు
- ఈసీకి సంబంధం లేదు
- సీఈవో ముకేష్ కుమార్ మీనా



సాక్షి, అమరావతి: మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం సంఘటనకు సంబంధించి మాధ్యమాల్లో ప్రసారమవుతున్న వీడియో లీక్‌తో ఎన్నికల సంఘానికి సంబంధం లేదని ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. ఆ వీడియో తమ నుంచి బయటకు వెళ్లలేదని గురువారం సచివాలయంలో తనను కలిసిన విలేకరులకు చెప్పారు. ఆ వీడియో ఎలా బయటకు వెళ్లిందన్న దానిపై విచారణ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరిగిన సంఘటనలపై దర్యాప్తు చేస్తున్న సందర్భంగా ఎవరి చేతి నుంచో బయటకు వెళ్లి ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం ధ్వంసంపై సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు మీనా తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పుడు వెళ్లడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. అక్కడ పరిస్థితులు ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తున్నాయని, ఇలాంటి తరుణంలో పరామర్శల పేరుతో వెళ్లి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. ఇప్పుడు తెలుగుదేశం వాళ్లకు అనుమతిస్తే రేపు వేరే పార్టీ వాళ్లు వెళ్తామంటారని, అందుకే బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లనీయొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

పచ్చమూక అరాచకం..
ఆనవాళ్లివిగో..

పల్నాట గ్రామాలు వదిలి బయట తలదాచుకుంటున్న బడుగులు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు.. ఆపై రిగ్గింగ్‌కు పాల్పడిన టీడీపీ నేతలు
- ఓటింగ్ తరువాత కూడా బడుగు, బలహీన వర్గాలపై దాడులు కొనసాగింపు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కూటమి సేవలో ఘనాపాఠి

చంద్రబాబు విధ్వంస కుట్రలో ప్రధాన పాత్రధారి.. పల్నాడులో హింసాకాండకు ఐజీ త్రిపాఠి వత్తాసు

- కీలక అధికారుల ఆకస్మిక బదిలీల వెనుక సూత్రధారి
- పోలీసులను కట్టడి చేసి టీడీపీ గూండాగిరికి అండదండలు
- కౌంటింగ్ రోజు మరోసారి అలజడికి కొమ్ము కాస్తున్న వైనం



సాక్షి, అమరావతి: సర్వ శ్రేష్ఠుడు అంటే అందరికంటే సమర్థుడు అని అర్థం. కానీ ఆ సమర్థత విధి నిర్వహణలో కాకుండా చంద్రబాబు కుట్రలకు వత్తాసు పలకడంలో చూపించిన ఘనాపాఠి గుంటూరు ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి! ఎన్నికల సందర్భంగా పల్నాడులో టీడీపీ మూకలు బరితెగించి సాగించిన విధ్వంసకాండకు ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలు ఓటింగ్‌లో పాల్గొనకుండా భయానక వాతావరణం సృష్టించిన టీడీపీ గూండాలకు పోలీసు లాఠీని అందించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు పోలింగ్ బూత్‌లలో లేకుండా దాడులకు తెగబడ్డ పచ్చ ముఠాలకు ఈ ఖాకీ కొమ్ము కాశారు. పోలింగ్ అక్రమాలకు పాల్పడ్డ టీడీపీ రౌడీమూకలు రోడ్లపై దర్జాగా తిరుగుతున్నా వారిని అరెస్ట్ చేయకుండా పోలీసు యంత్రాంగం చేతులు కట్టేశారు. ఓట్ల లెక్కింపు రోజు టీడీపీ గూండాలు మరోసారి అరాచకం సృష్టించేందుకు రంగం సిద్ధం చేయిస్తున్నారు. ఎన్నికల అక్రమాలకు సహకారం అందించేందుకు చంద్రబాబు, పురందేశ్వరి పక్కా పన్నాగంతో పల్నాడులో ప్రవేశపెట్టిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వారిద్దరి నమ్మకాన్ని వమ్ము చేయలేదనే ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలీసు వ్యవస్థ రాజకీయ బురద పులుముకుంటే ప్రజాస్వామ్యానికి ఎంత చేటు కలుగుతుందో చెప్పేందుకు ఈ 'పచ్చ' ఖాకీ కథే నిదర్శనం!

పోలింగ్‌కు ముందు పల్నాడులో పచ్చ జట్టు

పల్నాడులో టీడీపీ పరిస్థితి దయనీయంగా ఉందని గుర్తించిన చంద్రబాబు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే కుట్రకు తెరతీశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైన పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని పావులు కదిపారు. గుంటూరు డీఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ శివశంకర్‌రెడ్డితోపాటు క్షేత్రస్థాయిలో కీలకమైన డీఎస్పీలు, సీఐలపై అసత్య ఆరోపణలతో ఎన్నికల కమిషన్(ఈసీ)కి ఫిర్యాదులు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా కథ నడిపించారు. టీడీపీ ఆరోపణలు చేసిన పోలీసు అధికారులపైనే ఆమె ఫిర్యాదు చేయడం గమనార్హం. అంతేకాదు.. ఆ అధికారుల స్థానాల్లో ఎవర్ని నియమించాలో సూచిస్తూ ఆమె ఏకంగా జాబితా సమర్పించడం గమనార్హం. రాజకీయ ఒత్తిళ్లతో గుంటూరు డీఐజీ పాలరాజు, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని ఈసీ ఆకస్మికంగా బదిలీ చేసింది. వారి స్థానాల్లో టీడీపీ అనుకూలురైన పోలీసు అధికారులు నియమితులయ్యారు. గుంటూరు ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, ఎస్పీగా గరికపాటి బిందు మాధవ్ బాధ్యతలు చేపట్టారు.

జాబితా పంపిన నిమ్మగడ్డ, వర్ల

చంద్రబాబుకు నమ్మిన బంటు అయిన వివాదాస్పద ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అత్యంత సన్నిహితుడు. ఎస్పీగా నియమించిన గరికపాటి బిందు మాధవ్ నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులుకు బంధువు. ఐజీగా రాగానే త్రిపాఠి టీడీపీ కుట్రలను అమలు చేశారు. పోలింగ్‌కు కేవలం రెండు రోజుల ముందు మాచర్ల టౌన్ సీఐ పి.శరత్‌బాబు, కారంపూడి సీఐ చిన్నమల్లయ్య, గురజాల సీఐ పల్లపురాజు, ఎస్సై ఎం.రామాంజనేయులును బదిలీ చేయడం గమనార్థం. వారి స్థానాల్లో నియమించాల్సిన అధికారుల జాబితాను సైతం ఆయనే పంపించారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్, టీడీపీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య ఇచ్చిన జాబితాలనే ఆయన పంపడం గమనార్హం. టీడీపీకి అనుకూలురైన కోటేశ్వరరావు మాచర్ల టౌన్ సీఐగా, కారంపూడి సీఐగా నారాయణస్వామి నియమితులయ్యారు. రెంటచింతల మండలానికి చెందిన నారాయణస్వామి టీడీపీ గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావుకు సన్నిహితుడు.

పోలీసులను కట్టడి చేసి..

పల్నాడు అంతా టీడీపీ అనుకూల పోలీసు అధికారుల ద్వారా తమ గుప్పిట్లోకి వచ్చిన తరువాత చంద్రబాబు తన రెండో దశ కుట్రను అమలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, పేద వర్గాలకు చెందిన ఓటర్లను బెంబేలెత్తించి వారు ఓట్లు వేయకుండా అడ్డుకోవాలన్న పచ్చ పన్నాగానికి ఐజీ త్రిపాఠి కొమ్ము కాశారు. జిల్లాలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తనకు చెప్పకుండా కాలు కదపటానికి వీల్లేదని ఆదేశించారు. ఎక్కడైనా హింసాత్మక సంఘటనలు జరుగుతున్నట్లు సమాచారం అందినా సరే తాను అనుమతిస్తేనే వెళ్లాలని స్పష్టం చేశారు. టీడీపీ మూకలు దౌర్జన్యాలకు పాల్పడ్డ ప్రాంతాల వైపు పోలీసులు కన్నెత్తి చూడకుండా ఉండేందుకే త్రిపాఠి ఇలా వ్యవహరించినట్లు స్పష్టమవుతోంది.

కుట్రలకు సహకారం..

కీలకమైన పోలింగ్ రోజు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తానో పోలీస్ ఉన్నతాధికారిననే విషయాన్ని విస్మరించి టీడీపీ కార్యకర్త తరహాలో చెలరేగిపోయారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాల్సిన ఆయన ఓ వర్గానికి వత్తాసు పలికారు. స్వయంగా పల్నాడులో తిష్ట వేసి మరీ టీడీపీ రిగ్గింగ్‌కు కొమ్ము కాయడం విభ్రాంతి కలిగిస్తోంది. మాచర్లలోని కేసీపీ సిమెంట్స్ గెస్ట్ హౌస్, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ కేంద్రంగా టీడీపీ కుట్రలకు సంపూర్ణ సహకారం అందించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామం కండ్లకుంటతో పాటు పరిసర గ్రామాల్లో టీడీపీ ఏజెంట్లను ఐజీ త్రిపాఠీనే నియమించడం గమనార్హం. అంతేకాదు.. ఆయనతోపాటు ఎస్పీ బిందుమాధవ్ ఆ గ్రామాల్లోనే ఉన్నారు. ఒక అదనపు ఎస్పీ, ఒక ట్రైనీ ఐపీఎస్, డీఎస్పీ, ఇద్దరు సీఐలను అక్కడ నియమించారు. అదే త్రిపాఠీకి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి స్వగ్రామం వెల్దుర్తిలో అన్ని పార్టీల ఏజెంట్లు ఉన్నారో లేదో చూడాలని కూడా అనిపించలేదు.

రిగ్గింగ్ నిరోధించాలని పిన్నెల్లి మొర పెట్టుకున్నా..

టీడీపీ వర్గీయులు కొత్తూరు, కంభంపాడు, భైరవునిపాడు, రెంటాల, జెట్టిపాలెం, పాల్వాయి గేటు, గోలి, మిట్టగుడిపాడు, కారంపూడి, ఒప్పిచర్ల, పేట సన్నెగండ్ల, చింతపల్లి, ముటుకూరు, అడిగొప్పుల, పోలేపల్లి, వెల్దుర్తి, లోయపల్లి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సపెంట గ్రామాల్లో రిగ్గింగ్‌కు కుట్ర చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆ 20 గ్రామాల్లో సక్రమంగా పోలింగ్ జరిగేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఆ కాపీని ఐజీ త్రిపాఠీకి అందచేసి టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడకుండా కట్టడి చేయాలని కోరినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. వెల్దుర్తితోపాటు ఆ 20 గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ గూండాలు దాడి చేసి చితకబాది బూత్‌ల నుంచి వెళ్లగొట్టినా స్పందించలేదు. టీడీపీ రౌడీమూకలు ఆరు కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేశాయి. దీనిపై సమాచారం అందినా ఆ పోలింగ్ కేంద్రాల వద్దకు ఒక డీఎస్పీని కూడా పంపలేదు.

పదేపదే ఫోన్లు చేసినా..

పల్నాడు అంతటా టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా పట్టించుకోవద్దని సంకేతాలిచ్చి ఐజీ త్రిపాఠి పోలీసుల చేతులు కట్టేశారు. అదే అదనుగా అల్లరి మూకలు కర్రలు, కత్తులు, రాడ్లు పట్టుకుని స్వైర విహారం చేస్తున్నా పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తుండి పోయింది. పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి చేసి బయటకు వెళ్లగొట్టినా, ఓటర్లను బెదిరించి పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకున్నా, టీడీపీ కార్యకర్తలు రిగ్గింగ్ చేస్తున్నా పోలీసులు మౌనముద్ర దాల్చారు. దీనిపై ఐజీ త్రిపాఠి, ఎస్పీ బిందు మాధవ్‌లకు వైఎస్సార్‌సీపీ నేతలు పదేపదే ఫోన్లు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఎన్నికల కమిషన్, ఇతర ఉన్నతాధికారులకు ఫోన్ల మీద ఫోన్లు చేయడంతో ఉదయం 9 గంటల తరువాత వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను అనుమతించారు.

కౌంటింగ్ రోజు అక్రమాలకు అభయం!

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి దన్నుతో పల్నాడులో భయానక వాతావరణం సృష్టించిన పచ్చ ముఠాలు ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4న మరోసారి దాడులకు తెగబడాలని పథకం రచిస్తున్నాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు లేకుండా చేసి ఓట్ల లెక్కింపులో అక్రమాలకు పాల్పడాలని పన్నాగం వేశాయి. దీనిపై నిఘా వర్గాలు స్పష్టమైన నివేదిక ఇచ్చినా ఐజీ త్రిపాఠి నిర్లిప్తంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. పోలింగ్ రోజు త్రిపాఠి వ్యవహార శైలి చూసిన పోలీసులు ఆయన ఆ పోస్టులో కొనసాగితే కౌంటింగ్ రోజు పల్నాడు మరోసారి భగ్గుమనడం ఖాయమని తేల్చిచెబుతున్నారు. ఆయన్ను ఈసీ తక్షణం బదిలీ చేయాలని పేర్కొంటున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆ అభ్యర్థులకు హైకోర్టు రక్షణ

- జూన్ 6 వరకు పిన్నెల్లి, గోపిరెడ్డి, పెద్దారెడ్డి తదితరులను అరెస్టు చెయ్యొద్దని పోలీసులకు ఆదేశం
- కౌంటింగ్ ముగిసే వరకు తాడిపత్రిలో ఉండొద్దని అస్మిత్‌రెడ్డికి స్పష్టీకరణ



సాక్షి, అమరావతి : ఎన్నికల బరిలో నిలిచిన పలువురు అభ్యర్థులకు హైకోర్టు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులను జూన్ 6వ తేదీ వరకు అరెస్టు చెయ్యొద్దని పోలీసులను ఆదేశించింది. దీంతో వారికి హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లయింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. కౌంటింగ్ ముగిసే వరకు తాడిపత్రిలో ఉండరాదని.. తాడిపత్రి బయట ఉండాలని జేసీ అస్మిత్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సోమశేఖర నాయుడులను హైకోర్టు ఆదేశించింది. నలుగురు కంటే ఎక్కువ మందితో తిరగరాదని.. ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడరాదని అస్మిత్‌రెడ్డి, పెద్దారెడ్డిలతో సహ మిగిలిన అభ్యర్థులైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతమనేని ప్రభాకర్ తదితరులనూ ఆదేశించింది. పోలీసులు ఎన్నికల సంఘం నియంత్రణలో పనిచేస్తున్నారని, అందువల్ల అభ్యర్థుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని ప్రధాన ఎన్నికల అధికారికి స్పష్టంచేసింది. అంతేకాక.. ఆయా కేసులకు సంబంధించి సాక్షులను ప్రభావితం చేయడంగానీ.. దర్యాప్తులో జోక్యం చేసుకోవడంగానీ చేయరాదని ఆదేశించింది. ఈ వ్యాజ్యాల్లో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి గురువారం రాత్రి మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

అరెస్టుకు అవకాశం ఉంది.. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వండి..

ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలకు సంబంధించి నమోదైన కేసుల్లో పోలీసులు తమను అరెస్టుచేసే అవకాశముందని, అందువల్ల తమకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌లతో పలువురు స్వతంత్ర అభ్యర్థులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు టి. నిరంజన్‌రెడ్డి, పి.వీరారెడ్డి, ఓ.మనోహర్‌రెడ్డి, పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎస్.రామలక్ష్మణరెడ్డి, చుక్కపల్లి భానుప్రకాశ్.. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి తమ తమ వాదనలను వినిపించారు.

సుప్రీంకోర్టుకన్నా తామే ఎక్కువని ఈసీ భావిస్తోంది..

పిటిషనర్లపై నమోదైన కేసులన్నీ కూడా ఏడేళ్ల కంటే తక్కువ శిక్షపడే కేసులని, అందువల్ల వారికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారించాల్సి ఉంటుందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఏడేళ్ల కన్నా తక్కువ శిక్షపడే కేసుల్లో అరెస్టుచేయడానికి వీల్లేదన్నారు. అయితే, ఎన్నికల సంఘం మాత్రం రామకృష్ణారెడ్డిని అరెస్టుచేసి తీరుతామని ప్రకటనలు ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు కన్నా తామే ఎక్కువన్న విధంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని తెలిపారు. అలాగే, టీడీపీ నేత నారా లోకేశ్ ఎక్స్ ఖాతాలో పోస్ట్‌చేసిన వీడియో ఆధారంగా ఎన్నికల కమిషన్ రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయాలని ఆదేశించిందన్నారు. తాము కౌంటింగ్ పూర్తయ్యే వరకు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కోరుతున్నామని సీనియర్ న్యాయవాదులు తెలిపారు. ఈ సమయంలో పీపీ నాగిరెడ్డి జోక్యం చేసుకుంటూ.. మధ్యంతర బెయిల్ ఇస్తే మొన్న జరిగిన ఘటనల వంటి వాటిని పునరావృతం చేసే అవకాశం ఉందన్నారు. ఒకవేళ మధ్యంతర బెయిల్ ఇవ్వాలనుకుంటే షరతులు విధించాలని కోర్టుకు విన్నవించారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి, హైకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేశారు. ఇదిలా ఉంటే, ఎన్నికల సమయంలో, ఎన్నికల తరువాత జరిగిన ఘర్షణలపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ పలువురు వ్యక్తులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.



శెభాష్ కామ్య..!

16 ఏళ్లకే ఎవరెస్ట్‌ను అధిరోహించిన కామ్య కార్తికేయన్

- మొట్టమొదటి భారతీయ పిన్న వయస్కురాలిగా రికార్డు
- ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన రెండో బాలిక
- తండ్రితో కలిసి విజయవంతంగా పర్వతారోహణ
- వివరాలను వెల్లడించిన టాటా స్టీల్ అడ్వెంచర్ ఫౌండేషన్
- ఏడు ఖండాల్లోని ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించిన ఘనతకు అడుగుదూరం

జంషెడ్‌పూర్: కామ్య కార్తికేయన్. 16 ఏళ్లు. చదివేది ప్లస్‌టూ. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని నేపాల్ వైపు నుంచి చిన్న వయస్సులోనే అధిరోహించి చరిత్ర సృష్టించింది. ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన రెండో బాలికగా కూడా నిలిచింది. ఈ నెల 20వ తేదీన తండ్రితో కలిసి ఆమె ఈ ఘనత సాధించినట్లు టాటా స్టీల్ అడ్వెంచర్ ఫౌండేషన్(టీఎస్ఏఎఫ్) గురువారం తెలిపింది. ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన శిఖరాలను అధిరోహించిన రికార్డు సాధించేందుకు కామ్య మరో అడుగు దూరంలోనే ఉన్నట్లు టీఎస్ఏఎఫ్ చైర్మన్ చాణక్య చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరైన ప్రోత్సాహం, అంకితభావం ఉంటే ఏదైనా సాధ్యమనే విషయం కామ్య రుజువు చేసిందని, సాహసికులకు ఆమె ప్రేరణగా నిలిచిందని తెలిపారు. ఈ సంస్థే కామ్యకు సహాయ సహకారాలు అందిస్తోంది.

ఏప్రిల్ ఆరో తేదీన తన బృందంతోపాటు కఠ్మాండుకు చేరుకున్న కామ్య..పూర్తిస్థాయి సన్నద్ధతతో మే 16వ తేదీన ఎవరెస్ట్ బేస్ క్యాంప్ నుంచి తండ్రి కార్తికేయన్‌తోపాటు సాహసయాత్రను ప్రారంభించింది. తండ్రితో కలిసి మే 20వ తేదీన వేకువజామున 8,848 మీటర్ల ఎత్తయిన శిఖరంపైకి చేరుకుందని టీఎస్ఏఎఫ్ వివరించింది. తాజా విజయంతో ఆరు ఘనతలను సాధించిన కామ్య.. ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించాలన్న ధ్యేయానికి కేవలం అడుగు దూరంలో నిలిచిందని వెస్టర్న్ నేవీ కమాండ్ 'ఎక్స్'లో పేర్కొంది. ఏడో లక్ష్యమైన అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ మాస్సిఫ్‌ను వచ్చే డిసెంబర్‌లో అధిరోహించేందుకు సిద్ధమవుతున్న కామ్య.. ఈ అరుదైన ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా చరిత్ర పుటల్లో నిలవాలని కోరుకుంటున్నట్లు వివరించింది.

నేవీ కమాండర్ ఎస్.కార్తికేయన్ కుమార్తె కామ్య. ముంబైలోని నేవీ చిల్డ్రన్స్ స్కూల్‌లో ప్లస్‌టూ చదువుకుంటోంది. పర్వతారోహణ అంటే కామ్యకు చిన్ననాటి నుంచే ఎంతో ఆసక్తి. ఏడో ఏటనే, 2015లో 12 వేల అడుగుల ఎత్తయిన చంద్రశిల పర్వతాన్ని అధిరోహించి తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. 2016లో 13,500 అడుగుల ఎత్తున్న మరింత కఠినమైన హరి కీ దున్‌ను, కేదార్‌నాథ్ శిఖరాలను అవలీలగా ఎక్కింది. అదేవిధంగా, 16,400 అడుగుల ఎత్తులో రూప్‌కుండ్ సరస్సుకు చేరుకుంది. అసాధారణ విజయాలను నమోదు చేసిన బాలల కిచ్చే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల శక్తి పురస్కారం కూడా కామ్య అందుకుంది. 2017లో నేపాల్‌లోని 17,600 అడుగుల ఎత్తున ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌నకు చేరుకుని ఈ ఘనత సాధించిన రెండో పిన్న వయస్కురాలిగా నిలిచింది.

ఎవరెస్ట్ కీ బేటీ
- ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

చోటీ బహూకు ఇంటిపోరు



తొమ్మిదో గెలుపుపై మేనక గురి!

- బీజేపీ దన్ను అంతంతే
- ప్రచారానికి మోదీ దూరం
- సర్వం తానై ఒంటరి పోరు

సుల్తాన్‌పూర్. గాంధీ కుటుంబపు కంచుకోట రాయ్‌బరేలీకి కేవలం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న లోక్‌సభ స్థానం. అత్తగారైన ఇందిరను ఎదిరించి చిన్న వయస్సులోనే ఒంటరిగా రాజకీయాల్లోకి వచ్చిన మేనకా గాంధీ ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. ఎంపీగా ఏకంగా తొమ్మిదో విజయమే లక్ష్యంగా బీజేపీ తరఫునే మళ్లీ బరిలోకి దిగారు. అయితే సొంత పార్టీయే ఆమెకు అంతగా సహకరించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో మేనక కేవలం 14,500 ఓట్లతో గట్టెక్కారు. ఈసారి ఆమె గెలుపు ఈజీ కాదని విశ్లేషకులూ అంటున్న పరిస్థితి! ఇన్ని సవాళ్ల నడుమ సుల్తాన్ పూర్ పరీక్షలో 67 ఏళ్ల ఈ 'చోటీ బహూ' ఎలా నెగ్గుకొస్తారనేది ఉత్కంఠ రేపుతోంది...

భర్త సంజయ్‌గాంధీ మరణం తర్వాత ఇందిరతో విభేదాలు మేనకను ఒంటరిని చేశాయి. అప్పటికి చంటిపిల్లాడైన వరుణ్ గాంధీని తీసుకొని కుటుంబం నుంచి బయటికొచ్చారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఒంటరి పోరాటమే చేస్తూ వచ్చారు. తొలిసారి 1984లో అమేథీలో బావ రాజీవ్ గాంధీని ఢీకొని 2.7 లక్షల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. 1989లో జనతాదళ్ తరఫున ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్ నుంచి గెలిచి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. 1991లో మళ్లీ బీజేపీ చేతిలో ఓటమి చవిచూసినా ఆ తర్వాత మాత్రం వరుసగా ఏడుసార్లు విజయం సాధించారు. పిలిభిత్‌ను కంచుకోటగా మార్చుకున్నారు. అక్కడి నుంచి మూడుసార్లు ఇండిపెండెంట్‌గా కూడా విజయకేతం ఎగరేయడం విశేషం. మధ్యలో ఒకసారి ఆవ్లా లోక్‌సభ స్థానం నుంచీ నెగ్గారు. వీపీ సింగ్ ప్రభుత్వంలో, తర్వాత వాజ్‌పేయి సర్కారులో, మోదీ తొలి విడత ప్రభుత్వంలోనూ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. పిలిభిత్‌లో ఆరుసార్లు గెలిచాక 2019లో ఆ స్థానాన్ని కుమారుడు వరుణ్‌కు వదిలి తొలిసారి సుల్తాన్‌పూర్‌కు మారారు. వరుణ్‌కు బీజేపీ ఈసారి మొండిచేయి చూపడంతో మేనక కూడా నిరుత్సాహానికి గురయ్యారు.

సుల్తాన్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గ ముఖచిత్రం...

- మొత్తం ఓటర్లు 18 లక్షలు
- ముస్లింలు, దళితులు, కుర్మీ, నిషాద్‌లు కీలకం.
- 2014లో వరుణ్ గాంధీ 42.5 శాతం ఓట్లు సాధించారు. బీఎస్పీ అభ్యర్థికి 24 శాతమే దక్కాయి.
- 2019 ఎన్నికల్లో మేనకా గాంధీకి 45.9 శాతం, బీఎస్పీ అభ్యర్థికి 44.4 శాతం ఓట్లొచ్చాయి.

గత విజేతలు...

2019	మేనకా గాంధీ (బీజేపీ)
2014	వరుణ్ గాంధీ (బీజేపీ)
2009	సంజయ్ సింగ్ (కాంగ్రెస్)
2004	తాహిర్ ఖాన్ (బీఎస్పీ)
1999	జై భద్ర సింగ్ (బీఎస్పీ)

ఓబీసీలు, ముస్లింలే కీలకం...

సుల్తాన్‌పూర్‌లో నిషాద్‌లతో పాటు కుర్మీలు, యాదవులు, ముస్లింలు, దళితులు ఎక్కువగా ఉన్నారు. బ్రాహ్మణులు, ఠాకూర్లు ఓ మోస్తరుగా ఉంటారు. కాంగ్రెస్ మద్దతుతో ఎస్పీ తరఫున బరిలోకి దిగిన రామ్ భువల్ నిషాద్‌కు ఆ సామాజిక వర్గంలో గట్టి పట్టుంది. బీఎస్పీ కుర్మీ సామాజికవర్గానికి చెందిన ఉద్రజ్ వర్మను రంగంలోకి దించడంతో ఓట్లు భారీగా చీలే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ బీఎస్పీ రెండుసార్లు గెలవగా ఎస్పీ బోణీయే చేయలేదు! స్థానిక సమస్యలే ప్రధానాంశాలుగా ప్రచారం సాగింది.

ప్రచారానికి మోదీ, షా దూరం

సుల్తాన్‌పూర్‌లో శనివారం ఆరో విడతలో పోలింగ్ జరగనుంది. కానీ యూపీ అంతా కలియదిరుగుతున్న ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర బీజేపీ అగ్ర నేతలెవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం! ప్రచారం చివర్లో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఓ ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో ఈ ఎన్నికలు ఆమెకు మళ్లీ ఒంటరి పోరాటంగానే కనిపిస్తున్నాయి. అయితే కుటుంబీకులైన రాహుల్, ప్రియాంక మొదలుకుని విపక్ష నాయకులెవరూ కూడా మేనకకు వ్యతిరేకంగా పెద్దగా ప్రచారం చేయకపోవడం విశేషం!

- సాక్షి, నేషనల్ డెస్క్

> అయోధ్య రామ మందిర నిర్మాణం, వరుణ్‌కు టికెట్ నిరాకరణ వంటివేవీ సుల్తాన్‌పూర్‌లో ఎన్నికల అంశాలు కావు. నియోజకవర్గ ప్రజల సమస్యలే ప్రధానాంశాలు. వాటిని తీర్చేందుకు ఐదేళ్లుగా చేసిన కృషే నన్ను మళ్లీ గెలిపిస్తుంది. గత ఎన్నికల కంటే ఎక్కువ మెజారిటీతో గెలిచి చూపిస్తా.
> - మేనకా గాంధీ

మహిళలంటే చిన్నచూపు!

వారిని ఆర్ఎస్ఎస్ 'శాఖ'లోకి అనుమతించట్లేదు • బీజేపీపై రాహుల్ గాంధీ ఆరోపణ

న్యూఢిల్లీ: మహిళలను బీజేపీ రెండో శ్రేణి పౌరులుగానే చూస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నార్త్ వెస్ట్ ఢిల్లీ పార్టీ అభ్యర్థి ఉదిత్ రాజ్ తరఫున గురువారం ఢిల్లీలోని మంగోల్‌పురిలో మహిళలు మాత్రమే పాల్గొన్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ''ఎంతో ఆర్భాటంగా ఇప్పుడే మహిళాలోకం కలలు సాకారం చేస్తున్నట్లు పార్లమెంట్‌లో నారీశక్తి వందన్ అధినయమ్(మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రవేశపెట్టారు. ఆ చట్టం ఇప్పుడు కాదు ఏకంగా పదేళ్ల తర్వాత అమలుచేస్తామని తీరిగ్గా చెప్పారు. ఈ నిర్ణయం వెనుక ఒక సిద్ధాంతముంది. అదే ఆర్ఎస్ఎస్. బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అయితే ఏకంగా మహిళలను కనీసం 'శాఖ' లోకి అడుగుపెట్టనివ్వడంలేదు. మహిళలను రెండో తరగతి పౌరులుగా భావించాలని ఆర్ఎస్ఎస్ నరనరాల్లో నాటుకుపోయింది' అని విమర్శలు గుప్పించారు.

వర్కింగ్ ఉమెన్ పనికి గుర్తింపు దక్కట్లేదు

''భారత్‌లో ప్రతీ రంగం గురించి మాట్లాడతాంగానీ వర్కింగ్ ఉమెన్ ఇంట్లోనూ చేసే శ్రమకు ఎక్కడా గుర్తింపు దక్కట్లేదు. రోజంగా ఆఫీస్/కార్యస్థలంలో పనిచేసి అలసిపోయిన మహిళలు ఇంటికొచ్చాక మళ్లీ రెండో షిఫ్ట్ మొదలెడతారు. పిల్లల ఆలనాపాలనా చూసుకుని ఇంటి పనులన్నీ చేస్తారు. ఈ పనికి వాళ్లకు ఎలాంటి చెల్లింపులు ఉండవు. పురుషులు రోజుకు 8 గంటలు పనిచేస్తే మహిళలు 16 గంటలపైనే పనిచేస్తారు. వారి శ్రమకు ప్రతిఫలంగా ఏమీ దక్కట్లేదు. ఇది ఒక రకంగా చెల్లింపులులేని గుర్తింపులేని పని. మేం అధికారంలోకి వస్తే మహాలక్ష్మీ యోజన ద్వారా పేద మహిళలకు నెలకు రూ.8,500 చొప్పున ఏటా రూ.1 లక్ష వారి ఖాతాలో జమచేస్తాం'' అని రాహుల్ అన్నారు. మే 25నాటి పోలింగ్‌కు ప్రచారం గురువారంతో ముగుస్తుండటంతో ఢిల్లీ మెట్రోలోనూ రాహుల్ ప్రయాణించారు. ''నార్త్ ఈస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్ తరఫున సైతం రాహుల్ దిల్షాద్ గార్డెన్ ప్రాంతంలో ప్రచారంలో పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో మధ్యాహ్న భోజనం

ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన రాహుల్ మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్/తెలంగాణ భవన్‌కు వచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌సహా దాదాపు 10 మందితో కలిసి రాహుల్ భోజనం చేశారు. రాహుల్ పూరీలు, చపాతీలు, కోడికూర వేపుడు, రొయ్యల వేపుడు ఆర్డర్ ఇచ్చారు. తొలుత పూరీ/చపాతీని పప్పుతో కలిపి తిన్నారు. తర్వాత చికెన్ ఫ్రై, రొయ్యల ఫ్రైతో చపాతీ/పూరీ తిన్నారు.



ఢిల్లీ మెట్రోలో రాహుల్ గాంధీ

మీ కీలక పాత్ర పోషించండి సోనియా గాంధీ

ఢిల్లీ పరిధిలో ప్రచారం చివరిరోజు సందర్భంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గురువారం ఓటర్లకు ఒక వీడియో సందేశం విడుదలచేశారు. '' ప్రజాస్వామ్య పరిరక్షణకు జరుగుతున్న కీలక ఎన్నికలివి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులు కొనసాగుతున్న వేళ వచ్చిన ఎన్నికలివి. ఈ పోరాటంలో మీరు మీ కీలక పాత్ర పోషించండి. మీ ఓటు ఉపాధి కల్పనకు బాటలువేస్తుంది. ఎగసిన ధరలను కిందకు దింపుతుంది. మహిళలకు సాధికారతను కట్టబెడుతుంది. మెరుగైన భవిష్యత్తుతో సమానత్వాన్ని సాధిస్తుంది. ఢిల్లీ పరిధిలోని ఏడు ఎంపీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించండి' అని సోనియా సందేశమిచ్చారు.

'నైట్ విజన్ గాగుల్స్'తో విమానం ల్యాండింగ్

మరో ఘనత సాధించిన భారత వాయుసేన

న్యూఢిల్లీ: భారత వాయుసేన(ఐఏఎఫ్) మరో అరుదైన ఘనత సాధించింది. నైట్ విజన్ గాగుల్స్(ఎన్‌వీజీ) సాయంతో తక్కువ వెలుతురు ఉన్న సమయంలో సీ–130జే రవాణా విమానాన్ని విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు సెక్టార్‌లోని అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్‌లో ఈ ప్రక్రియను చేపట్టింది. ఇందుకు సంబంధించిన రెండు వీడియోలను 'ఎక్స్'లో షేర్ చేసింది. ఒక వీడియోలో ఎన్‌వీజీ టెక్నాలజీతో విమానం సాఫ్ట్ ల్యాండింగ్ అయిన దృశ్యాలు, మరో వీడియోలో విమానంలో లోపలి నుంచి దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఎన్‌వీజీ విజువల్స్ కావడంతో ఈ దృశ్యాలు ఆకుపచ్చ రంగులో విభిన్నంగా ఉన్నాయి. మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకొనే ప్రక్రియలో భాగంగా తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొనేందుకు కట్టుబడి ఉన్నామని భారత వాయుసేన పేర్కొంది. నైట్ విజన్ గాగుల్స్ టెక్నాలజీతో భారత వాయుసేన మరింత బలోపేతమైంది. వెలుతురు తక్కువ ఉన్న సమయాల్లో, రాత్రిపూట విమానాలను సురక్షితంగా ల్యాండ్ చేయడానికి, సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం దోహదపడనుంది.

మోదీజీ.. దేవుడు మిమ్మల్ని క్షమించడు

నా తల్లిదండ్రులను వేధిస్తారా?: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ హద్దు మీరుతున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిదండ్రులను సైతం లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్ గురువారం వర్చువల్‌గా మీడియాతో మాట్లాడారు. పద్ధతి మార్చుకోవాలని ప్రధానికి హితవు పలికారు. ''నా ఎమ్మెల్యేలను, మంత్రిని అరెస్టు చేశారు. నన్ను జైలులో పెట్టి వేధించారు. ఈరోజు మీరు హద్దులు దాటారు. నన్ను లక్ష్యంగా చేసుకుని నా తల్లిదండ్రులను వేధిస్తున్నారు. ఆ దేవుడు మిమ్మల్ని క్షమించడు'' అని మోదీని ఉద్దేశించి పేర్కొన్నారు.

అప్పుడు కేజ్రీవాల్ ఇంట్లోనే ఉన్నారు: స్వాతి మలివాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ తనపై దాడి చేసినపుడు ముఖ్యమంత్రి ఇంట్లోనే ఉన్నారని, బిభవ్‌ను కేజ్రీవాల్ కాపాడుతున్నారని ఆప్ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ ఆరోపించారు. గురువారం ఆమె ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. '' దాడి ఉదంతం తర్వాత కేసులు, దర్యాప్తు, విచారణ, నా వాదనలు, ఆప్ ఖండనలు.. ఇలా ఇంత జరుగుతున్నా కేజ్రీవాల్ నాకు ఇంతవరకు ఒక్కసారి కూడా ఫోన్ చేసి మాట్లాడలేదు. అసలేమైంది? ఎందుకలా జరిగింది? అని పిలిచి మాట్లాడలేదు. నిందితుడిని ఆయన రక్షిస్తున్నారు. నా వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డాలని ఆప్‌లో అందరికీ ఆదేశాలు వెళ్లాయి'' అని ఆరోపించారు.

ఇటు నేను.. అటు ఎవరు?

'కూటమి'ని నిలదీసిన ప్రధాని మోదీ



మహేంద్రగఢ్/పటియాలా: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నాయకులు అధికారంలోకి రాకముందే ప్రధానమంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారని, ఆవు పాలు ఇవ్వకముందే నెయ్యి కోసం రగడ మొదలైందని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు మారితే దేశం ఎలా ముందుకు సాగుతుందని ప్రశ్నించారు. తాను బతికి ఉన్నంత కాలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని పునరుద్ఘాటించారు. ఈ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయని స్పష్టంచేశారు. ఈ పోరాటంలో ఒకవైపు ప్రజల సేవకుడు మోదీ ఉన్నారని, మరోవైపు ఎవరున్నారో తెలియదని వ్యాఖ్యానించారు. విపక్ష కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థి లేడని పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కరడుగట్టిన కులతత్వం, మతతత్వం, బంధుప్రీతితో కూడిన ఇండియా కూటమిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం హరియాణాలోని మహేంద్రగఢ్, పంజాబ్‌లోని పటియాలాలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు.

ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి విపక్షాల కుట్రలు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'రామ్ రామ్' అని జపించినవారిని అరెస్టు చేస్తారని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ మన దేశాన్ని ముక్కలు చేసిందని, ఓటు బ్యాంక్‌ను సంతృప్తిపర్చడానికి రెండు ముస్లిం దేశాలను సృష్టించిందని విమర్శించారు. ఈసారి అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరానికి తాళం వేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని గుర్తుచేశారు. మన ఆరాధన, విశ్వాసాన్ని కాంగ్రెస్ కించపరుస్తోందని దుయ్యబట్టారు. విభజించగా మిగిలిపోయిన భారతదేశంలోని వనరులపై మొదటి హక్కు ముస్లింలకే ఉందని విపక్ష నాయకులు అంటున్నారని, బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లను సైతం కాజేయాలని చూస్తున్నారని తప్పుపట్టారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు రాత్రికి రాత్రే ఓబీసీ సర్టిఫికెట్లు ఇచ్చేశారని పేర్కొన్నారు. గత పన్నెండేళ్లలో ఇచ్చిన ఆ సర్టిఫికెట్లను కలకత్తా హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు. ఒకవేళ కోర్టు అడ్డుకోకపోతే ఓబీసీ అన్యాయం జరిగే మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ముస్లింలకు రిజర్వేషన్లకు కల్పించాలని కుట్ర పన్నుతున్న ప్రతిపక్షాల నిజస్వరూపం ప్రజలు తెలుసుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి ఓటమి తప్పదన్నారు. ఓటమికి బాధ్యులను చేసేందుకు ఒక బకరా కోసం ఆ కూటమిలో ఇప్పటినుంచే అన్వేషణ మొదలైందని పేర్కొన్నారు.

పంజాబ్‌లో అరాచక పాలన

పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో అరాచకం రాజ్యమేలుతోందని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల దందా విచ్చలవిడిగా సాగుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. పరిశ్రమలు పంజాబ్‌ను వదిలి వెళ్లిపోతున్నాయని, ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక, డ్రగ్స్ మాఫియా, షూటర్ గ్యాంగ్‌లు చెలరేగిపోతున్నాయని ధ్వజమెత్తారు. పంజాబ్ మంత్రులు ఎంజాయ్ చేస్తున్నారని, ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఢిల్లీ దర్బార్‌లో హాజరు వేయించుకోవడంతోనే సమయం గడిపేస్తున్నారని ఆక్షేపించారు. అలాంటి వ్యక్తులు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కలిసి పోటీ చేస్తున్న కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు పంజాబ్‌లో మాత్రం పరస్పరం పోటీ పడుతున్నాయని చెప్పారు. ఇది డ్రామా కాదా? అని మోదీ నిలదీశారు.

ఎలక్షన్ బీట్

ఐదో విడతలో 62.2% పోలింగ్

- అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 78.48 శాతం
- అత్యల్పంగా బిహార్‌లో 56.76 శాతం

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఐదో విడతలో 62.2 శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లో 78.48%, అత్యల్పంగా బిహార్‌లో 56.76% పోలింగ్ నమోదైనట్లు తెలిపింది. మే 20న 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ నియోజక వర్గాల్లో పోలింగ్ జరగడం తెలిసిందే. అయిదో విడతలో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారని వివరించింది. మహిళలు 63 శాతం, పురుషులు 61.48 శాతం, థర్డ్ జెండర్ 21.96 శాతం మంది ఓటేశారని ఈసీ పేర్కొంది.

8 రాష్ట్రాల్లో నమోదైన పోలింగ్ శాతం వివరాలు	
బిహార్	56.76
కశ్మీర్	59.10
జార్ఖండ్	63.21
లద్దాఖ్	71.82
మహారాష్ట్ర	56.89
ఒడిశా	73.50
ఉత్తరప్రదేశ్	58.02
బెంగాల్	78.45%

ఆరో విడతకు ముగిసిన ప్రచారం

6 రాష్ట్రాలు, 2 యూటీల్లోని 58 స్థానాలకు శనివారం జరగనున్న పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక సమరంలో ఆరో విడత పోలింగ్ జరగనున్న స్థానాల్లో ప్రచారం గురువారంతో ముగిసింది. 6 రాష్ట్రాలు, రెండు యూటీల్లోని 58 స్థానాలకు పోలింగ్ శనివారం జరగనుంది. ఢిల్లీ పరిధిలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో, హరియాణాలోని మొత్తం 10 స్థానాల్లో ఒకేదఫాలో శనివారం పోలింగ్ నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ఒడిశా అసెంబ్లీ ఎన్నికల మూడో విడతలో 42 ఎమ్మెల్యే స్థానాలకూ రేపే పోలింగ్ జరగనుంది.

రాష్ట్రం	సీట్లు
ఉత్తరప్రదేశ్	14
హరియాణా	10
బిహార్	8
బెంగాల్	8
ఢిల్లీ	7
ఒడిశా	6
జార్ఖండ్	4
కశ్మీర్	1

బరిలో ముఖ్య నేతలు

బీజేపీ నేతలు మనోహర్ లాల్ ఖట్టర్(హరియాణాలోని కర్నాల్), ధర్మేంద్ర ప్రధాన్(ఒడిశాలోని సంబల్‌పూర్), అభిజిత్ గంగోపాధ్యాయ్(పశ్చిమబెంగాల్‌లోని తామ్లుక్), నవీన్ జిందాల్ (కురుక్షేత్ర), రావు ఇందర్‌జిత్ సింగ్(గురుగ్రామ్), మేనకా గాంధీ(ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్)తోపాటు పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ(జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్–రాజౌరీ) బరిలో ఉన్నారు. నార్త్ ఈస్ట్ ఢిల్లీ నుంచి బీజేపీ నేత మనోజ్ తివారీ, కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ పోటీ పడుతున్నారు.

ప్రధాని మోదీని చంపేస్తాం!

ఎన్ఐఏకి ఆగంతకుడి బెదిరింపు కాల్

సాక్షి, చెన్నై: ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చంపేస్తామంటూ అందిన బెదిరింపు కాల్‌తో చెన్నైలోని జాతీయ దర్యాప్తు విభాగం అప్రమత్తమైంది. చెన్నై పురసైవాక్కంలో ఎన్ఐఏ కార్యాలయం ఉంది. బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఈ కార్యాలయానికి ఫోన్ చేసి...ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీని హతమా రుస్తామంటూ హిందీలో హెచ్చరించాడు. వెంటనే ఎన్ఐఏ అధికారులు చెన్నై సైబర్‌క్రైం బ్రాంచిని అప్రమత్తం చేశారు. మధ్యప్రదేశ్ నుంచి ఆ కాల్ వచ్చినట్టుగా తేలడంతో గురువారం ఉదయం ఎన్ఐఏ, సైబర్ క్రైం బృందాలు భోపాల్‌కు వెళ్లాయి. అదేవిధంగా, చివరి విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ప్రధానికి భద్రతను మరింతగా పెంచాలని కూడా యోచిస్తున్నట్లు సమాచారం.

అమెరికాలో జడ్జిగా నియమితులైన తెలుగు మహిళ జయ బాడిగ



న్యూయార్క్: భారతీయ సంతతి అమెరికా పౌరురాలు, తెలుగుబిడ్డ జయ బాడిగ అక్కడి శాక్రామెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన జయ ఆ తర్వాత కుటుంబంతో అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడే న్యాయ విద్య చదివి న్యాయవాద వృత్తి జీవితం మొదలెట్టారు. ఇటీవల జడ్జిగా ఎంపికైన జయను కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ శాక్రామెంటో కౌంటీ సుపీరియర్ కోర్టు జడ్జిగా తాజాగా నియమించారు. ఇదే కోర్టులో గత రెండేళ్లుగా జయ కమిషనర్‌గా సేవలందిస్తుండటం విశేషం. డెమొక్రటిక్ పార్టీ సభ్యురాలైన జయ 2020లో కాలిఫోర్నియా ఆరోగ్య పరిరక్షణ సేవల విభాగంలో అటార్నీగా పనిచేశారు. 2018లో కాలిఫోర్నియా గవర్నర్ కార్యాలయంలో అత్యవసర సేవల విభాగంలో సేవలందించారు. శాంటాక్లారా విశ్వవిద్యాలయంలో లా చదివారు. బోస్టన్ విశ్వవిద్యాలయంలోని ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఎంఏ చేశారు. కుటుంబ కేసులు, తగాదాలను పరిష్కరించడంలో జయ పది సంవత్సరాల అనుభవం గడించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. గురువారం జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. నారాయణపూర్ –బీజాపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఇంద్రావతి ఏరియా కమిటీ, ప్లాటూన్–16 దళాలు సమావేశమయ్యాయనే సమాచారంతో భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఉదయం 11 గంటల సమయంలో ఇరు వర్గాల నడుమ కాల్పులు మొదలయ్యాయి. కాల్పులు ఆగాక ఆ ప్రాంతంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు.

బంగ్లా ఎంపీ హత్యకు రూ.5 కోట్ల సుపారీ

కోల్‌కతా: చికిత్స కోసం భారత్‌కు వచ్చి పశ్చిమబెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. అజీమ్ హత్యకు అతని పాత స్నేహితుడే రూ.5 కోట్ల సుపారీ ఇచ్చాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పశ్చిమబెంగాల్ సీఐడీ ఐజీ అఖిలేశ్ చతుర్వేది గురువారం ప్రకటించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇది పక్కా ప్రణాళికతో చేసి హత్య. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్ ప్రాంతంలో అజీమ్ చివరిసారిగా కనిపించిన అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను అజీమ్ పాత స్నేహితుడే అద్దెకు తీసుకున్నాడు. అమెరికా పౌరసత్వమున్న ఆ స్నేహితుడు ప్రస్తుతం అమెరికాలో ఉన్నాడు. 56 ఏళ్ల అజీమ్‌ను హంతకులు ఊపిరాడకుండా చేసి చంపాక మృతదేహాన్ని ముక్కలుగా చేశారు.

రసాయన కర్మాగారంలో భారీ పేలుడు.. 8 మంది మృతి..60 మందికి గాయాలు

థానె: మహారాష్ట్రలోని థానె జిల్లాలో రసాయన కర్మాగారంలో గురువారం సంభవించిన భారీ పేలుడు, అగ్ని ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా మరో 60 మంది గాయాలపాలయ్యారు. డొంబివిలి పారిశ్రామిక వాడలోని అముదాన్ కెమికల్స్ ఫ్యాక్టరీ బాయిలర్ గురువారం మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో అకస్మాత్తుగా పేలింది. పేలుడుతోపాటు మంటలు వ్యాపించి చుట్టుపక్కల కర్మాగారాల్లో పనిచేస్తున్న ఇద్దరు మహిళలు సహా 8 మంది చనిపోగా మరో 60 మంది గాయపడ్డారు. మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలిపోయాయి. పేలుడు శబ్దం కిలోమీటర్ దూరం మేర వినిపించిందని స్థానికులు తెలిపారు. ఆ ప్రాంతంలో రసాయనాలతో కూడిన రంగురంగుల పొగలు దట్టంగా కమ్ముకున్నాయి. చుట్టుపక్కల ఫ్యాక్టరీల భవనాలు, నివాసాలు దెబ్బతిన్నాయి. ఘటన చోటుచేసుకున్న ఫ్యాక్టరీలోని బాయిలర్‌ను నెలపాటు మూసివేసి ఇటీవలే తిరిగి ప్రారంభించారని అధికారులు తెలిపారు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం ၊ 24 ၊ మే ၊ 2024



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: నృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం పౌర్ణమి కావడంతో భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.



క్వింటాల్ పత్తి రూ. 7,550

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పత్తి రూ. 7,550 పలికింది. క్రయ విక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

గరిష్టం/కనిష్టం
39.0/29.0

వాతావరణం

ఆకాశం ఎండగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు తీసుకున్న 'శాతవాహన' ఇన్‌చార్జి వీసీ



కరీంనగర్ సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సచివాలయంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఫైనాన్స్ అధికారి రవీందర్ ఆయనను కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. సురేంద్రమోహన్ ప్రస్తుతం రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి కార్యదర్శిగా ఉన్నారు. విశ్వవిద్యాలయ ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానంగా విద్యార్థుల చదువు అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగాలని, ప్రస్తుత, పూర్వ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని పేర్కొన్నారు.

'ఆచార్య రవ్వా శ్రీహరి' పురస్కారానికి 'నలిమెల'



నలిమెల భాస్కర్

కరీంనగర్‌కల్చరల్: ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో అందించే ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి కరీంనగర్ చెందిన బహుభాషావేత్త నలిమెల భాస్కర్‌ను ఎంపిక చేసినట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ అప్పం పాండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 26న తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రదానం చేయనున్న పేర్కొన్నారు. అవార్డుతోపాటు రూ.50 వేలు అందించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, పొన్నం రవిచంద్ర, గాజుల రవీందర్ తదితరులు అభినందించారు.

ఈ రోజు నగరంలో పవర్ ఉండని ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు కరీంనగర్‌లోని వెంకటేశ్వరకాలనీ, రామచంద్రపురం కాలనీ, ఎర్రగుట్టకాలనీ, వాసుదేవకాలనీ, శ్రీరామకాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్ 2 ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు నగరంలోని మహాశక్తి ఆలయం ఫీడర్ పరిధిలోని సంతోష్‌నగర్, విద్యానగర్, బాలాజీ సూపర్ మార్కెట్, సెయింట్ జాన్స్ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వివరించారు.

త్వరలో టీచర్ల పదోన్నతులు, బదిలీలు



10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్: జూన్ 12 లోగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలుంటాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి అన్నారు. గురువారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ఎస్‌ఎస్‌సీలో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2010 సంవత్సరానికి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం సానుకూలంగా ఉన్నారని, రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల దశ మారుతుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో 84 పాఠశాల లు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం, 80 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించడం గొప్ప విషయమన్నారు. 16 మండలాల్లోని జెడ్పీ, జీఏన్‌టీ హెచ్‌ఎంలు, టీఎస్‌ఎంఎస్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ ఎస్‌వోలు హాజరయ్యారు. నాయకులు జైపాల్‌రెడ్డి, ఎల్.వెంకటేశ్వరరావు, బాల్‌రెడ్డి, ఆనందం, వెంకటనర్సింహారెడ్డి, సహోదర్, శ్రీనివాస్‌రెడ్డి, జలపతి, జీవన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రేమలత, ముజీబ్, పవన్, శ్రీనివాస్, మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

హాలిడే మూడ్

- విదేశీ పర్యటనల్లో కొందరు రాజకీయ నేతలు
- ఉత్తర భారత ఎన్నికల ప్రచారంలో మరికొందరు
- హైదరాబాద్‌లో సేదతీరుతున్న పలువురు
- ఉమ్మడి జిల్లాలో తగ్గిన పొలిటికల్ సందడి
- ఫలితాల వరకు అందుబాటులో ఉండేలా షెడ్యూల్



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

హోరాహోరీగా సాగిన పార్లమెంట్ ఎన్నికల సంగ్రామం ముగిసింది. పోలింగ్ జరిగి.. ఫలితాలకు మరో పదిరోజుల గడు వు మిగిలింది. ఇన్నాళ్లు మంతనాలు.. వ్యూహాలు.. ప్రచారాలతో అలసిపోయిన నేతలంతా హాలిడే మూడ్‌లోకి వెళ్లారు. ఓట్ల లెక్కింపు వరకు తిరిగి వచ్చేలా ప్రణాళికతో కొంతమంది కుటుంబాలతో కలిసి విదేశీ బాటపట్టారు. మరికొందరు రాజధానిలో కుటుంబసభ్యులతో సేద తీరుతున్నారు. ఇంకొందరు వివిధ ఎన్నికల ప్రచారంలో కొనసాగుతున్నారు. మొత్తానికి నేతల హాలిడే మూడ్‌తో ఉమ్మడి జిల్లాలో సందడి తగ్గింది.

విదేశాల్లో పొన్నం, గంగుల

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విదేశీ పర్యటనలో ఉన్నారు. పొన్నం ప్రభాకర్ పోలింగ్ ముగిసిన రెండోరోజే కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లారు. న్యూయార్క్‌లో ఉన్న ఆయన జూన్ ఒకటో తేదీన తిరిగి ఇండియాకు రానున్నారు. 2వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొననున్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పటికీ.. అక్కడి నుంచే ప్రతిపక్ష నేతలకు కౌంటర్లు ఇస్తున్నారు. న్యూయార్క్‌లో నిర్వహించిన రాజీవ్‌గాంధీ వర్ధంతిలోనూ పాల్గొన్నారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన కుటుంబసభ్యులతో కలిసి దుబాయి పర్యటనలో ఉన్నారు. మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కుటుంబంతో కలిసి కేరళ రాష్ట్రానికి వెళ్లారు. అక్కడి సద్గురు ఆశ్రమానికి వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం హైదరాబాద్‌కు తిరిగిరానున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు హైదరాబాద్‌లో కుటుంబంతో కలిసి సేద తీరుతున్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి మాత్రం జగిత్యాలలోనే ఉన్నారు.

వారణాసి ఎన్నికల ప్రచారంలో 'బండి'

కరీంనగర్ ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ వారణాసి వెళ్లారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎంపీగా పోటీచేస్తున్న వారణాసిలో ఎన్నికల ప్రచారం నిమిత్తం బండి కాశీలో మకాంవేశారు. తెలుగు ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి మోదీకి మద్దతుగా ప్రచారం చేపట్టారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఎన్నిక ఈ నెల 27వ తేదీన జరుగనుండగా, కరీంనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వరంగల్ ప్రచారానికి వెళ్లారు. కాంగ్రెస్ నాయకులు సైతం ప్రచారానికి వెళ్లనున్నట్లు సమాచారం.

పెద్దపల్లిలో ఇలా

పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ మంచిర్యాల, హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంటూ కార్యకర్తలను కలుస్తూ బిజీగా ఉన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి, రామగుండంలో పర్యటిస్తూ కార్యకర్తలతో సమీక్షిస్తున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఎన్నికల్లో తనకోసం పనిచేసిన కార్యకర్తలను కలుస్తూనే వివిధ ప్రజా సమస్యలపై మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమెరికా వెళ్లారు. మంత్రి శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో ఉంటూ రాష్ట్ర ప్రజాపాలనలో తనదైన పాత్రను పోషిస్తున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్థానికంగానే ఉంటూ కార్యకర్తలను కలుస్తున్నారు. జెడ్పీ చైర్మన్ పుట్టమధు సైతం స్థానికంగానే ఉంటున్నారు.

తగ్గిన సందడి..

లోకసభ ఎన్నికల పోలింగ్ ముగిసిన తరవాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నేతల సందడి తగ్గింది. పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు నడుమ ఇరవై రోజులకు పైగా సమయం ఉండడంతో, నేతలంతా పొలిటికల్ మూడ్ నుంచి కాస్త బయటపడి ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ పార్టీల కార్యక్రమాలు, నేతల పర్యటనలు పూర్తిగా తగ్గిపోయాయి.

జ్వరాల పంజా.. హాస్పిటళ్లు కిటకిట!



ఓపీ రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరిన పేషెంట్లు

- వాతావరణంలో మార్పులతో ఇబ్బంది
- రోజురోజుకూ పెరుగుతున్న రోగుల రద్దీ
- జాగ్రత్తలే మేలంటున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: వాతావరణంలో కలుగుతున్న మార్పులతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పొద్దంతా తీవ్ర ఎండలు.. ఉక్కపోత ఉండడం.. సాయంత్రం వర్షం కురవడం.. ఈదురుగాలులు వీస్తుండడంతో విషజ్వరాలు వస్తున్నాయి. రెండు వారాలుగా ఇదే పరిస్థితి ఉంటుండడంతో వైరల్ ఫీవర్లు వ్యాపిస్తున్నాయి. వాంతులు, విరోచనాలతో ఆస్పత్రుల బాట పడుతున్నారు.

వాతావరణ మార్పులతో..

ఇటీవల పగటి పూట ఉష్ణోగ్రతలు సగటున 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతుంటే... రాత్రి పూట 36 నుంచి 38 డిగ్రీ ఉష్ణోగ్రతలు ఉంటున్నా యి. సాధారణ ఉష్ణోగ్రత కంటే ఐదు డిగ్రీలు పెరి గినా, తగ్గినా అసాధారణ వాతావరణంగా పరిగణిస్తారని ఆ రంగం నిపుణులు చెబుతున్నారు. గంట ల వ్యవధిలోనే తారెత్తించే ఉష్ణోగ్రతల వ్యత్యాసాల ను కొందరి శరీరాలు తట్టుకోలేకపోతున్నాయి. దీంతో కొందరు ఉన్నట్టుండి అనారోగ్యం పాలవుతున్నారు.

ఆస్పత్రులకు బాధితుల బారులు

వాంతులు, విరోచనాలతో ప్రజలు ఆస్పత్రులకు వస్తున్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులకు సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. కళ్లు, ముక్కు నుంచి నీళ్లు కారడం, ఒళ్లంతా మంటలతో చికిత్స పొందుతున్నారు. వాతావరణ మార్పులతో వ్యాపించిన వైరల్ వ్యాధులతో ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో ఉన్న బెడ్లన్నీ నిండిపోతున్నాయి. రోజుకు సగటున 30 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా నమోదవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. బాధితుల్లో 40 శాతం మంది చిన్నారులు, వృద్ధులే ఉంటున్నారు.

నగరవాసులే ఎక్కువ..

కరీంనగర్‌లో వైరల్ జ్వరాల బాధితులు ఎక్కువగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. రోజుకు సగటున 20 శాతం మంది వైరల్ సమస్యలతో చికిత్సకు ప్రధానాస్పత్రికి తరలివస్తున్నారు. ఔట్‌పేషెంట్లు వందల్లోనే ఉంటున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల తోపాటు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారు వేల సంఖ్యలో ఉంటున్నారు.

స్వీయ జాగ్రత్తలు మేలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ప్రధానాస్పత్రికి వచ్చే వారిలో 20 శాతం మంది వైరల్ ఫీవర్లు, వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. వాతావరణ మార్పులతోనే జ్వరాలు వస్తున్నాయి. డీహైడ్రేషన్ బారినపడకుండా తరచూ నీళ్లు తాగాలి. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటివి మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు.

– సుజాత, డీఎంహెచ్‌వో

పోదాం పద కాలేజీకి

- ఇంటర్ ప్రవేశాలకు వేళాయే
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 31 వరకు గడువు

జిల్లాలో కళాశాలలు	
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	11
సాంఘిక సంక్షేమ గురుకులాలు	06
కేజీబీవీలు	08
ఆదర్శ	11
మైనార్టీ	09
జ్యోతిబాపూలే రెసిడెన్షియల్	10
ప్రైవేట్	53
మొత్తం	108



ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)

కరీంనగర్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు షురూ అయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరానికి మొదటి విడతగా ప్రవేశాలకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 31వరకు మొదటి విడత అడ్మిషన్లు పూర్తి చేసి వచ్చేనెల ఒకటి నుంచి తరగతులు ప్రారంభించేలా కార్యాచరణ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర సంక్షేమశాఖల కళాశాలలు మొత్తం 108 ఉన్నాయి. ప్రైవేట్ మినహా మిగతా కాలేజీల్లో విద్యార్థులకు ఉచిత దుస్తులు, వసతి, పుస్తకాల పంపిణీ, ఇతరత్రా సౌకర్యాలను ప్రభుత్వమే భరిస్తుంది. కాగా మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది.

వసతులపై ప్రచారం

ప్రభుత్వ, వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టింది. గ్రామాల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల వివరాలు సేకరిస్తూ వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ కళాశాలల్లో ఉన్న వసతులపై కరపత్రాలు అందజేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రైవేట్ కాలేజీలకు దీటుగా కరపత్రాలు, ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తూ అడ్మిషన్ల పెంపును వేగవంతం చేయాలని ఇంటర్ అధికారులు సూచించడంతో ఆ దిశగా ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు ఎక్కడికక్కడా వసతులపై ప్రచారం నిర్వహించే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రవేశాలు పెంచేందుకు కృషి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ విద్య అందుతుంది. తొలి విడత ప్రవేశాలు ప్రారంభం కావడంతో ఆన్‌లైన్‌లో ప్రవేశాలు పొందవచ్చు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు తెలియజేసి కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు కృషి చేస్తాం. ప్రవేశాలు తీసుకున్న మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు జూన్ 1 నుంచి తరగతులు జరుగుతాయి.

– జగన్మోహన్‌రెడ్డి, డీఐఈవో

మెరుగైన సౌకర్యాలు

ప్రభుత్వ కళాశాలల్లో ప్రస్తుతం అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి కాలేజీలో అనుభవం కలిగిన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, ఆధునాతన ప్రయోగశాలలు, క్రీడా స్థలం, మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఉన్నాయి. ఉచిత ప్రవేశాలతో పాటు పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. బస్‌పాస్ సౌకర్యం, హాస్టల్ వసతి, స్టడీ అవర్స్ నిర్వహణ, స్టడీ మెటీరియల్ పంపణీ వీటన్నింటితో పాటు విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాలను అమలు చేస్తున్నారు.

భూముల ధరలకు రెక్కలు

- మార్కెట్ విలువ పెంచే యోచనలో సర్కారు
- రంగం సిద్ధం చేస్తున్న రిజిస్ట్రేషన్ అధికారులు

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి జిల్లాలో భూముల మార్కెట్ ధరలు పెరగనున్నాయి. ఇటీవల సర్కారు తీసుకున్న నిర్ణయం మేరకు మార్కెట్ ధరలు మారుతాయని రిజిస్ట్రేషన్‌శాఖలో చర్చ సాగుతోంది. రాష్ట్ర రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులకు సూచనలు సైతం అందినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో భూముల ధరలు రెండు, మూడేళ్ల నుంచి ఆకాశాన్ని అంటుతున్నాయి. జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రేషన్ల అధికారులు మార్కెట్ ధరల గురించి కసరత్తు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. 2021 జూలైనుంచి మార్కెట్ ధర 20 నుండి 50శాతం పెరిగింది. తర్వాత ఏడు నెలల వ్యవధిలోనే మరో 20శాతం నుంచి 50శాతం పెంచుతూ సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. తక్కువ వ్యవధిలోనే రెండుసార్లు పెంచడంతో ప్రజలపై పెనుభారం పడింది. ప్రస్తుత ప్రభుత్వం సైతం మార్కెట్ విలువ పెంచాలనే అంశం తెరమీదకు తీసుకురావడంతో త్వరలోనే మార్కెట్ ధరల్లో మార్పులు వస్తాయిని మధ్య తరగతి ప్రజలు, భూ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటా సాహిత్య క్రాంతి

- 133వ ఎన్నీల ముచ్చటలో బూర్ల

కరీంనగర్‌కల్చరల్: మానవ జీవితంలోని సంఘర్షణలు, సంక్లిష్టతల మబ్బులు వీడాలంటే సాహిత్య పఠనం ఎంతో అవసరమని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. రేకుర్తిలోని డాక్టర్ వాసాల వరప్రసాద్ ఇంటి మిద్దెపై గురువారం రాత్రి జరిగిన 133వ ఎన్నీల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఇంటింటా సాహిత్య క్రాంతిని పంచే మహత్తర సాహిత్య కార్యక్రమం ఎన్నీల ముచ్చట్లు అని అభివర్ణించారు. తెరవే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్యలు సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. కవులు పీఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, ఇటిక్యాల రాము, పినగాని యుగంధర్, రామల శ్రీనివాస్, విలాసాగరం రవీందర్, మెరుగు ప్రవీణ్, నసీరుద్దీన్, మధుశ్రీ, డి.అఖిల్‌కుమార్, గజ్జెల కిశోర్, న్యాతరి శంకర్, నెరుమట్ల చైతన్య, పెద్ది సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్స్ క్వాలిటీగా ఉండాలి



కుట్టుకేంద్రంలో దుస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర: విద్యార్థులు సంవత్సరం పాటు ధరించే స్కూల్ యూనిఫామ్స్ మన్నికగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని రంగరావుపల్లి గ్రామంలోని మహిళాశక్తి కుట్టుకేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మీ పిల్లల బట్టలు కుడుతున్నామనే భావనతో యూనిఫామ్స్ మన్నికగా ఉండాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యేలోపు విద్యార్థులకు అందించాలని సూచించారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 30,810మంది విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గంగాధర మండలం రంగరావుపల్లి, ఆచంపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మరమ్మతు పనులు పరిశీలించారు. పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలల పనులు జూన్ 12వరకు పూర్తి చేయాలని సూచించారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్, లక్ష్మీదేవిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఎస్‌వో సురేశ్ రెడ్డి, డీఎం రజినీకాంత్, డీఎల్‌పీవోలు సునీత, రాంబాబు, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో రవి, డీపీఎం ప్రవీణ్, ఎంపీవో జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమో వేంకటేశా



కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కల్యాణ దాతలకు లడ్డూ, శేష వస్త్రాలు అందించారు. గోగుల ప్రసాద్, బొజ్జ రేవతి ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, రాత్రి గరుడ సేవ కన్నులపండువగా సాగింది. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

– కరీంనగర్‌కల్చరల్

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు



- 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు
- సామగ్రి తొలగింపు

విద్యానగర్(కరీంనగర్): ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై అధికారులు స్పందించారు. కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి అద్దెకిస్తున్నారని.. దీంతో కాలినడకన నగర రోడ్డుపై నడుస్తున్నవారు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ విషయమై ఈనెల 22న 'సాక్షి' దినపత్రికలో 'అద్దెకు ఫుట్‌పాత్' శీర్షికన కథనం ప్రచురించింది. అప్రమత్తమైన మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్‌లపై వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. సామగ్రిని తొలగించారు. ఇకముందు ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


కాలువలో లభ్యమైన మృతదేహం

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పట్టణ పరిధిలోని ఆదర్శనగర్‌లో గల బందంపల్లి చెరువుకు ఆనుకుని ఉన్న వ్యవసాయ కాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు పెద్దపల్లి పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్లరంగు చొక్కా, నీలిరంగు లుంగీ ఉందని, 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, ఎవరైనా సంబంధిత వ్యక్తిని గుర్తుపట్టినట్లయితే పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ 8712656505, 8712656506, 8712656507 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

- రాచర్లగొల్లపల్లిలో విషాదం


తరుణ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన యువకుడు నేలపల్లి తరుణ్(23) అప్పుల బాధతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రమాకాంత్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. నేలపల్లి తరుణ్ కుటుంబం కడు పేదరికం అనుభవిస్తుంది. స్వగ్రామంలో పనులు లేక కొంతకాలం హైదరాబాద్‌కు వెళ్లివచ్చిన తరుణ్ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈక్రమంలో పూట గడవడం కూడా ఇబ్బందిగా మారింది. సోదరుడు సాయి అంజన్ కూడా పనులు లేకుండా ఉంటున్నాడు. కుటుంబ పోషణ కోసం దొరికిన కాడల్లా అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడం, ప్రేమ విఫలం కావడంతో మనోవేదనకు గురైన తరుణ్ ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి తల్లితండ్రులు జ్యోతి–శ్రీనివాస్, సోదరుడు సాయిఅంజన్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి


సురేందర్ (ఫైల్)

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెంకు చెందిన మెస్రం సురేందర్ (38) గురువారం వడదెబ్బతో మృతిచెందాడు. పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి చేరాడు. కొద్దిసేపటికి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. సురేందర్‌కు భార్య మంజుల, ముగ్గురు కుమారులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


శ్రీనివాస్ మృతదేహం

జమ్మికుంట: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్(43) బుధవారం రాత్రి వీచిన గాలులకు ఇంటికి తీసుకున్న విద్యుత్ కనెక్షన్ వైరు కిందికి వేలాడుతుండగా కర్రతో సరి చేసే క్రమంలో వైరు మీదపడటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ రవి తెలిపారు.

విద్యుదాఘాతంతో తల్లీకూతురు మృతి

- చింతకుంట బ్రిక్స్ కంపెనీలో ఘటన
- మృతులది ఒడిశా రాష్ట్రం

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని చింతకుంట పంచాయతీ పరిధిలోని లక్ష్మీ బ్రిక్స్ కంపనీలో పని చేస్తున్న తల్లీకూతురు విద్యుదాఘాతంతో మృతిచెందారు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని నవరంగ్ జిల్లా పక్కన్‌గూడ గ్రామానికి చెందిన విద్యాదర్ బిందానీకి ఇద్దరు భార్యలు, కుమారుడు, కూతురు ఉన్నారు. మొదటి భార్య బేని బిందానీ(36), కూతురు బాబి బిందానీ(18), కుమారుడు దసరత్ బిందానీలు చింతకుంటలోని బ్రిక్స్ కంపనీలో పని చేస్తున్నారు. వీరు కంపనీలోనే షెడ్లలో ఉంటున్నారు. విద్యాదర్ బిందానీ తన రెండో భార్యతో కలిసి మరో బ్రిక్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే, బుధవారం రాత్రి కురిసిన ఈదురుగాలులకు బేని బిందానీ, బాబి బిందానీ విద్యుదాఘాతానికి గురై, మృతిచెందారు. విద్యాదర్ బిందానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విదేశీ విద్యవైపు విద్యార్థుల చూపు

- లూసియానా టెక్ వర్సిటీతో 'జ్యోతిష్మతి' ఎంవోయూ
- రాష్ట్రంలో ఘనత సాధించిన కళాశాలగా గుర్తింపు
- మూడేళ్లపాటు స్థానిక విద్యార్థులకు అమెరికా వర్సిటీలో అడ్మిషన్లు


వెబ్‌నార్ లో పాల్గొన్న జ్యోతిష్మతి విద్యార్థులు (ఫైల్)

తిమ్మాపూర్: ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవాలని అనుకుంటారు. తమ పిల్లలను అమెరికాకు పంపించాలని తలిదండ్రులు భావిస్తుంటారు. ఆ కలను నెరవేర్చేందుకు బాటలు వేసింది తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి విద్యాసంస్థల యాజమాన్యం. అమెరికాలోని లూసియానా టెక్ వర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకుంది. సైన్స్ విద్యా పరిశోధన, ఆవిష్కరణల్లో (ఇన్నోవేషన్), ఉన్నత విద్య (ఎంఎస్)లో ప్రవేశాల సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో విద్యా భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు లూసియానా టెక్ వర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

వందేళ్లకుపైగా అనుభవం..
విద్యారంగంలో వందేళ్లకుపైగా అనుభవం ఉన్న వర్సిటీ లూసియానా టెక్ వర్సిటీ. లూసియానాలోని రూస్టన్‌లో ఉన్న ఈ వర్సిటీ 1894లో స్థాపించారు. ఈ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రసిద్ధి. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అందించే ప్రోగ్రాంలు ఏబీఈటీ (అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చే గుర్తింపు పొందింది. ఇంజినీరింగ్ విద్యలో నైపుణ్యం జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఈ వర్సిటీతో ఎంవోయూ కుదరడంపై జ్యోతిష్మతి యాజమాన్యంతోపాటు విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అటానమస్ కళాశాలగా..
జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్, తెలంగాణలో 1997లో స్థాపించబడింది. కరీంనగర్‌లోని మొదటి స్వయం ప్రతిపత్తి (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్ బీయే) (ఎన్ఏ ఏ) గ్రేడ్‌తో గుర్తింపు పొందింది. ఈ ప్రాంతంలో విద్యార్థుల ప్రయోజనం కోసం అమెరికాలోని లూసియానా టెక్ వర్సిటీతో ఒప్పందం చేసుకున్న ఏకైక విద్యాసంస్థ.

ఎంవోయూతో ప్రయోజనాలు..
మాస్టర్స్ ప్రోగ్రాం అడ్మిషన్లు: లూసియానా టెక్ గ్రాడ్యుయేట్ స్కూల్ , ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఆఫీస్ స్టాఫ్ యొక్క ఫ్యాకల్టీ సలహాదారుల మార్గదర్శకత్వంతో లూసియానా టెక్ వర్సిటీలో గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ , మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రాంలో ప్రవేశం పొందేందుకు జ్యోతిష్మతి విద్యార్థులకు ప్రాధాన్యం.

ఆర్థికసాయం (స్కాలర్‌షిప్) : ఎంవోయూలో భాగంగా జ్యోతిష్మతి విద్యార్థులకు గ్రాడ్యుయేట్ అసిస్టెంట్ రూపంలో ఆర్థికసాయం అందించేందుకు లూసియానా టెక్ చర్యలు తీసుకుంటుంది.

ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్: సంస్థల మధ్య అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, ఎంపిక చేసిన ప్రాంతాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సి ఏర్పాటుకు దారి తీస్తుంది.

వృత్తిపరమైన అభివృద్ధి : జ్యోతిష్మతి, లూసియానా వర్సిటీ వర్క్‌షాపులు, సెమినార్‌లు అధ్యాపక సభ్యులకు, విద్యార్థులకు వృత్తిపర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు కలిసి పనిచేస్తాయి.

వెబినార్‌తో అవగాహన
ఇటీవల లూసియానా టెక్ వర్సిటీ ఆధ్వర్యంలో జ్యోతిష్మతి విద్యార్థులతో వెబినార్ నిర్వహించారు. ఇందులో 200 వందల మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. లూసియానా ప్రొఫెసర్లు వర్సిటీలో చదివితే కలిగే ప్రయోజనాలను వివరించారు. జీఆర్ఈ స్కోర్‌తో సంబంధం లేకుండా అడ్మిషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఆనందంగా ఉంది



లూసియానా టెక్ వర్సిటీతో కళాశాల ఎంవోయూ కుదుర్చుకోవడం ఆనందంగా ఉంది. విదేశీ విద్యనభ్యసించడం కోసం అవకాశం దక్కింది. జీఆర్ఈ స్కోర్‌తో సంబంధం లేకుండా అవకాశం కల్పించడం ఇంకా ఆనందంగా ఉంది.
– గాయత్రి, సీఎస్ఈ(ఏఐఅండ్ఎంఎల్)

కల నెరవేరుతుంది



అమెరికా వర్సిటీల్లో అవకాశం గొప్ప వరం. కళాశాల యాజమాన్యం మాకు అవకాశం కల్పించింది. బీటెక్ ఫైనలియర్‌లోనే అమెరికా యూనివర్సిటీతో ఇంటరాక్ట్ కావడం గొప్ప అనుభూతి. చిన్నప్పటి నుంచి విదేశాల్లో చదవాలని కోరిక. సాగర్‌రావు సార్‌కు థ్యాంక్స్
– వికాస్, సీఎస్ఈ(ఏఐఅండ్ఎంఎల్)

తక్కువ ఖర్చుతో..



అమెరికాలో చదవడం ఖర్చుతో కూడుకున్నది. జ్యోతిష్మతి కళాశాల యాజమాన్యం చొరవతో లూసియానా టెక్ వర్సిటీలో నేరుగా అడ్మిషన్లు అందుతున్నాయి. ఇతర వర్సిటీలతో పోలిస్తే ఖర్చు తక్కువ. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.
– నందిత, సీఎస్ఈ

మంచి అవకాశం



విదేశీ విద్య అభ్యసించేందుకు కళాశాల యాజమాన్యం మంచి అవకాశం కల్పించింది. విదేశాల్లో చదివేందుకు మాతోపాటు తల్లిదండ్రులు కూడా ఆనందగా ఉన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.
– మహతి, సీఎస్ఈ

ప్రతిభ కనబరుస్తాం



కళాశాల తరపున విదేశాలకు వెళ్లే తొలి అవకాశం రావడం ఆనందంగా ఉంది. మాతో పాటు ఇతర కళాశాలలో చదివే స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లూసియానా టెక్ వర్సిటీలో ప్రతిభ కనబర్చి జూనియర్లకు ఆదర్శంగా నిలుస్తాం.
– ప్రతిమ, సీఎస్ఈ

పేద విద్యార్థులకు ప్రయోజనం



విదేశాల్లో చదువుకోవాలన్న పేద, మధ్య తరగతి విద్యార్థుల కల నెరవేర్చేందుకే లూసియానా టెక్ వర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. మూడేళ్లపాటు ఈ అగ్రిమెంట్ ఉంటుంది. తర్వాత పొడిగించుకునే అవకాశం ఉంటుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి
–సాగర్‌రావు, చైర్మన్, జ్యోతిష్మతి విద్యాసంస్థలు

వడ్డీ వ్యాపారులపై పోలీసుల ఆరా

- పూజారి పరారీపై ఎస్‌బీ విచారణ
- బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

వేములవాడ: వేములవాడకు చెందిన పూజారి మహేశ్ రూ.2కోట్ల అప్పులు చేసి ఉడాయించిన ఘటనను జిల్లా పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాలతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు బాధితుల వివరాలు, పూజారి వివరాలు సేకరించారు. కొంత మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ వద్ద ఒకరి ఫిర్యాదు రాగా.. గురువారం మరింత మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎక్కువ మొత్తం డబ్బులు ఇచ్చిన బాధితుల్లో స్వయాన పూజారి మహేశ్ బావ ఉన్నట్లు సమాచారం. ఏకంగా రూ.47లక్షలు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇందుకు రూ.20 లక్షల మేర మహేశ్ ఇంటిని రాసిచ్చినట్లు సమాచారం. అయితే డబ్బులిచ్చిన వారికి అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి సరైన సమయంలో చెల్లించలేక పరారీ అయినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మహాలక్ష్మి వీధికి చెందిన ఓ దంపతులతో మహేశ్ లావాదేవీలు కొనసాగించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

వడ్డీ వ్యాపారులపై నిఘా
వేములవాడ ప్రాంతంలో అధికవడ్డీ వసూలు చేస్తున్న వారిపై పోలీసులు నిఘా పెంచారు. గురువారం స్థానికంగా ఉన్న వడ్డీ వ్యాపారులపై ఆరా తీశారు. ఇప్పటికే పలుమార్లు దాడులు చేసి కేసులు నమోదు చేసిన పోలీసులు మరోమారు ఆకస్మిక దాడులు చేస్తారనే చర్చ జరుగుతుంది. పేదల అవసరాలను అవకాశంగా తీసుకుంటున్న అక్రమ వడ్డీ వ్యాపారులు పెద్ద ఎత్తున వడ్డీ వసూలు చేయడంతో పేదల నడ్డి విరుగుతుందని జనం చెప్పుకుంటున్నారు. అప్పులు తీసుకున్న వారు అధిక వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నట్లు చెప్పుకుంటున్నారు.

లంచం కేసులో సీనియర్ అసిస్టెంట్‌కు జైలు

కరీంనగర్ క్రైం: ఎరువుల దుకాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తి వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కేసులో అధికారికి నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. రామడుగు మండలంలోని వెలిచాలకు చెందిన దైవాల శ్రీనివాస్ 2013 ఆగస్టు 27న తన గ్రామంలోనే ఎరువుల దుకాణం అనుమతి కోసం కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీసులో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అన్నారెడ్డి ప్రణవేందర్ రెడ్డి అతని దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపి, అనుమతి ఇప్పించేందుకు రూ.3 వేలు లంచం ఇవ్వాలన్నాడు. దీంతో శ్రీనివాస్ కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు అదే ఏడాది సెప్టెంబర్ 5న ఏడీ కార్యాలయానికి వెళ్లి, సీనియర్ అసిస్టెంట్ ప్రణవేందర్ రెడ్డికి డబ్బులిచ్చాడు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులను ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎస్పీ కేసు దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిశోర్‌కుమార్ కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి కుమార్ వివేక్ శిక్ష ఖరారు చేశారు. ప్రణవేందర్ రెడ్డి ప్రస్తుతం గంగాధర వ్యవసాయ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది.

గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరిదిద్దాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

హుజూరాబాద్: బీఆర్ఎస్ పాలనలో గాడితప్పిన విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దాలని, గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయొద్దని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో లక్షలు దోచుకుంటున్నాయని, దోపిడీని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎన్నికలకు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగా బలోపేతానికి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు, యూనివర్సిటీల్లో మౌలిక వసతులు కల్పించి ఖాళీ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరావు వెంకటేశ్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు రోహిత్, కృష్ణ, వంశీ, రవి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కనుకుల(మారుతినగర్)కు చెందిన గట్టు శంకరయ్య (50) గురువారం ప్రమాదవశాత్తు బావిలో మునిగి చనిపోయాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. శంకరయ్య హమాలీ పని చేస్తుంటాడు. సుల్తానాబాద్‌లోని గడిమహల్‌కు చెందిన ఎండీవలీతో పరిచయం ఏర్పడింది. వలీ ఇంట్లోని చేద బావిలో మోటార్ పడిపోవడంతో గురువారం శంకరయ్య మోటార్‌ను తీసేందుకు వెళ్లాడు. బావిలోకి దిగి మోటార్‌ను తీస్తుండగా మోటారుకు కట్టిన తాడు కాలుకు తట్టుకుని బావిలోనే మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని రక్షించే ప్రయత్నం చేయగా.. అప్పటికే చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. శంకరయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

గంజాయితో పట్టుబడ్డ ఆశిరెడ్డిపల్లె యువకుడు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో గంజాయితో ఆశిరెడ్డిపల్లెకు చెందిన యువకుడిని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన ప్రకాశ్ గంజాయితో సంచరిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో పట్టుకున్నారు. ప్రకాశ్ వద్ద 75 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భక్తులను బెదిరించి డబ్బులు వసూలు

మల్యాల(చొప్పదండి): మల్యాల మండల ముత్యంపేటలోని కొండగట్టు ఆలయానికి వచ్చి.. తిరిగి వెళ్తున్న భక్తులను బెదిరించి బలవంతంగా డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. మేడిపల్లి మండలకేంద్రానికి చెందిన దూమల రజిత తన బావ అంతడ్పుల కరుణాకర్‌తో కలిసి ఈనెల 9న కొండగట్టు దైవదర్శనానికి వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో రోడ్డు పక్కన కారు ఆపి ప్రసాదం తింటున్నారు. అదే సమయంలో ధరూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్, సారంగాపూర్ మండలానికి చెందిన చంద్రశేఖర్ వారి వద్దకు వచ్చి బెదిరించారు. వారి నుంచి బలవంతంగా రూ.8వేలు వసూలు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ, కారు ఢీకొని యువకుడి దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట శివారులో ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన మహజ శివరామకృష్ణ తన కుమారుడు అక్షయ్(19)తో కలిసి బుధవారం ఉదయం హైదరాబాద్ వెళ్లారు. అక్షయ్ ఇటీవలే ఇంటర్ పూర్తిచేయడంతో పైచదువుల కోసం కళాశాలను ఎంపిక చేసుకున్నారు. సాయంత్రం కారులో ఇంటికి బయల్దేరారు. వీరు అర్ధరాత్రి సమయంలో రాజేశ్వర్‌రావుపేట శివారులోని వరదకాల్వ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మెట్‌పల్లి వైపు నుంచి లారీని వీరి కారు ఢీకొంది. ఈ ఘటనలో అక్షయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన శివరామకృష్ణను స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ముందుగా మెట్‌పల్లిలోని ఆసుపత్రికి.. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పైచదువులు చదివి కుటుంబానికి ఆసరాగా ఉంటాడని భావించిన అక్షయ్ చనిపోవడంతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.


అక్షయ్(ఫైల్)

లైఫ్‌లైన్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కోర్టు సమీపంలోని లైఫ్ లైన్ ఆస్పత్రిలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగిందని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. దవాఖానా ఎలివేషన్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని ఫైర్ ఇంజిన్ సహాయంతో ఆర్పివేశామన్నారు. ఆస్పత్రిలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


శ్రీనిధి(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన కొండెళ్ల శ్రీనిధి(18) ఇంటర్‌లో ఫెయిల్ అయ్యానని ఉరేసుకోగా.. చికిత్స పొందుతూ గురువారం చనిపోయింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సదయ్య– రమ దంపతులు పిల్లలతో కలిసి సుల్తానాబాద్ పూసాల రోడ్డులో అద్దెకుంటున్నారు. కూతురు శ్రీనిధి ఇటీవల ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసింది. ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిఈనెల 8న ఇంట్లో ఉరేసుకుంది. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చనిపోయింది. తల్లి రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: మెట్‌పల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన సింగం మమత హత్య కేసులో నిందితుడు షేక్ అప్సర్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన సీఐ నవీన్, ఎస్సై చిరంజీవితో కలిసి వివరాలు వెల్లడించారు. భర్తతో విడాకులు తీసుకున్న మమత కొంతకాలంగా రాంనగర్‌లో నివాసముంటోంది. ఆమెకు అప్సర్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయంలో అప్సర్‌కు అతని భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 20 తేదీన మరోమారు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తమ మధ్య గొడవలకు మమతనే కారణమని భావించిన అప్సర్ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్న అతడు మమతతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే మమత గొంతు నులిమి కత్తితో కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్సర్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. అతడిని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో టీవీలు, ఫ్రిడ్జ్‌లు దగ్ధం

- రూ.6లక్షల ఆస్తినష్టం


కాలిపోయిన టీవీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పెద్దబడి ఏరియాలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సుమారు 50 టీవీ లు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు, కూలర్లు కాలిపోయాయి. బాధితులకు సుమారు రూ.6లక్షల వరకు ఆస్తినష్టం ఏర్పడింది. కరెంట్ తీగలను అల్లుకున్న తీగలతోనే ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. కరెంట్ తీగలకు అల్లుకున్న చెట్ల తీగలను, కొమ్మలను తొలగించాలని కోరినా సెస్ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

యువకుడి బలవన్మరణం


అజ్మత్(ఫైల్)

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని ఏసికోనిగుట్టకాలనీలో నివసించే సయ్యద్ అజ్మత్(31) బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు ఎస్సై కిరణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి సయ్యద్ అజ్మత్, భార్య రుహీనా బేగం, ఇద్దరు కూతుళ్లతో కలిసి బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. భోజనాలు ముగిసిన తరువాత సయ్యద్ అజ్మత్ నిద్ర వస్తోందని అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయాడు. అరగంట తర్వాత భార్య రుహీనాకు 'నీ భర్త ఆత్మహత్య చేసుకుంటున్నాడు' అని గుర్తుతెలియని మహిళ నుంచి ఫోన్ వచ్చింది. వెంటనే రుహీనా తమ్ముడు సల్మాన్‌తో కలిసి ఇంటికి వెళ్లి చూడగా.. భర్త అజ్మత్ బెడ్‌రూంలో ఉరేసుకొని కనిపించాడు. తమ్ముడి సాయంతో సయ్యద్ అజ్మత్‌ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. భర్త మృతిపై అనుమానాలున్నాయని రుహీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారిస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పశుగ్రాసం దగ్ధం



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని నూకల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ తీగలు ఒకటికొకటి తగిలి పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది. పది ఎకరాల్లో కోసిన గడ్డిని ఒక చోట పేర్చాడు. గడ్డి వాములతో పాటు సమీప పొలాల్లో ఉన్న పశుగ్రాసం సైతం దగ్ధమైంది. విద్యుత్ వైర్లను సరిచేయలేదని, అందువల్లే ఈ ఘటన చోటు చేసుకుందని బాధిత రైతు శ్రీనివాస్ ఆరోపించాడు. సెస్ నుంచి తనకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

భూవివాదంలో ఇద్దరి రిమాండ్

- కబ్జాలో లేని భూమి అమ్మి ఒకరు
- నకిలీపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసి మరొకరు

సిరిసిల్లక్రైం: భూవిక్రయంలో మోసం చేసిన ఇద్దరిని జిల్లా పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. సిరిసిలకు చెందిన రాగుల రాములును, మరో కేసులో ఇనుగంటి శ్రావణ్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములు పదేళ్ల క్రితం పద్మనగర్‌లోని సర్వే నంబర్ ×960/ఆ౹లో 363 చదరపు గజాల భూమి ఉందని నమ్మించి ఎల్లారెడ్డిపేటకు చెందిన ఉప్పుల నారాయణకు రూ.3లక్షలకు విక్రయించాడు. సిరిసిల్ల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించాడు. హద్దులు చూపించమంటే తప్పించుకుంటూ తిరుగుతుండడంతో ఆ భూమి గురించి తహసీల్దార్ ఆఫీస్‌లో చెక్ చేయించుకోగా ప్రభుత్వ భూమిగా తేలింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు నారాయణ సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రాగుల రాములుపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్ తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రాగుల రాములు చేతిలో మోసపోయిన బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

వేములవాడలో..
కోనరావుపేటలో తమ కబ్జాలో లేని 24 గుంటల భూమిని తమదిగా చెప్పి ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన మంత్రి రఘు రూ.20లక్షలకు వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంపల్లి విజయకు విక్రయించాడు. 2022లో రిజిస్ట్రేషన్ చేయించి, హద్దులు చూపించకపోగా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై విజయ ఇటీవల పోలీసులను ఆశ్రయించగా రఘును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయంలో రఘుకు సహకరించిన ఇనుగంటి శ్రావణ్‌రావును శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర ఉపాధ్యక్షుడిగా ఆసిఫ్‌ఖాన్



ఆసిఫ్‌ఖాన్‌కు నియామక పత్రం అందిస్తున్న మైనార్టీ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆసిఫ్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు నగర అధ్యక్షుడు అహమ్మద్ అలీ గురువారం ఆయనకు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌ఏ.మోసిన్, ఎంఏ.కరీం, సలీం తదితరులు పాల్గొన్నారు.

3 సబ్‌స్టేషన్ల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి విద్యుత్

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్



ఆస్పత్రిలో జనరేటర్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ గంగాధర్, అధికారులు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రానికి మూడు 11 కేవీ సబ్‌స్టేషన్ల ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ గంగాధర్ తెలిపారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విద్యుత్ సరఫరా తీరును పరిశీలించి, జనరేటర్లను తనిఖీ చేశారు. డీఈ జె.రాజం, ఏడీఈ–1 నరేందర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలకు పాల్పడిన ముగ్గురి అరెస్టు

కరీంనగర్ క్రైం: భూ అక్రమాలకు పాల్పడిన ముగ్గురిని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన మారుతి రాజ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. భూమిని కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. మహమ్మద్ ఇక్బాల్, షేక్ అలీ బిన్ బావాజిర్, జక్కుల మల్లేశం, గాలిపెల్లి సంతోష్‌లను సంప్రదించగా రూ.30 లక్షలు తీసుకున్నారు. తర్వాత తప్పుడు ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసి, మోసం చేశారు. దీంతో బాధితుడు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. గురువారం ఇక్బాల్, మల్లేశంలను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి, జైలుకు తరలించారు. మరో భూ వివాదంలో తమది కాని భూమిని విక్రయిస్తామని చెప్పి, రూ.36 లక్షలు తీసుకొని మోసం చేశారని ప్రవీణ్‌సింగ్ నాయక్ ఫిర్యాదు చేశాడు. దీంతో కూరపాటి వెంకటేశ్‌తోపాటు పలువురిపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటేశ్‌ను గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్

కొత్తపల్లి: ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపల్లి తహసీల్దార్ రాజేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల కొత్తపల్లి(ఈ–టెక్నో), అల్ఫోర్స్ జూనియర్ కళాశాల(బాలుర హాస్టల్) జగిత్యాల రోడ్ కొత్తపల్లి కేంద్రాల్లో పరీక్షల దృష్ట్యా పరీక్ష కేంద్రాలకు చుట్టుపక్కల 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నలుగురి కంటే ఎక్కువ మంది సంచరించడం, ఊరేగింపులు నిర్వహించడం నిషేధమన్నారు. అన్ని జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసి ఉంచాలని సూచించారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌టౌన్: యువతిని ప్రేమించినందుకు చింత భరత్‌పై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని భజరంగ్‌దళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో బాధితుడితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భరత్, యువతి కలిసి బైక్‌పై రేకుర్తికి వెళ్తుండగా ఆరుగురు వ్యక్తులు అడ్డగించి, కొట్టడమే కాకుండా ఓ పార్టీకి చెందిన కీలక నేత ఇంటికి తీసుకెళ్లి, చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడి సోదరుడు శ్రీకాంత్ భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకుల ద్వారా సీపీ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు భరత్‌ను కాపాడారన్నారు. అనంతరం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టినట్లు పేర్కొన్నారు. సదరు నేతతో భరత్‌కు ప్రాణహాని ఉందని, ఆయనపై కమ్యూనల్ షీట్లు, పీడీ యాక్ట్ పెట్టి, రిమాండ్ చేయాలని కోరారు. నాయకులు విద్యాసాగర్, కన్నం శంకర్, దావు సంతోష్, గౌతం, సందీప్, శ్రీకాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పల్లకి సేవ



సహస్ర దీపారాధన చేస్తున్న భక్తులు

దుర్గాభవానీ అమ్మవారికి పూజలు

విద్యానగర్: బుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం కరీంనగర్ మండలంలోని నగునూర్ దుర్గాభవానీ దేవాలయంలో వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పల్లకి సేవ, ఉయ్యాల సేవ, సహస్ర దీపారాధన, విశేష హారతి తదితర కార్యక్రమాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌కృష్ణ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల పరిశీలన

- ఒక్కో గ్రామంలో ఐదింటి ఎంపిక
- ప్రజలు ఉపయోగించుకుంటున్నారా లేదా అని ఆరా
- కల్పించాల్సిన సౌకర్యాలపై వివరాల సేకరణ
- ఈ–పంచాయతీ పోర్టల్‌లో నమోదు
- జిల్లాలో 313 గ్రామాలు



దుబ్బపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ప్రగతి పనులు గ్రామాల్లో ఏ విధంగా అమలవుతున్నాయనే అంశంపై పంచాయతీ అధికారులు సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలో ఈ నెల 18 నుంచి డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీవోలు గ్రామాల వారీగా పర్యటిస్తున్నారు. ఒక్కో గ్రామంలో 5 పంచాయతీ ఆస్తులను పరిశీలించి, పని చేస్తున్న విధానంపై గ్రేడింగ్ ఇస్తున్నారు. గురువారం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల గ్రామంలో, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి కరీంనగర్ మండలంలోని నగునూరు, దుబ్బపల్లి గ్రామాల్లో పర్యటించి, వివరాలు సేకరించారు.

గ్రేడింగ్ ఇవ్వాలి..

కరీంనగర్ జిల్లాలోని 15 మండలాల పరిధిలో 313 గ్రామ పంచాయతీలున్నాయి. ఒక్కో పంచాయతీలో 5 ప్రభుత్వ ఆస్తులను గుర్తించి, వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ప్రతీ గ్రామంలోని క్రీడాప్రాంగణం, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డును పంచాయతీ అధికారులు పరిశీలిస్తున్నారు. డీపీవో మండలానికో గ్రామ పంచాయతీ, డీఎల్‌పీవోలు మండలానికి రెండు పంచాయతీలు, ఎంపీవోలు అన్ని పంచాయతీల్లోని ఐదింటిని తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుంది. తెలంగాణ క్రీడా ప్రాంగణం విద్యార్థులు, యువకులకు అనుకూలంగా ఉందా లేదా, క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా, ప్రతీరోజు ఏయే ఆటలు ఆడుతున్నారనే వివరాలు సేకరించాలి. వైకుంఠధామంలో విద్యుత్, నీటి సౌకర్యం ఉన్నాయా లేవా, గ్రామస్తులు ఉపయోగిస్తున్నారా లేదా, ఉపయోగించకుంటే కారణాలు కనుక్కోవాలి. పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు, పండ్ల మొక్కలు, నర్సరీలో పెంచుతున్న మొక్కలు, నీటి సౌకర్యం తదితర వివరాలు నమోదు చేయాలి. సెగ్రిగేషన్ షెడ్డును ఉపయోగిస్తున్నారా లేదా, తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా లేదా, కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారా లేదా వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఐదింటిని ప్రజలు ఏ మేరకు ఉపయోగించుకుంటున్నారు, ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలను సూచించాలి. ఆయా గ్రామాల్లో వాటి పనితీరును తనిఖీ చేసి ఎ, బి, సి, డి గ్రేడింగ్ ఇస్తున్నారు. ఎ–చాలా బాగుంది, బి– బాగుంది, సి–పరవాలేదు, డి–నిరుపయోగం అనే గ్రేడ్‌లను ఇస్తూ ఆన్‌లైన్‌లో ప్రతీరోజు వివరాలు నమోదు చేస్తున్నారు.

28లోగా నమోదుకు చర్యలు

గ్రామ పంచాయతీల్లో పైన పేర్కొన్న ఐదు ఆస్తులను ప్రజలు ఉపయోగిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. ఇంకా కల్పించాల్సిన సౌకర్యాలపై వివరాలు సేకరిస్తున్నాం. అన్ని గ్రామాల్లో పరిశీలించి, ఈ నెల 28లోగా ఈ–పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– రవీందర్, డీపీవో

సెలవుల్లో పంచాయతీ కార్యదర్శులు

- ఇన్‌చార్జులపై అదనపు భారం

కరీంనగర్‌రూరల్: పంచాయతీ కార్యదర్శులు సెలవుల్లో వెళ్లడంతో ఇన్‌చార్జి కార్యదర్శులపై అదనపు భారం పడుతోంది. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా 10 రోజులు సెలవులో వెళ్లగా జూబ్లీనగర్ కార్యదర్శి కిరణ్‌రావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే, గోపాల్‌పూర్ కార్యదర్శి విజయలక్ష్మి స్థానంలో దుర్శేడ్ కార్యదర్శి సంజీవరెడ్డి, చామనపల్లి కార్యదర్శి ప్రభాకర్ స్థానంలో చెర్లభూత్కూర్ కార్యదర్శి వాహిజ్, నల్లగుంట్లపల్లి కార్యదర్శి సుమన్ స్థానంలో మందులపల్లి కార్యదర్శి కిరణ్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బొమ్మకల్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలను పంచాయతీ సిబ్బంది అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. అక్రమ నిర్మాణదారులపై పంచాయతీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాదాస్పద గ్రామం బొమ్మకల్‌లో కార్యదర్శిగా విధులు నిర్వహించేందుకు పలువురు కార్యదర్శులు వెనకడుగు వేస్తున్నారు. భూ వివాదాలు, గొడవలను తట్టుకోలేక ప్రస్తుత కార్యదర్శి సెలవులో వెళ్లినట్లు తెలిసింది. గోపాల్‌పూర్ కార్యదర్శి విజయలక్ష్మి శుక్రవారం విధుల్లో చేరనుండగా, బొమ్మకల్, చామనపల్లి కార్యదర్శుల సెలవులు ఈ నెల 26 వరకు ఉన్నాయని ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. నల్లగుంటపల్లి కార్యదర్శి సుమన్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లారని పేర్కొన్నారు.

కమనీయం.. శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

కొత్తపల్లి: మండలంలోని నాగులమల్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఒడిబియ్యం, మంగళహారతి, అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి గిరిప్రదక్షిణ ఘనంగా జరిపారు.



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

టీ–20 జట్టు ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా టీ–20 ఎంపిక పోటీలకు స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉత్తమంగా రాణించిన 15 మందిని ఎంపిక చేసినట్లు క్రికెట్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ గౌడ్, మనోహర్‌రావు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

టీ 20 జట్టు ఇదే.. సిద్దార్థ్ రెడ్డి, ఎండీ.షానవాజ్, రాజు, శ్రీకాంత్, ఎ.రాజు, ఇర్షాద్ ఖాన్, రిత్విక్ సూర్య, పి.రిష్వంత్ గౌడ్, ఎండీ.క్రమాన్, అక్రమ్, అర్షద్, నితిన్ రెడ్డి, టి.రిత్విక్, వంశీ, టి.రవితేజ.

'శ్రీ చైతన్య'లో అనుమతి లేకుండా అడ్మిషన్లు

- ఆ స్కూళ్లపై కేసు నమోదు చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్

కరీంనగర్: అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్న శ్రీ చైతన్య స్కూళ్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనుమతి లేకుండా శ్రీ చైతన్య పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పాఠశాల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నా, పీఆర్వోలు అందులో నాలుగు కుర్చీలు వేసుకొని, అడ్మిషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ–టెక్నో, ఒలింపియాడ్, ఐపీఎల్ వంటి తోక పేర్లతో నిబంధనలకు విరుద్ధంగా బ్రాంచ్‌లు ఓపెన్ చేస్తున్నారన్నారు. ఎక్కడో వస్తున్న ర్యాంకులకు ఇక్కడ హోర్డింగ్‌లు పెట్టి, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అడ్మిషన్ ఒక దగ్గర చేసి, వేరే పాఠశాల పేరుమీద విద్యార్థులతో పరీక్ష రాయిస్తున్నారని పేర్కొన్నారు. డీఈవో స్పందించి, శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నమయ్య జయంతి

కరీంనగర్ కల్చరల్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతిని గురువారం మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదుట అన్నమయ్య విగ్రహం వద్ద నిర్వహించారు. అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. చిలకపాటి హనుమంతరావు, కేబీ.శర్మ, భక్తులున్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

జీలుగ విత్తనాల పంపిణీలో జాప్యం

కరీంనగర్‌రూరల్: జీలుగ విత్తనాల పంపిణీలో జాప్యంతో కరీంనగర్ మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాల కోసం మండల వ్యవసాయాధికారి కార్యాలయం, డీసీఎంఎస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కరీంనగర్ మండలానికి మొత్తం 120 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని వ్యవసాయాధికారులు ఇండెంట్ పంపించారు. వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమైన రైతులు ముందుగా పొలంలో పచ్చిరొట్ట ఎరువైన జీలుగను వేస్తారు. నేల స్వభావం ఆధారంగా దీన్ని సాగు చేసుకుంటే ఆపై వేసుకునే పంటలకు అనుకూలంగా ఉంటుంది. జీలుగ విత్తనాలు వేసిన అనంతరం నెల రోజుల్లోపు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వాటిని దుక్కిలో కలియదున్నడంతో నేల సారవంతమవుతుంది. అయితే, విత్తనాలను ప్రభుత్వం ఇంతవరకు కేటాయించలేదు. శుక్రవారం నుంచి తీగలగుట్టపల్లి డీసీఎంఎస్‌లో రైతులకు జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.సత్యం తెలిపారు. ఇంకా, కరీంనగర్ డీసీఎంఎస్, నగునూరు కేంద్రాలకు విత్తనాలు రావాల్సి ఉందని పేర్కొన్నారు.

బుద్ధునికి నివాళి



బుద్ధుని విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సుభాష్‌నగర్ వాసులు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ బుద్ధ మార్గ్ రోడ్ నంబర్ 10 సర్కిల్ వద్ద గురువారం బుద్ధ జయంతి నిర్వహించారు. కార్పొరేటర్ గంట కల్యాణి–శ్రీనివాస్ దంపతులు స్థానికులతో కలిసి బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాతకుల భూమయ్య, దండి రవి, లక్ష్మణ్ బోధ, రాజయ్య, మద్దినాల రవీందర్, మాణిక్యం, గుంటి భిక్షపతి, కనుమల్ల రాజశేఖర్, అంబటి గంగారం, కర్ర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: గోవాలో ఈ నెల 25, 26వ తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు కరీంనగర్ దమ్మికా కాయ్ షిటోరియో కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ చీఫ్ ఆర్.ప్రసన్నకృష్ణ తెలిపారు. అండర్–14 కుమిటీ, కటాస్ విభాగాల్లో మధుశ్రీ, శ్రితిక్ నందన్, ఆదిత్య సాయి, శ్రీచరణ్, మణితేజ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని కరాటే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బండారి సంతోష్, కోచ్ వినోద్ తదితరులు గురువారం అభినందించారు.

ఒరిగిన స్తంభాలు.. ప్రమాద సూచికలు



గుజ్జులపల్లె పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగి, ప్రమాదకరంగా ఉన్నాయి. చెర్లభూత్కూర్ పంచాయతీ పరిధి గుజ్జులపల్లెలోని తమ పొలాల్లో మూడు 11 కేవీ స్తంభాలు రెండేళ్లుగా ఇలాగే ఉంటున్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు దాసరి నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ఒరుగల స్వామి ఆరోపించారు. ఈదురుగాలులకు అవి ఎప్పుడు పడిపోతాయో తెలియడం లేదన్నారు. పొలం దున్నడం, వరి నాటు వేయించడం, హార్వెస్టర్‌తో కోయించడం వంటి పనులను భయంభయంగా చేయిస్తున్నామని తెలిపారు. స్తంభాలను సరిచేయాలంటూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కూర శ్యాంసుందర్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

కులగణన తర్వాతే 'స్థానికం' జరపాలి

- జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్

విద్యానగర్: బీసీ కులగణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కరీంనగర్ జెడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ కోరారు. గురువారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీ కులగణన చేపడుతామని మేనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. దానికనుగుణంగా కులగణన చేపట్టాకే బీసీ రిజర్వేషన్లు పెంచి, ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో బీసీల జనాభా దామాషా ప్రకారం కనీసం 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక ఎదుగుదల స్థానిక సంస్థల రిజర్వేషన్లతోనే సాధ్యమన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరి పర్శరాం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, నాగుల కనకయ్య, నాయకులు రాచమల్ల రాజు, నారోజు రాకేశ్, కాయితోజు బ్రహ్మచారి, బోయిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

30న బీసీ రిజర్వేషన్లపై సదస్సు

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కరీంనగర్‌లో ఈ నెల 30న సదస్సు నిర్వహించనున్నట్లు జెడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

'ఆ కళాశాలలపై చర్యల్లో విఫలం'

- ఇంటర్ బోర్డుపై ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్, యుగంధర్ ఆరోపణలు



మాట్లాడుతున్న మహేందర్, యుగంధర్

కరీంనగర్: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ఇంటర్ బోర్డు విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్ ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు కాసుల కక్కుర్తితో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించి, అనధికారికంగా జూనియర్ కళాశాలలను నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇంటర్మీడియట్ రెండో విద్యాసంవత్సర తరగతులను జూన్ రెండోవారం నుంచి ప్రారంభించాల్సి ఉండగా ఏప్రిల్ 20 నుంచే ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. నగరంలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు కేవలం మార్కులు, ర్యాంకులంటూ విద్యార్థులను ఆట వస్తువులుగా మార్చి, మానసిక ప్రశాంతతకు దూరం చేస్తున్నాయని మండిపడ్డారు. లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. హాస్టళ్లకు మున్సిపల్ అనుమతులు, సరైన మరుగుదొడ్లు లేవని, నాణ్యత లేని ఆహారాన్ని విద్యార్థులకు పెడుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేకుండా నడుస్తున్న జూనియర్ కళాశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసు వెనక్కి తీసుకోవాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి రత్నం రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తదితరులపై పెట్టిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని సంఘం రాష్ట్ర కోశాధికారి రత్నం రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వస్తే విద్యార్థులపై కేసులను ఎత్తివేస్తామని చెప్పి, ప్రస్తుతం విద్యార్థులపై, విద్యార్థి నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదన్నారు. 1974లో ఏర్పడిన పీడీఎస్‌యూ దేశంలో శాస్త్రీయ విద్యావిధానం రూపొందించాలని, కామన్ విద్యావిధానం కోసం పోరాడుతోందన్నారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించిందని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై, ర్యాగింగ్ రద్దుకై ఉద్యమించిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, వాటిపై నిస్వార్థంగా పోరాడుతోందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులపై కావాలనే పూసపల్లి కుట్ర కేసు నమోదు చేశారని ఆరోపించారు. వెంకటరెడ్డి మలిదశ తెలంగాణ పోరాటంలో మడమ తిప్పకుండా ఉద్యమించారని, గత ప్రభుత్వం తెచ్చిన ప్రైవేటు యూనివర్సిటీల బిల్లుకు వ్యతిరేకంగా పోరాడి, కేసుల పాలయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి నాయకులపై మోపిన తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, కల్యాణ్, వేణు, కోటి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కుంకుమ పూజ

కరీంనగర్ కల్చరల్: వాసవి వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా గురువారం అశోక్‌నగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కుంకుమ పూజ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, కార్యదర్శి స్వరూప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

సాక్షి బిజినెస్
శుక్రవారం
24-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,197	370
75,418	22,968

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,812	▲	10
డోజోన్స్	39,200	▽	472
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,339	▽	31
డాక్స్	18,691	▲	11
షాంఘై	3,116	▲	42
నికాయ్	39,103	▲	486

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	71,590	▽	1,050
బంగారం (22 క్యారెట్)	68,180	▽	1,000
వెండి (కిలో)	97,000	▽	2,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.91	83.93
£	బ్రిటన్ పౌండ్		104.77	107.33
€	యూరో		89.37	91.74
¥	జపాన్ ఎన్ (100)		52.80	53.96
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.65	56.59
S$	సింగపూర్ డాలర్		59.54	64.19
SAR	సౌదీ రియాల్		21.31	22.87
UAE D	యూఏఈ దిర్హామ్		21.79	23.57
¥	చైనా యువాన్		10.38	12.45




డివిడెండ్ జోష్.. సూచీలు ఖుష్

తాజా గరిష్టాలకు సెన్సెక్స్, నిఫ్టీలు ● ఇన్వెస్టర్లకు రూ.4.28 లక్షల కోట్ల సంపద

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)బోర్డు కేంద్ర ప్రభుత్వానికి రూ.2.1 లక్షల కోట్ల భారీ డివిడెండ్ ఇచ్చేందుకు ఆమోదం తెలపడంతో గురువారం స్టాక్ సూచీలు సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు ఇన్వెస్టర్లలో విశ్వాస్వాన్ని నింపాయి. అలాగే దేశంలో ఎగుమతులు పెరగడంతో పాటు మే నెలలో ఉద్యోగ కల్పన 18 ఏళ్ల గరిష్టానికి చేరినట్లు వెల్లడైన గణాంకాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఫలితంగా సూచీలు దాదాపు 2% ర్యాలీ చేసి ఈ జనవరి 29 తర్వాత అతిపెద్ద ఒక రోజు లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,197 పాయింట్లు పెరిగి 75,418 ముగిసింది. నిఫ్టీ 370 పాయింట్లు బలపడి 22,968 వద్ద నిలిచింది.

కొనుగోళ్ల జోరు - రికార్డు హోరు

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. మెటల్, ఫార్మా మినహా అన్ని రంగాల్లో కొనుగోళ్ల వెల్లువెత్తడంతో సూచీలు స్థిరంగా ముందుకు కదలాడాయి. మిడ్‌సెషన్ నుంచి ఆర్‌బీఐ డివిడెండ్ ప్రకటనల బలపడటంతో ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. దశలో సెన్సెక్స్ 1,279 పాయింట్లు దూసుకెళ్లి 75వేల స్థాయిపైన 75,500 వద్ద, నిఫ్టీ 396 పాయింట్లు బలపడి 22,968 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. జూన్ 4 తర్వాత స్టాక్ మార్కెట్ భారీ లాభాల్లో దూసుకుపోవచ్చని నిపుణులు భావించారు. అయితే సార్వత్రిక ఎన్నికల ఫలితాల కంటే ముందే సరికొత్త రికార్డులను నమోదు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఆర్‌బీఐ భారీ డివిడెండ్ మరోసారి స్థిరమైన ప్రభుత్వమే ఏర్పడొచ్చన్న అంచనాలు సూచీల పరుగుకు ప్రధాన కారణమని భావిస్తున్నారు.



74,221
క్రితం ముగింపు

గరిష్ట స్థాయి 75,500
ముగింపు 75,418

■ **జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద**

సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.4.28 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.420 లక్షల కోట్లకు చేరింది.

■ **అదానీ గ్రూప్ షేర్లకు డిమాండ్**

అదానీ గ్రూప్‌కు చెందిన ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ బీఎస్‌ఈ సెన్సెక్స్‌లో చోటు దక్కనుండడంతో ఈ గ్రూప్‌లోని తక్కిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మొత్తం గ్రూప్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 17.23 లక్షల కోట్లకు చేరింది.

■ **ఎన్‌ఎస్‌ఈ రికార్డ్**

ఎన్‌ఎస్‌ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ తొలిసారి 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది. గతేడాది డిసెంబర్‌లో 4 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్ మైలురాయిని అందుకుంది.

■ **మెప్పించిన గో డిజిట్**

ఆన్‌లైన్ వేదికగా బీమా సేవలు అందించే గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ షేరు లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.272)తో పోలిస్తే 3% లాభంతో ప్రీమియంతో రూ.281 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 15% ఎగసి రూ.314 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 12% లాభంతో రూ.306 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.28,043 కోట్లుగా నమోదైంది.

ఐకూ అమ్మకాల్లో ఏపీ, తెలంగాణ హవా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్స్ తయారీలో ఉన్న ఐకూ 2024 జనవరి–మార్చి అమ్మకాల్లో వాటా పరంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తొలి స్థానంలో నిలిచాయి. తెలుగు రాష్ట్రాల్లో వార్షిక వృద్ధి అత్యధికంగా 35 శాతం నమోదైందని ఐకూ సీఈవో నిపుణ్ మార్యా గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. నగరాల వారీగా మార్చి త్రైమాసికం విక్రయాల్లో 28 శాతం వృద్ధితో హైదరాబాద్ నంబర్–1 స్థానం సంపాదించిందన్నారు. 'ప్రస్తుతం మొబైల్ ఫోన్స్‌ను అమెజాన్, ఐకూ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నాం. భవిష్యత్తులో ఆఫ్‌లైన్‌కు విస్తరిస్తాం.' అని వివరించారు.

ఇండిగో లాభం హైజంప్

క్యూ4లో రూ. 1,895 కోట్లు



న్యూఢిల్లీ: ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్–ఇండిగో గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసిక నికర లాభం రెట్టింపై రూ. 1,895 కోట్లకు చేరింది. సామర్థ్య విస్తరణ, ప్రయాణికులు పెరగడం, సానుకూల వాతావరణం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. ఇక మొత్తం ఆదాయం సైతం 27 శాతం జంప్‌చేసి రూ. 18,505 కోట్లను అధిగమించింది. పూర్తి ఏడాదికి ఇండిగో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. దాదాపు రూ. 8,173 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2022–23లో రూ. 306 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 71,200 కోట్లకు చేరింది.

ఇండిగో షేరు బీఎస్‌ఈలో 1 శాతం లాభంతో రూ. 4,401 వద్ద ముగిసింది.

ఐటీసీ లాభం ఫ్లాట్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 5,191 కోట్లకు పరిమితమైంది. వినియోగ డిమాండ్ మందగించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 5,243 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 7.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక మొత్తం ఆదాయం మాత్రం రూ. 19,058 కోట్ల నుంచి రూ. 19,446 కోట్లకు బలపడింది. ఇతర ఆదాయంతో కలిపి రూ. 20,130 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 3 శాతం పెరిగి రూ. 13,294 కోట్లను తాకాయి. కాగా.. పూర్తి ఏడాదికి ఐటీసీ నికర లాభం 7 శాతం వృద్ధితో రూ. 20,751 కోట్లను దాటింది. 2022–23లో రూ. 19,477 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 76,518 కోట్ల నుంచి రూ. 76,840 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్‌ఈలో స్వల్ప లాభంతో రూ. 441 వద్ద ముగిసింది.

విస్తరిస్తున్న సిమెంట్ పరిశ్రమ



శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖౌరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత సిమెంట్ పరిశ్రమ స్థాపిత సామర్థ్యం ప్రస్తుతం 665 మిలియన్ టన్నులు. ఈ రంగం ఏటా 40–50 మిలియన్ టన్నుల సామర్థ్యం నూతనంగా జోడిస్తోందని సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సీఎంఏ) ప్రెసిడెంట్, శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖౌరీ తెలిపారు. సీఎంఏ, సీఐఐ ఆధ్వర్యంలో ఇక్కడి హెచ్ఐసీసీలో గురువారం ప్రారంభమైన 20వ గ్రీన్ సిమెంటెక్ సదస్సు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 2023–24లో దేశవ్యాప్తంగా 430 మిలియన్ టన్నుల సిమెంట్ అమ్ముడైందని చెప్పారు. ప్లాంట్ల వినియోగం ఏటా సగటున 75 శాతం ఉంటోందని పేర్కొన్నారు. ఒక్కో మిలియన్ టన్ను సామర్థ్యం జోడించేందుకు కంపెనీలకు సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడి అవసరమని గ్రీన్ సిమెంటెక్ 2024 చైర్మన్, జేకే సిమెంట్ డిప్యూటీ ఎండీ, సీఈవో మాధవ్ సింఘానియా వెల్లడించారు. సిమెంట్ రవాణాకు ఎలక్ట్రిక్ ట్రక్‌లను దశలవారీగా వినియోగించాలని పరిశ్రమ నిర్ణయించిందని మాధవ్ తెలిపారు. ఇప్పటికే వివిధ కంపెనీలు సుమారు 150 ట్రక్‌లకు ఆర్డర్లు ఇచ్చాయని వెల్లడించారు.



బ్లాక్‌లిస్టులో ఈవీ కంపెనీలు!

● లిస్టులో హీరో ఎలక్ట్రిక్, ఒకినావా, బెన్లింగ్
● ఫేమ్–2 నిబంధనల ఉల్లంఘన నేపథ్యం

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉన్న హీరో ఎలక్ట్రిక్, ఒకినావా ఆటోటెక్, బెన్లింగ్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల నుండి బ్లాక్‌లిస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫేమ్–2 పథకం కింద తప్పుగా అందుకున్న సబ్సిడీ ప్రయోజనాలను తిరిగి ఇవ్వడంలో ఈ సంస్థలు విఫలం కావడమే ఇందుకు కారణం. ఈ పథకం కింద నమోదైన వివిధ తయారీ సంస్థలు ఫేమ్–2 మార్గదర్శకాలను ఉల్లంఘించడంపై భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు 2022లో ఫిర్యాదులు అందాయి. ఫేమ్–2 నిబంధన ప్రకారం దేశీయంగా విడిభాగాలను కొనుగోలు చేయకుండా విదేశాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకున్నాయన్నది ఈ ఫిర్యాదుల సారాంశం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10



భారత బాక్సర్లకు చివరి అవకాశం

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ చివరి టోర్నీ నేటి నుంచి బ్యాంకాక్‌లో జరగనుంది. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారవుతుంది. భారత్ నుంచి పురుషుల విభాగంలో ఏడుగురు బాక్సర్లు (అమిత్ పంఘాల్–51 కేజీలు, సచిన్–57 కేజీలు, అభినాశ్ జమ్వాల్–63.5 కేజీలు, నిశాంత్ దేవ్–71 కేజీలు, అభిమన్యు–80 కేజీలు, సంజీత్–92 కేజీలు, నరేందర్ -ప్లస్ 92 కేజీలు)... మహిళల విభాగంలో ముగ్గురు బాక్సర్లు (జాస్మిన్–57 కేజీలు, అంకుశిత–60 కేజీలు, అరుంధతి–66 కేజీలు) బరిలో ఉన్నారు.

భారత మహిళల జట్టుకు రెండో ఓటమి

యూరోప్ అంచె ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత మహిళల జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఆంట్‌వర్ప్‌లో గురువారం ఆతిథ్య బెల్జియం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 0–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. అర్జెంటీనాతో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 0–5 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది.



ప్రీతిస్మిత ప్రపంచ రికార్డు

లిమా (పెరు): ప్రపంచ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి ప్రీతిస్మిత భోయ్ మూడు స్వర్ణ పతకాలు సాధించింది. ఈ క్రమంలో క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. మహిళల 40 కేజీల విభాగంలో బరిలోకి దిగిన ఒడిశాకు చెందిన 15 ఏళ్ల ప్రీతిస్మిత మొత్తం 133 కేజీలు (క్లీన్ అండ్ జెర్క్‌లో 76 కేజీలు+స్నాచ్‌లో 57 కేజీలు) బరువెత్తి విజేతగా నిలిచింది. మూడు విభాగాల్లో (క్లీన్ అండ్ జెర్క్+స్నాచ్+టోటల్) వేర్వేరుగా పతకాలు అందించగా... ఈ మూడింటిలోనూ ప్రీతిస్మిత అగ్రస్థానంలో నిలిచి మూడు పసిడి పతకాలను సొంతం చేసుకుంది. 40 కేజీల విభాగంలోనే పోటీపడ్డ భారత లిఫ్టర్ జోష్నా సబర్ రెండు రజతాలు, ఒక కాంస్యం సాధించింది. 45 కేజీల విభాగంలో పాయల్ ఒక రజతం, రెండు కాంస్యాలు గెలిచింది. పురుషుల 49 కేజీల విభాగంలో బాబూలాల్ రెండు కాంస్య పతకాలు దక్కించుకున్నాడు.

సుమిత్‌కు క్లిష్టమైన 'డ్రా'

ఫ్రెంచ్ ఓపెన్ తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్‌తో 'ఢీ'



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో భారత నంబర్‌వన్, ప్రపంచ 94వ ర్యాంకర్ సుమిత్ నగాల్‌కు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కరెన్ ఖచనోవ్ (రష్యా)తో సుమిత్ ఆడతాడు. గతంలో వీరిద్దరు ముఖాముఖిగా ఒక్కసారి కూడా తలపడలేదు. 6 అడుగుల 6 అంగుళాల ఎత్తు, 87 కేజీల బరువున్న ఖచనోవ్ తన కెరీర్‌లో 6 ఏటీపీ టూర్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గగా... సుమిత్ ఒక్కసారి కూడా ఏటీపీ టూర్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయాడు. మరోవైపు స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు కూడా తొలి రౌండ్‌లో కఠిన ప్రత్యర్థి ఎదురుకానున్నాడు. 14సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన నాదల్ తొలి రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో ఆడతాడు. ఫ్రెంచ్ ఓపెన్ ఈనెల 26 నుంచి జరుగుతుంది.

'ఫైనల్' వేటలో...

ఓవరాల్‌గా ఆరుసార్లు 200కుపైగా స్కోర్లు... వీటిలో గత ఏడాది వరకు ఉన్న అత్యుత్తమ స్కోరును అధిగమిస్తూ మూడుసార్లు 250కు పైగా పరుగులు... పవర్‌ప్లేలో ఏ జట్టుకూ సాధ్యం కాని విధంగా రెండుసార్లు 100కు పైగా స్కోర్లు... ముగ్గురు ప్రధాన బ్యాటర్లు కలిపి ఏకంగా 106 సిక్సర్లు... ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన ఇది. ఈ జోరులో ప్లే ఆఫ్స్‌కు దూసుకొచ్చిన జట్టు తొలి క్వాలిఫయర్‌లో కాస్త తడబడింది. అయితే ఆరేళ్ల తర్వాత మళ్లీ ఫైనల్ చేరేందుకు ఆ జట్టుకు మరో అవకాశం లభించగా, రాజస్తాన్ రాయల్స్ రూపంలో ఎదురుగా ప్రత్యర్థి ఉంది. నాణ్యమైన బౌలింగ్‌తో రాజస్తాన్ ఎలాంటి ప్రత్యర్థినైనా నిలువరించగలుగుతోంది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య రెండో క్వాలిఫయర్ మ్యాచ్ ఆసక్తి రేపుతోంది.

చెన్నై: ఐపీఎల్–17 సీజన్ తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రత్యర్థిని నిర్ణయించే క్వాలిఫయర్–2 సమరానికి రంగం సిద్ధమైంది. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన హైదరాబాద్, రాజస్తాన్ జట్ల మధ్య చెపాక్ మైదానంలో ఈ పోరు జరగనుంది. ఈ సీజన్‌లో ఇరు జట్లు తలపడిన ఏకైక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఒక పరుగు తేడాతో నెగ్గింది. టోర్నీలో దూకుడైన బ్యాటింగ్‌తో హైదరాబాద్ శాసించగా... రాజస్తాన్ విజయాల్లో బౌలింగ్ కీలకంగా నిలిచింది. ఇరు జట్లు తాజా సీజన్‌లో చెన్నై వేదికగా ఒక్కో మ్యాచ్ ఆడాయి. హైదరాబాద్ 134, రాజస్తాన్ 141 పరుగులు మాత్రమే చేసి చెన్నై చేతిలో ఓటమి పాలవడం విశేషం.

మార్క్‌రమ్‌ను ఆడిస్తారా!

కోల్‌కతాతో తొలి క్వాలిఫయర్‌లో హైదరాబాద్ బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. హెడ్ వరుసగా రెండోసారి డకౌట్ కాగా, అభిషేక్ శర్మ కూడా విఫలం కావడం జట్టుపై ప్రభావం చూపింది. క్లాసెన్ మాత్రం తన ఫామ్ కొనసాగించాడు. ఓపెనర్లు లీగ్ మ్యాచ్ తరహాలో తమ జోరును అందిపుచ్చుకుంటే జట్టు మరోసారి భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. ఇతర బ్యాటర్లు రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్ రెడ్డి, అబ్దుల్ సమద్ కూడా సహకరించాల్సి ఉంది. అయితే బ్యాటింగ్‌ను పటిష్టం చేసేందుకు నాలుగో విదేశీ ఆటగాడిగా మార్క్‌రమ్ లేదా గ్లెన్ ఫిలిప్స్‌లలో ఒకరిని రైజర్స్ ఆడించవచ్చు. పెద్దగా ప్రభావం చూపలేని విజయకాంత్ స్థానంలో లెగ్ స్పిన్నర్ మయాంక్ మార్కండేను తీసుకొని 'ఇంపాక్ట్' ద్వారా మరో బ్యాటర్‌ను ఆడించే అవకాశం ఉంది. చెపాక్ పిచ్‌పై షహబాజ్‌తో పాటు మరో స్పిన్నర్ జట్టుకు అవసరం. పేస్ బౌలింగ్‌లో భువనేశ్వర్, కమిన్స్‌లతో పాటు సొంత మైదానంలో ఆడుతున్న నటరాజన్ కీలకం అవుతారు.

మార్పుల్లేకుండా...

రాజస్తాన్ మాత్రం బుధవారం ఆర్‌సీబీని ఓడించిన టీమ్‌లో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చు. స్పిన్‌కు అనుకూలిస్తే ఒక పేసర్‌ను తప్పించి కేశవ్‌ను ఆడించాలని భావించినా... జట్టు విదేశీ కూర్పుపై ప్రభావం పడవచ్చు. బౌల్ట్ కీలక బౌలర్ కాగా ఓపెనర్‌గా టామ్ కోలర్ ఖాయం. లోయర్ మిడిలార్డర్‌లో హెట్‌మైర్, పావెల్‌ల మెరుపు బ్యాటింగ్‌ను కోల్పోయి పరిస్థితి రాజస్తాన్ తెచ్చుకోదు. కాబట్టి ఇద్దరు అగ్రశ్రేణి స్పిన్నర్లు అశ్విన్, చహల్ జట్టు భారం మోస్తారు. ముఖ్యంగా ఓనమాలు నేర్చుకున్న మైదానంలో అశ్విన్ చెలరేగితే హైదరాబాద్‌కు కష్టాలు తప్పవు. రాయల్స్ బ్యాటింగ్‌లో కాస్త దూకుడు లోపించింది. ఎలిమినేటర్‌లో కూడా అది కనిపించింది కానీ లక్ష్యం చిన్నది కావడంతో దాని ప్రభావం కనపడలేదు. ముఖ్యంగా సామ్సన్ వరుసగా మూడు మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. రియాన్ పరాగ్ మాత్రమే నిలకడగా ఆడుతుండగా, జురేల్ కూడా రాణించడం లేదు.



సామ్సన్, కమిన్స్

నేడు ఐపీఎల్ రెండో క్వాలిఫయర్

● రాజస్తాన్‌తో సన్‌రైజర్స్ ఢీ
● గెలిచిన జట్టు తుది పోరుకు
● రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

తుది జట్ల వివరాలు (అంచనా)

హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, త్రిపాఠి, నితీశ్ రెడ్డి, క్లాసెన్, సమద్, షహబాజ్, భువనేశ్వర్, నటరాజన్, మార్కండే, మార్క్‌రమ్. రాజస్తాన్: సామ్సన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, టామ్ కోలర్, పరాగ్, జురేల్, హెట్‌మైర్, పావెల్, అశ్విన్, బౌల్ట్, అవేశ్ ఖాన్, సందీప్ శర్మ, చహల్.

పిచ్, వాతావరణం

చెన్నైలో వేడి చాలా ఎక్కువగా ఉంది. అయితే సాయంత్రం మంచు ప్రభావం కూడా ఉండటంతో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. ఈ సీజన్‌లో జరిగిన 7 మ్యాచ్‌లలో 5 సార్లు తర్వాత బ్యాటింగ్ చేసిన జట్టే నెగ్గింది.

19 ఐపీఎల్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు ముఖాముఖిగా 19 సార్లు తలపడ్డాయి. 10 మ్యాచ్‌ల్లో హైదరాబాద్... 9 మ్యాచ్‌ల్లో రాజస్తాన్ గెలుపొందాయి. ఈ సీజన్‌లో ఈ రెండు జట్లు ఒకసారి పోటీపడగా సన్‌రైజర్స్ ఒక పరుగు తేడాతో నెగ్గింది. రాజస్తాన్‌పై సన్‌రైజర్స్ అత్యధిక స్కోరు 217, అత్యల్ప స్కోరు 127 కాగా... సన్‌రైజర్స్‌పై రాజస్తాన్ అత్యధిక స్కోరు 220, అత్యల్ప స్కోరు 102.

శ్రమించి గెలిచిన సింధు

ప్రపంచ 10వ ర్యాంకర్‌పై అష్మిత విజయం ● డబుల్స్‌లో ముగిసిన భారత్ పోరు


సింధు


అష్మిత

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ అష్మిత చాలిహా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సింధు 21–13, 12–21, 21–14తో ప్రపంచ 34వ ర్యాంకర్ సిమ్ యు జిన్ (దక్షిణ కొరియా)పై కష్టపడి గెలుపొందగా... ప్రపంచ 53వ ర్యాంకర్ అష్మిత 21–19, 16–21, 21–12తో ప్రపంచ 10వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. 2022 ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన అష్మిత మళ్లీ రెండేళ్ల తర్వాత సూపర్–500 టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరడం విశేషం. సిమ్‌తో 59 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సింధు నిలకడలేమితో ఇబ్బంది పడింది. తొలి గేమ్‌ను అలవోకగా నెగ్గిన సింధు రెండో గేమ్‌లో తడబడింది. రెండుసార్లు వరుసగా ఐదు పాయింట్ల చొప్పున ప్రత్యర్థికి కోల్పోయింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో గాడిలో పడిన సింధు స్కోరు 16–14 వద్ద వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో కిరణ్ జార్జి (భారత్) 13–21, 18–21తో లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మహిళల డబుల్స్‌లో భారత పోరు ముగిసింది. ప్రిక్వార్టర్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 70 నిమిషాల్లో 18–21, 22–20, 14–21తో సుంగ్ షువో యున్–యు చెయున్ హుయ్ (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోగా... రితిక–సిమ్రన్ జంట 17–21, 11–21తో పియర్లీ టాన్–థినా మురళీధరన్ (మలేసియా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జంట 9–21, 15–21తో టాప్ సీడ్ చెన్ టాంగ్ జి–టో ఈ వె (మలేసియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో గరగ కృష్ణప్రసాద్–సాయిప్రతీక్ ద్వయం 11–21, 9–21తో హి జి టింగ్–రెన్ జియాంగ్ యు (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ హాన్ యువె (చైనా)తో సింధు; ఆరో సీడ్ జాంగ్ యి మాన్ (చైనా)తో అష్మిత తలపడతారు.

క్వార్టర్ ఫైనల్లో ఓడిన జ్యోతి సురేఖ



యెచోన్ (దక్షిణ కొరియా): ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్లకు నిరాశ ఎదురైంది. భారత స్టార్స్, ప్రపంచ రెండో ర్యాంకర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ 12వ ర్యాంకర్ పర్ణీత్ కౌర్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరగ్గా... ప్రపంచ చాంపియన్ అదితి రెండో రౌండ్‌లో, అవనీత్ కౌర్ రెండో రౌండ్‌లో నిష్క్రమించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో జ్యోతి సురేఖ 142–145తో ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా) చేతిలో... పర్ణీత్ 138–145తో హాన్ సెంగ్యోన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి చవిచూశారు. అదితి 142–145తో అలెక్సిస్ రూయిజ్ (అమెరికా) చేతిలో, అవనీత్ 143–145తో ఓ యుహూన్ (కొరియా) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్ సెమీఫైనల్లోకి ప్రవేశించగా... ప్రియాంశ్ మూడో రౌండ్‌లో, అభిషేక్ వర్మ, రజత్ చౌహాన్ రెండో రౌండ్‌లో ఓడిపోయారు.

సెమీస్‌లో యూకీ–ఒలివెట్టి జోడీ



పారిస్: ఓపెన్ పార్క్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 7–6 (7/4)తో సాండర్ అరెండ్స్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ, ఒలివెట్టి జోడీ పది ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే సెమీఫైనల్లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–వాసెలిన్ (ఫ్రాన్స్)లతో యూకీ, ఒలివెట్టి తలపడతారు.



ఫ్యాషన్











ముంబై ఫ్యాషన్ డిజైనర్ **వర్ధిక సాంగోయి** డిజైన్ చేసిన అప్‌సైకిల్ డెనిమ్ శారీస్...

డెనిమ్ న్యూ లుక్ డిజైన్

ఫ్యాషన్ ప్రపంచంలో అప్ సైక్లింగ్ మాట ఇప్పుడు బాగా వినిపిస్తోంది. ఉన్నదానిని సృజనాత్మకంగా మార్చడంలో కళాత్మక విలువతో పాటు పర్యావరణ స్పృహ కూడా ఉంటుంది. ఎప్పుడూ కొత్తవాటి కోసం పరుగులు తీయకుండా ఉన్నవాటిని కొత్తగా, ఫ్యాషనబుల్‌గా ఎలా ప్రిపేర్ చేసుకోవాలో తెలియజెప్పడానికి డిజైనర్లు పోటీ పడుతుంటారు. దీంట్లో భాగంగా డెనిమ్ అప్ సైక్లింగ్ ఎప్పుడూ బెస్ట్ ఛాయిస్‌గా ఉంటుంది.

మనకున్న రకరకాల డిజైన్ వేర్‌లలో వివిధ రకాల ఫ్యాబ్రిక్‌తో రూపొందించినవి ఉంటాయి. వీటిలో డెనిమ్ జాకెట్స్, స్కర్ట్స్, ప్యాంట్స్ కూడా మోడర్న్ డ్రెస్సుల్లో భాగంగా చేరుతుంటాయి. జీన్స్ ప్యాంటులకు ఉపయోగించే నీలం రంగు గట్టి ఫ్యాబ్రిక్‌ను డెనిమ్ అంటారు. డెనిమ్ డ్రెస్సులైతే సంవత్సరాలుగా ఉపయోగించేవీ ఉంటాయి. కొన్నింటిని తీసిపడేయలేం, అలాగని వార్డ్ రోబ్స్‌లోనూ ఏళ్ల తరబడి ఉంచేయలేం. ఈ పరిస్థితులలో వాటికో కొత్త రూపు ఇవ్వడం చాలా మేలైన కళ. టాప్స్, కుర్తీస్, శారీస్.. ఇలా అనుకూలతను బట్టి అందమైన డిజైనర్ వేర్‌ని రూపొందించవచ్చు. లేదంటే విడిగా కొత్త ఫ్యాబ్రిక్‌తో సరికొత్త డిజైన్‌నీ క్రియేట్ చేయవచ్చు.

అప్ సైకిల్ డెనిమ్ శారీ

వర్ధిక సాంగోయి ముంబై ఫ్యాషన్ డిజైనర్. డెనిమ్‌తో ఎన్నో అప్‌సైకిల్ డిజైన్స్ చేసిన డిజైనర్. మోడర్న్ డ్రెస్సులే కాదు శారీస్‌ను కూడా డెనిమ్ టచ్‌తో, ప్యాచ్ వర్క్‌తో వివిధ రకాల మెటీరియల్‌ను ఉపయోగిస్తూ తయారు చేసింది. డెనిమ్ దర్జి పేరుతో స్టూడియో కూడా రన్ చేస్తుంది.



* నెట్ ఫ్యాబ్రిక్, డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన చీర ఇది. చీర బార్డర్ పైన ఘుంగ్రూ వర్క్ డిజైన్ చేశారు.
* పోల్కా డాట్స్ ప్యాచ్ వర్క్‌తో రూపొందించిన శారీ
* లినెన్ శారీకి జియోమెట్రిక్ స్టైల్‌లో కట్ చేసిన డెనిమ్ క్లాతతో ప్యాచ్ వర్క్ చేశారు.
* స్కర్ట్ శారీని డెనిమ్‌ను ఉపయోగిస్తూ చేసిన మ్యాజిక్ స్టైల్ డ్రెస్ ఇది.
* డెనిమ్ క్రాప్‌టాప్
* కాటన్ ఫ్యాబ్రిక్ – డెనిమ్ జాకెట్‌ని ఉపయోగిస్తూ రూపొందించిన కుర్తా
* లేస్‌తో లాంగ్ స్లీవ్స్ రూపొందించిన డెనిమ్ జాకెట్
* డెనిమ్ ప్యాచ్‌వర్క్‌తో మోడర్న్ టాప్
* డెనిమ్ ప్యాంట్ బెల్ స్టైల్‌కి క్రోచెట్ డిజైన్‌ను అదనంగా జత చేస్తే వచ్చే స్టైల్.

వంటిల్లు

టొమాటో కనువిందు

మార్కెట్‌లో టొమాటోలు ఎర్రగా నోరూరిస్తున్నాయి. ఏ కూర వండినా ఒక టొమాటో వేసుకుంటాం. టొమాటోలతోనే కూరలు వండుతాం కూడా. పచ్చళ్లయితే తెలుగు వాళ్ల తర్వాతే ఎవరైనా. ఈసారి కొంచెం వెరైటీగా ప్రయత్నం చేద్దాం. సాస్... కెచప్‌లు మనకు రావా... షాప్‌లో కొనాల్సిందేనా! కొనడం ఎందుకు? మనమే నేర్చుకోవచ్చు కదా! మనింట్లో వంటిల్లు ఉంది... మార్కెట్‌లో టొమాటో ఉంది. సాస్... కెచప్పే కాదు... బాత్... ఆమ్లెట్ కూడా!

టొమాటో కెచప్



కావలసినవి: టొమాటోలు – 2.5 కేజీలు; వెల్లుల్లి రేకలు – 15; అల్లం– 3 అంగుళాల ముక్క; ఎండు మిర్చి – 6; కిస్‌మిస్– అర కప్పు; యాపిల్ సిడెర్ వినెగర్ – అర కప్పు; ఉప్పు – టేబుల్ స్పూన్; చక్కెర – 6 టేబుల్ స్పూన్‌లు; సోడియం బెంజోయేట్ – పావు టీ స్పూన్ (టీ స్పూన్ నీటిలో వేసి కరిగించాలి)

తయారీ: ● టొమాటోలను శుభ్రంగా కడగాలి. ఆరిన తర్వాత తొడిమలు తొలగించాలి. ఇప్పుడు టొమాటోలన్నింటినీ మీడియం సైజు ముక్కలుగా తరగాలి ● వెల్లుల్లి రేకల పొట్టు వలిచి తరగాలి. అల్లం కడిగి చెక్కు తీసి తరగాలి ● కిస్‌మిస్‌లు కడిగి పక్కన పెట్టుకోవాలి ● ఎండు మిర్చి తొడిమలు తీసి, మధ్యకు విరిచి గింజలతను తొలగించాలి. **తయారీ:** ● మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి టొమాటో ముక్కలు, అల్లం, వెల్లుల్లి ముక్కలు, ఎండు మిర్చి, కిస్‌మిస్, వినెగర్, ఉప్పు, చక్కెర వేసి గరిటెతో కలిపి మీడియం మంట మీద ఉడికించాలి. మధ్యలో కలుపుతూ టొమాటో ముక్కలు మెత్తబడే వరకు ఉడికించి పాత్రను దించేయాలి ● వేడి తగ్గిన తరవాత బ్లెండర్‌లో వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పెద్ద చిల్లులున్న స్ట్రెయినర్‌లో వడపోయాలి. టొమాటో తొక్కలు, మెదగని గింజల వంటివి పైన నిలుస్తాయి. వడపోసిన ద్రవాన్ని బాణలిలో పోసి కొంత సేపు మీడియం మంట మీద ఉడికించి దగ్గరవుతున్నప్పుడు సన్నమంట మీద ఉడికించాలి. టొమాటో ద్రవం కెచప్‌కు తగిన చిక్కదనం సంతరించుకోవాలంటే అరగంటకు పైగా ఉడకాలి. అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఉండాలి. దించడానికి ముందు టీ స్పూన్ వేడి నీటిలో పావు టీ స్పూన్ సోడియం బెంజోయేట్ కలిపి కెచప్‌లో పోసి కలిపి స్టవ్ ఆపేయాలి. సోడియం బెంజోయేట్ కెచప్ నిల్వ ఉండడానికి దోహదం చేసే ప్రిజర్వేటివ్. కెచప్‌ను ఫ్రిజ్‌లో పెట్టుకుని వాడుకునే వాళ్లు సోడియం బెంజోయేట్ లేకుండా కూడా సాస్ చేసుకోవచ్చు ● కెచప్ ఉడికేలోపు సాస్ నిల్వ చేయడానికి గాజు బాటిల్‌ని సిద్ధం చేసుకోవాలి. బాటిల్‌ని శుభ్రంగా కడిగిన తర్వాత వేడి నీటిలో ముంచి తీసి ఆరబెట్టాలి ● కెచప్ చల్లారిన తర్వాత సీసాలో వేసి గట్టిగా మూత పెట్టాలి. దీనిని స్నాక్స్‌లోకి తినవచ్చు లేదా భోజనానికి ముందు ఆకలి పెంచడానికి అప్పిటైజర్‌గా కూడా పని చేస్తుంది. నాలుక రుచి కోల్పోయినట్లు అనిపించినప్పుడు ఒక టీ స్పూన్ కెచప్‌ను చప్పరిస్తే రుచిగ్రంథులు ఉత్తేజితమవుతాయి.

పిజ్జా సాస్



కావలసినవి: టొమాటోలు – అరకేజీ; ఆలివ్ ఆయిల్ – పావు కప్పు; వెల్లుల్లి – 10 (సన్నగా తరగాలి); సబ్జా ఆకులు – పావు కప్పు (తరగాలి); ఆరెగానో పొడి– 2 టీ స్పూన్‌లు; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; మిరియాల పొడి – అర టీ స్పూన్.

తయారీ: ● టొమాటోలను శుభ్రంగా కడిగి తరగాలి. ఆ ముక్కలను మిక్సీ జార్‌లో వేసి గుజ్జు చేయాలి ● వెడల్పుగా ఉన్న బాణలి స్టవ్ మీద పెట్టి ఆలివ్ ఆయిల్ వేసి వెంటనే అందులో వెల్లుల్లి వేసి సన్న మంట మగ్గనివ్వాలి. ఆ తర్వాత టొమాటో గుజ్జు వేసి ఐదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడకనివ్వాలి. ఈ లోపు మధ్యలో కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత అందులో సబ్జా ఆకులు, ఆరేగానో, ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి మూత పెట్టి మంట తగ్గించి దాదాపుగా అరగంట సేపు ఉంచాలి. మిశ్రమం దగ్గరయ్యే కొద్దీ నూనె పైకి తేలుతుంది. సాస్ దాదాపు సిద్ధమైనట్లే. ఈ దశలో ఒకసారి రుచి చూసుకుని అవసరమైతే మరింత ఉప్పు, మిరియాల పొడి కలుపుకోవచ్చు. సాస్ చిక్కదనాన్ని కూడా చూసుకుని అవసరమైతే మరో ఐదు నిమిషాల సేపు ఉంచాలి. స్టవ్ మీద నుంచి దించిన తర్వాత కదిలించకుండా పక్కన పెట్టాలి. చల్లారిన తర్వాత జాడీలో పోసుకుని గట్టిగా మూతపెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకుని రెండు నెలలపాటు వాడుకోవచ్చు. పిజ్జా టాపింగ్‌గా ఈ సాస్ చాలా బాగుంటుంది.

టొమాటో బాత్



కావలసినవి: బియ్యం – పావు కేజీ; టొమాటో ముక్కలు – పావు కేజీ; వెల్లుల్లి రేకలు – 5 (తరగాలి); అల్లం – అంగుళం ముక్క (తరగాలి); పచ్చిమిర్చి – 3 (తరగాలి); జీలకర్ర – అర టీ స్పూన్; లవంగాలు –3; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; పచ్చి కొబ్బరి తురుము – పావు కప్పు.

పోపు కోసం: నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; జీలకర్ర – అర టీ స్పూన్ బిర్యానీ ఆకులు– 2; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు ; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి– పావు టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; చక్కెర – పావు టీ స్పూన్; నీరు – అర కప్పు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు. **తయారీ:** ● బియ్యాన్ని కడిగి మునిగేటట్లు నీటిని పోసి అరగంట తర్వాత నీటిని వంపేసి పక్కన పెట్టాలి ● టొమాటో ముక్కలను మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులోనే అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, జీలకర్ర, లవంగాలు, దాల్చిన చెక్క కూడా వేసి గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత కొబ్బరి కూడా వేసి గ్రైండ్ చేయాలి. నీరు వేయాల్సిన అవసరం లేకుండానే మిశ్రమం మెత్తగా మెదుగుతుంది ● మందపాటి పాత్ర పెట్టి సన్న మంట నెయ్యి వేడి చేసి అందులో బిర్యానీ ఆకులు, జీలకర్ర వేయాలి. జీలకర్ర పేలిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి మీడియం మంట మీద వేయించాలి. దోరగా వేగిన తర్వాత అందులో క్యాప్సికమ్ ముక్కలు వేయాలి. రెండు లేదా మూడు నిమిషాల పాటు వేగిన తర్వాత నానబెట్టిన బియ్యాన్ని వేయాలి. అందులో పసుపు, మిరప్పొడి, ఉప్పు, చక్కెర వేసి సున్నితంగా (బియ్యం విరిగిపోకుండా) కలపాలి. ఇప్పుడు కొబ్బరి మసాలా పేస్ట్ వేసి జాగ్రత్తగా కలపాలి. ఆ తర్వాత కప్పు నీటిని పోసి కలిపి మూత పెట్టి ఉడకనివ్వాలి. నీరు ఇంకిపోయేటప్పుడు ఒకసారి అన్నం మెతుకు పట్టుకుని చూసి అవసరమైతే మరికొన్ని వేడి నీటిని పై నుంచి చిలకరించి మూత పెట్టి సన్నమంట మీద ఉడకనివ్వాలి. ఈ దశలోనే రుచి చూసి ఉప్పు తగ్గితే వేడి నీటిలో ఉప్పు కలిపి టొమాటో బాత్ మీద చల్లాలి. తేమ లేకుండా ఉడికిన తర్వాత స్టవ్ ఆపేసి కొత్తిమీర తరుగు, కొబ్బరి తురుము చల్లి మూత పెట్టాలి.

టొమాటో ఆమ్లెట్



కావలసినవి: శనగపిండి – కప్పు; టొమాటో ముక్కలు – కప్పు (2 మీడియం సైజ్ టొమాటోలు); ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు (మీడియం సైజు ఉల్లిపాయ 1); అల్లం – అంగుళం ముక్క (సన్నగా తరగాలి); పచ్చిమిర్చి –1 (సన్నగా తరగాలి); కొత్తిమీర తరుగు – 3 టేబుల్ స్పూన్‌లు; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– పావు టీ స్పూన్; ఇంగువ– చిటికెడు; గరం మసాలా పొడి– చిటికెడు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు– కప్పు లేదా చిక్కదనాన్ని బట్టి; నూనె లేదా నెయ్యి – 2 లేదా 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి, టొమాటో ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర తరుగు, ఉప్పు, పసుపు, మిరప్పొడి, ఇంగువ, గరం మసాలా పొడి వేసి గరిటతో బాగా కలపాలి. అందులో ముప్పావు కప్పు నీటిని పోసి పిండి ఉండలు లేకుండా దోశెలపిండిలా గరిట జారుడుగా వచ్చేటట్లు కలపాలి. చిక్కదనాన్ని బట్టి మరికొంత నీటిని కలుపుకోవచ్చు. ఉప్పు సరి చూసుకుని అవసరమైతే కలుపుకోవాలి ● పెనం వేడి చేసి టీ స్పూన్ నెయ్యి వేసి వేడెక్కుతున్నప్పుడే ఉల్లిపాయ ముక్కతో పెనం అంతటికీ పట్టేలా రుద్దాలి. ఇప్పుడు టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడెక్కిన తర్వాత శనగపిండి మిశ్రమాన్ని రెండు గరిటెలు వేసి సర్దాలి. దోశెలాగ మరీ పలుచగా వేయకూడదు, ఇది ఊతప్పంలాగ మందంగా ఉండాలి. ఆమ్లెట్ కాలుతున్నప్పుడు చుట్టూ అంచులకు మరో టీ స్పూన్ నెయ్యి వేయాలి. మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు ఎర్రగా కాలిన తర్వాత అట్లకాడతో తిరగ వేసి మంట తగ్గించి సన్నమంట మీద కాలనివ్వాలి. రెండు వైపులా కాలిన తర్వాత ప్లేట్‌లోకి తీసుకుని వేడివేడిగా తినాలి ● దీనిని ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా బ్రెడ్‌తో కలిపి తినవచ్చు. బ్రెడ్ లేకుండా ఆమ్లెట్ మాత్రమే తినవచ్చు. రెండు ఆమ్లెట్‌లు తింటే కడుపు నిండుగా బ్రేక్‌ఫాస్ట్ చేసినట్లే ● పిండి మిశ్రమం మరీ పలుచగా అయి ఆమ్లెట్ విరిగిపోతుంటే మరికొంత శనగపిండి కలుపుకోవాలి. మిశ్రమం మరీ చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవాలి.

న్యూస్‌మేకర్

ఎవరెస్ట్ కీ బేటీ

కుమార్తెను ప్రోత్సహించడానికి తండ్రి ఎవరెస్ట్‌లా నిలబడితే ఏ కుమార్తైనా ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి వెనుకాడదు. ముంబైకు చెందిన 16 ఏళ్ల కామ్య తన తండ్రితో కలిసి తొమ్మిదో ఏటనే ఎవరెస్ట్ బేస్ క్యాంప్ తాకగలిగింది. ఇప్పుడు తండ్రిని తోడు చేసుకుని ఎవరెస్ట్‌నే అధిరోహించింది. ఎవరెస్ట్‌ను ఎక్కిన బాలికలలో ఈమెది రెండో చిన్న వయసు. కామ్య సాహసయాత్ర విశేషాలు.

కొన్ని విజయాలు పుట్టుకతోనే నిర్ధారితమవుతాయి. ముంబైలోని నేవీ స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న 16 ఏళ్ల కామ్య కార్తికేయన్ తాజా ఘన విజయం చూస్తే ఆ మాటే అనాలనిపిస్తుంది. ఇంత చిన్న వయసులో 6 ఖండాల్లోని ఎత్తయిన పర్వతాలన్నీ అధిరోహించిందామె. మే 20న ఎవరెస్ట్ అధిరోహణతో నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్ అధిరోహించిన రెండవ చిన్న వయసు మౌంటినీర్‌గా, మన దేశం నుంచైతే మొట్టమొదటి చిన్న వయసు మౌంటనీర్‌గా రికార్డ్ సృష్టించింది. దీని వెనుక కామ్య తండ్రి కార్తికేయన్ ఉన్నాడు. తల్లి లావణ్య ఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా ఊహ తెలిసిన వెంటనే కనిపించిన సహ్యాద్రి పర్వతాలున్నాయి.



ఎవరెస్ట్‌పై తండ్రితో కామ్య

మూడేళ్ల వయసు నుంచే

కావ్య తండ్రి కార్తికేయన్ నేవీలో ఆఫీసర్. అతని పోస్టింగ్ లోనావాలాలో ఉండగా కావ్యాకు మూడేళ్లు. వీకెండ్స్‌లో ఆమె తల్లిదండ్రులిద్దరూ సహ్యాద్రి పర్వతాల్లో విహారానికి కావ్యను తీసుకెళ్లేవారు. ఐదారేళ్లు వచ్చేసరికి సహ్యాద్రిలో ఆమె కాళ్లు పరుగులు తీయడం మొదలుపెట్టాయి. ప్రకృతి కామ్యను ఆకర్షించింది. పర్వతాలు హద్దుల్లేని ప్రయాణం చేయమని స్ఫూర్తినిచ్చాయి. కామ్యలోని చురుకుదనాన్ని చూసి పర్వతారోహణలో ఆమెను ప్రోత్సహించాలని కార్తికేయన్ నిశ్చయించుకున్నాడు.

మొదటి లిట్మస్ టెస్ట్

కామ్యకు 9 ఏళ్ల వయసు ఉండగా కార్తికేయన్ ఆమెను పర్వతారోహణలో నిలదొక్కుకోగలదో లేదో పరీక్షించడానికి లదాఖ్ తీసుకెళ్లాడు. అక్కడి మౌంట్ స్టాక్ కంగ్రీని 6000 అడుగుల ఎత్తు మేర ఆమె అధిరోహించింది. ప్రతికూల వాతావరణంలో ఆ వయసులో ఆమె చేసిన అధిరోహణ కార్తికేయన్‌కు నమ్మకమిచ్చింది. దాంతో తన కూతురు చిన్న వయసులోనే అన్ని ఖండాల్లోని పర్వతాలు అధిరోహించాలని అతడు ప్రోత్సహించాడు. కామ్య ఆ సవాలును స్వీకరించింది. అలా మొదలైంది వారి 'సాహస్' యాత్ర.

7 ఖండాల సాహస్

కామ్య ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తయిన శిఖరాలన్నీ అధిరోహించాలని నిశ్చయించుకుంది. ఆ యాత్రకు 'సాహస్' అని పేరు పెట్టుకుంది. 'అయితే అది అంత సులువైన పని కాదు. మానసికంగా శారీరకంగా వైద్యానికి స్పందించే విధంగా మన శరీరం మనసు ఉండాలి. అందుకని నేను రోజుకు ఆరు గంటలు సైక్లింగ్, రన్నింగ్ చేసేదాన్ని' అని తెలిపింది కామ్య. తన సాహస యాత్ర మొదలెట్టే ముందు ప్రఖ్యాత పర్వతారోహకుడు ఎం.ఎస్. కోలిని కలిస్తే 'పర్వతాలు ఎన్నో కథలను నీకు ఇస్తాయి. అవి జీవితాంతం గొప్పగా నీతో మిగులుతాయి. గో అహేడ్' అని ఆశీర్వదించాడు. కామ్య ఆగలేదు. తండ్రితో పాటు 2017లో కిలిమంజారో (ఆఫ్రికా), ఆ తర్వాతి సంవత్సరం మౌంట్ ఎల్‌బ్రుస్ (యూరప్), ఆ తర్వాత మౌంట్ కోసియుస్కో (ఆస్ట్రేలియా), మౌంట్ అకొంకగువా (సౌత్ అమెరికా), మౌంట్ డెనాలి (నార్త్ అమెరికా) అధిరోహించింది. మే 20న మౌంట్ ఎవరెస్ట్ (ఆసియా) అధిరోహించడంతో అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ మాసిఫ్ ఒక్కటే చేరడం మిగిలింది.

ఎవరెస్ట్ అధిరోహణ

మే 20న ఎవరెస్ట్ శిఖరాగ్రం చేరడానికి ఏప్రిల్ 6 నుంచి కామ్య, ఆమె తండ్రి కార్తికేయన్ ప్రయాణం మొదలైంది. అధిరోహించేది ఎవరెస్ట్ కనుక ట్రైనింగ్, షాపింగ్, ప్యాకింగ్, ట్రావెల్ పకడ్బందీగా ప్లాన్ చేసుకున్నారు. మొదట ఖట్మాండు చేరుకుని అక్కడి నుంచి విమానం ద్వారా లుక్లా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఎవరెస్ట్ అధిరోహణకు ఇది మొదటి మజిలీ. అక్కడి నుంచి ఆరోహణ ప్రారంభించి ఫాక్‌డింగ్ (2610 మీటర్లు) నుంచి నామ్‌చే బజార్ (3440 మీటర్లు) చేరుకున్నారు. అక్కడ విరామం తీసుకున్నాక టింగ్‌బోచె (3860 మీటర్లు)కు ట్రెక్ సాగింది. ఆ తర్వాత లొబొచె (4940 మీటర్లు) చేరుకుని ఆ తర్వాత ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఆక్సిజన్ పరికరాలు ఉపయోగిస్తూ పర్వతారోహణ ఎలా చేయాలో, పైకి కొనసాగే సమయంలో సేఫ్టీ పరికరాలు ఎలా ఉపయోగించాలో ట్రయినింగ్ తీసుకున్నారు. శిఖరాగ్రం చేరుకోవడానికి వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మే 15 వరకూ బేస్ క్యాంప్‌లోనే ఉండాల్సి వచ్చింది. మే 15న బయలుదేరి మే 20 మధ్యాహ్నం 12 గంటల 50 నిమిషాలకు కామ్య ఎవరెస్ట్ శిఖరానికి చేరుకుంది. 8, 849 మీటర్ల ఎత్తు ఉన్న ఎవరెస్ట్ శిఖరంపైన తన తండ్రితో పాటు నిలబడి కామ్య తన విజయాన్ని ఆస్వాదించింది. సంకల్పం ఉంటే సాధించలేనిది లేదని నిరూపించింది.

యువర్స్

● యంగ్ టాలెంట్

అరుదైన ప్రతిభ....అక్షత



చిన్న వయసు లోనే కృత్రిమ మేధా(ఏఐ) రంగంలో పెద్ద పేరు తెచ్చుకుంది అక్షతా కిశోర్ మొహరిర్. అభిరుచితో మొదలైన ప్రయాణం... అధ్యయనం, పట్టుదలతో మెషిన్ లెర్నింగ్ రంగంలో అక్షతను అగ్రగామిగా నిలిపింది. కర్నాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్శిటీ(వీటీయు-బెళగావీ)లో కంప్యూటర్ సైన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసింది. ఆ తరువాత డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్‌లకు సంబంధించిన ఆసక్తి మరింత పెరిగింది. యూనివర్శిటీ ఆఫ్ మేరీల్యాండ్ కాలేజ్ పార్క్(యూఎంసీపీ)లో మెషిన్ లెర్నింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఇంటర్‌ప్రెటబుల్ అండ్ ఇంటరాక్టివ్ మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అక్షతకు ఏడు యూఎస్ పేటెంట్లు లభించాయి. యూజర్ ఫ్రెండ్లీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్‌లను రూపొందించడంపై అక్షత దృష్టి పెట్టింది.

● సక్సెస్ స్టోరీ



● ప్రఫుల్

పవర్‌ఫుల్ ప్రఫుల్

'కవిత్వం ఒక తీరని దాహం' అనేది ప్రసిద్ధమైన మాట. ప్రఫుల్ ధరివాల్‌కు కవిత్వం పెద్దగా పరిచయం లేకపోవచ్చు.

అయితే భౌతిక, గణిత శాస్త్రాలు అంటే చెప్పలేనంత ఇష్టం.

ఆ ఇష్టం భౌతిక, గణిత శాస్త్రాలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడంలో అంతులేని దాహం అయింది.

'ఈరోజు ఒక కొత్త విషయం తెలుసుకున్నాను. నెక్స్ట్ ఏమిటి' అనే అతడి సూపర్ స్పీడ్ ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలు తెలుసుకునేలా, తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడింది.

అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ 'ఓపెన్‌ఏఐ' గుర్తించే స్థాయికి చేరుకుంది.

'ఓపెన్ ఏఐకి గర్వకారణం' అని చెప్పుకునేలా చేసింది.

'నేర్చుకున్నది ఎప్పుడూ వృథా పోదు. అది విజయానికి గట్టి పునాది' అనే మాట పుణెకి చెందిన ప్రఫుల్ ధరివాల్ విషయంలో మరోసారి నిజమైంది....

ఓపెన్‌ఏఐ సీయివో సామ్ ఆల్ట్‌మాన్ ప్రఫుల్ ధరివాల్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. ధరివాల్ లేకుండా 'జీపిటీ 4వో' సాధ్యమయ్యేది కాదని ట్వీట్ చేశాడు.

చిన్నప్పటి నుంచే సైన్స్, గణితంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తూ వస్తున్నాడు ప్రఫుల్. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నేషనల్ టాలెంట్ రిసెర్చ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. చైనాలో జరిగిన అంతర్జాతీయ ఖగోళ ఒలింపియాడ్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లోనూ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

ప్రఫుల్ అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా మహారాష్ట్ర స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ అండ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు సంబంధించి అబాసాహెబ్ నరవానే మెమోరియల్ ప్రైజ్‌కు ఎంపికయ్యాడు.

ప్రతిష్ఠాత్మకమైన మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో కంప్యూటర్ సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేశాడు. 2016లో 'ఓపెన్‌ఏఐ'లో రిసెర్చ్ ఇంటర్న్‌గా చేరాడు. జీపీటి-3, డాల్-ఇ 2, జ్యూక్‌బాక్స్, గ్లోతో సహా ఎన్నో సంచలనాత్మక ఏఐ మోడల్స్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాడు.

ఓపెన్ ఏఐకి ముందు క్వాంటిటేటివ్ అనలిస్ట్ ఇంటర్న్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఇంటర్న్‌గా, సెంటర్ ఫర్ బ్రెయిన్, మైండ్ అండ్ మెషిన్స్‌లో అండర్ గ్రాడ్యుయేట్ రిసెర్చర్‌గా పనిచేశాడు.

తాజా విషయానికి వస్తే....

ఓపెన్‌ఏఐ సీయివో సామ్ ఆల్ట్‌మాన్ ట్వీట్‌తో సోషల్ మీడియా దృష్టిని ఆకర్షించాడు ప్రఫుల్.

ప్రఫుల్ కీలక పాత్ర పోషించిన మల్టీలింగ్వల్, మల్టీమోడల్ జెనరేటివ్ ప్రీ-ట్రెన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ 'జీపీటి-4వో' గురించి...'అందరి కృషి వల్లే జీపీటి-4వో లాంచ్ సాధ్యమైంది' అంటాడు ప్రఫుల్.

'ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా అద్భుతమైన వ్యక్తులతో కలిసిపనిచేసే అవకాశం దొరికింది' అంటాడు వినమ్రంగా.

ఇంతకీ ప్రఫుల్ సక్సెస్ మంత్రా ఏమిటి? సామ్ ఆల్ట్‌మాన్ మాటల్లో చెప్పాలంటే... విటిసిడి.

వి... విజన్
టి... టాలెంట్
సి... కన్విక్షన్
డి... డిటర్మినేషన్.

● టెక్.. టాక్

హువావే మేట్ బుక్ 14



సైజ్: 14.2 అంగుళాలు
రిజల్యూషన్: 2880x1920 పిక్సెల్స్
బరువు: 1.31 కేజీ మెమోరీ: 16జీబి
స్టోరేజ్: 512 జీబి/1టీబి
● బ్యాటరీ లైఫ్: 19 గంటలు
● ఏఐ ఫీచర్స్ ● ఇన్‌టెల్ కోర్ అల్ట్రా చిప్

అల్ట్రా హ్యూమన్ రింగ్ ఏయిర్



థిక్: 2.5 ఎంఎం
వైడ్: 8.1 ఎంఎం బరువు: 3 గ్రా.
కలర్ ఆప్షన్: టైటానియం
పీపీజీ ఆప్టికల్ సెన్సర్: హార్ట్ రేట్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ సాచ్యురేషన్
● వాటర్ రెసిస్టెంట్ ● సపోర్ట్స్: 22 వర్కవుట్ మోడ్స్

హెచ్‌ఎండీ టీ21 ట్యాబ్




సైజ్: 10.36 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1200x2000 పిక్సెల్స్
కలర్: బ్లాక్ స్టీల్
ఇంటర్నల్: 64జీబి 4జీబి ర్యామ్/128జీబి 4జీబి ర్యామ్
బ్యాటరీ: 8200 ఎంఏహెచ్
● స్కాచ్ రెసిస్టెంట్ గ్లాస్

గూగుల్ కొత్త ఏఐ వీడియో అండ్ ఇమేజ్ జనరేటర్స్



కొత్త ఏఐ వీడియో అండ్ ఇమేజ్ జనరేటర్స్ వియో, ఇమాజెన్ 3లను గూగుల్ లాంచ్ చేసింది. టెక్స్ట్ ప్రాంప్ట్‌ల నుంచి వీడియోలను జనరేట్ చేయడానికి వియో ఉపయోగపడుతుంది. ఇమాజెన్ 3 అనేది గూగుల్‌కు సంబంధించి అత్యంత అధునాతన 'టెక్స్ట్-టు-ఇమేజ్' మోడల్. 'ఇమాజెన్ 3 అనేది టెక్స్ట్-టు-ఇమేజ్ హైక్వాలిటీ మోడల్. ఫొటోరియలిస్టిక్, లైఫ్‌లైక్ ఇమేజ్‌లను సృష్టించే సామర్థ్యం దీని సొంతం' అంటుంది గూగుల్. మోస్ట్ అడ్వాన్స్‌డ్ వీడియో మోడల్‌గా గూగుల్ చెబుతున్న 'వియో' వెరైటీ స్టైల్స్‌లో హై-క్వాలిటీ 1080పి వీడియోలను ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ ఏఐ మోడల్ 'టైమ్‌ల్యాప్స్' 'ఏరియల్ షార్ట్స్' లాంటి సినిమాటిక్ కాన్సెప్ట్‌లను కూడా అర్థం చేసుకుంటుంది. వీడియో క్రియేటర్‌లకు ఇది గేమ్-చేంజర్ అవుతుందని ప్రకటించింది గూగుల్.



ఇన్ లింబో
అస్థిరమైన పరిస్థితి, ఎటూ తేల్చుకోలేని అయోమయం, త్రిశంకు స్వర్గం లాంటి పరిస్థితిని సూచించే మాట...ఇన్ లింబో. **ఉదా:** అవర్ ప్లాన్స్ ఫర్ ది ఫ్యూచర్ వర్ లెఫ్ట్ ఇన్ లింబో డ్యూ టు ది పాండమిక్

ఇన్ పింక్
ఆరోగ్య విషయాల నుంచి ఆర్థిక విధానాలకు వరకు 'బాగుంది' అనే ఆశాజనకమైన పరిస్థితిని సూచించే మాట... ఇన్ పింక్.
ఉదా: కన్‌సైడరింగ్ హిజ్ ఏజ్, హి ఇజ్ ఇన్ ది పింక్ ఆఫ్ హెల్త్.

● గేమింగ్

రక్షకుడు వచ్చాడు



యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'ఘోస్ట్ ఆఫ్ సుషిమ' విడుదల అయింది. థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే గేమ్ ఇది. సుషిమ ద్వీపాన్ని రక్షించడానికి రంగంలోకి దిగిన 'సకాయ్' అనే సమురాయ్‌ని ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఆకీరా కురోసావా సినిమాలు, కామిక్ బుక్ సిరీస్ 'ఉసాగి యోజింబో' ప్రేరణతో ఈ గేమ్‌ను రూపొందించారు. గేమ్ ల్యాండ్‌స్కేప్, మినిమలిస్టిక్ ఆర్ట్ స్టైల్‌ను యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'షాడో ఆఫ్ ది కొలోసస్' ప్రభావంతో చేశారు. గేమ్‌లోని లొకేషన్‌లు 'పర్‌ఫెక్ట్ ఫొటోగ్రాఫర్స్ డ్రీమ్స్' అనిపించేలా అందంగా ఉంటాయి. ఇలన్ ఎస్కేరి, షిగేర్ ఉమేలయాషి ఈ గేమ్ సౌండ్ ట్రాక్‌ను అద్భుతంగా కంపోజ్ చేశారు. 'చారిత్రకంగా, సాంస్కృతికంగా ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాం' అని మేకర్స్ చెబుతున్నారు. **జానర్:** యాక్షన్-అడ్వెంచర్ **మోడ్స్:** సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్ **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, విండోస్.

ఇన్‌స్టాగ్రామ్ 'పీక్' ఫీచర్



'పీక్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది ఫొటో షేరింగ్ యాప్ ఇన్‌స్టాగ్రామ్. ఈ ఫీచర్ ద్వారా ఒక వ్యూ తరువాత మాయం అయ్యే ఎడిట్ చేయని, అన్‌ఫిల్టర్, ఇన్-ది-మూమెంట్ ఫొటోలను యూజర్‌లు స్పీడ్‌గా క్యాప్చర్, షేర్ చేయవచ్చు. స్నాప్‌చాట్, బీరియల్‌ను స్ఫూర్తిగా తీసుకొని 'పీక్'పై దృష్టి పెట్టింది ఇన్‌స్టా. ఫొటోలు, వీడియోలను 24 గంటల పాటు చూడడానికి అనుమతించే ఇన్‌స్టాగ్రామ్‌లోని ప్రస్తుత 'స్టోరీస్' ఫీచర్‌లా కాకుండా 'పీక్' ఫొటోలు సింగిల్ వ్యూలో అదృశ్యం అవుతాయి, 'లిటిల్ మూమెంట్స్ విత్ ది పీపుల్ యూ లవ్' అని 'పీక్' గురించి చెప్పింది ఇన్‌స్టాగ్రామ్.

సినిమా


● చిరంజీవి

మళ్లీ షురూ

కొంత గ్యాప్ తర్వాత మళ్లీ 'విశ్వంభర' సెట్స్‌కు వెళ్లారు చిరంజీవి. ఆయన హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాలోని ఇంట్రవెల్ యాక్షన్ సీక్వెన్స్‌ని హైదరాబాద్‌లో చిత్రీకరించారు. ఈ భారీ షెడ్యూల్ తర్వాత చిరంజీవి ఈ సినిమా చిత్రీకరణ నుంచి చిన్న విరామం తీసుకున్నారు. కాగా మళ్లీ హైదరాబాద్‌లోనే ఈ సినిమా తాజా షెడ్యూల్ షురూ అయింది. చిరంజీవి పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట దర్శకుడు వశిష్ఠ. ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 10న విడుదల కానుంది.



ఆగస్టులో క్రైమ్ కామెడీ స్టార్ట్


● వెంకటేశ్

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తారు. ఓ మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, ఆ పోలీసాఫీసర్ మాజీ ప్రేయసి... ప్రధానంగా ఈ మూడు పాత్రల నేపథ్యంలో సాగే క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేస్తామని అల్రెడీ యూనిట్ ప్రకటించింది. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జూలై చివర్లో లేదా ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారట. ప్రస్తుతం 'రానా నాయుడు' వెబ్ సిరీస్ సెకండ్ సీజన్ షూటింగ్‌తో వెంకటేశ్ బిజీగా ఉన్నారని సమాచారం. ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయ్యాక అనిల్ రావిపూడి డైరెక్షన్‌లోని సినిమా సెట్స్‌లోకి వెంకటేశ్ ఎంట్రీ ఇస్తారని ఊహించవచ్చు.

ఎన్టీఆర్‌కు జోడీగా...

హీరో ఎన్టీఆర్, హీరోయిన్ రష్మికా మందన్నా జంటగా నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'కేజీఎఫ్, సలార్' సినిమాలను తీసిన దర్శకుడు ప్రశాంత్ నీల్ తర్వాతి చిత్రంలో ఎన్టీఆర్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఆగస్టులో ప్రారంభం కానుంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు రష్మికా మందన్నాను సంప్రదించారట దర్శకుడు ప్రశాంత్ అండ్ టీమ్. ఈ చిత్రానికి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్.

ఆశిష్ ముందున్న పెద్ద చాలెంజ్ అదే! - 'దిల్' రాజు


● భీమవరపు అరుణ్, కీరవాణి, 'దిల్' రాజు, ఆశిష్, వైష్ణవీ చైతన్య, హన్షిత, శిరీష్

''ఇప్పుడు ప్రేక్షకులను సంతృప్తిపరచడం అంత సులభమైన విషయం కాదు. ప్రేక్షకులను గెలవడమే ప్రస్తుతం ఆశిష్ ముందున్న పెద్ద చాలెంజ్'' అని అన్నారు 'దిల్' రాజు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించిన చిత్రం 'లవ్ మీ'. భీమవరపు అరుణ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం రేపు (శనివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''ఆశిష్ వందకు వంద శాతం ప్రామిసింగ్ పర్సనాలిటీ. ఇది తనకు బిగినింగ్ మాత్రమే. కొత్తవాళ్ళతో సినిమా చేసే ధైర్యం 'దిల్' రాజు అండ్ కోకి మాత్రమే సాధ్యం. 'లవ్ మీ' టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌ను ఆరంభించినప్పుడు ఏదైనా కొత్తగా చేయాలని 'బలగం' సినిమా చేశాం. ఇప్పుడు వస్తున్న 'లవ్ మీ' కూడా కొత్త తరహా చిత్రమే. దర్శకుడు అరుణ్ ఈ సినిమా డ్రైవ్ చేసిన విధానం సూపర్. కీరవాణిగారి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అద్భుతం. మా బ్యానర్ నుంచి భవిష్యత్‌లో హరి, శ్యాండి, శశి, రవికిరణ్‌లతో సహా మరో ఇద్దరు కొత్త దర్శకులను పరిచయం చేయనున్నాం'' అన్నారు 'దిల్' రాజు. ''లవ్ మీ' ఓ డిఫరెంట్ మూవీ'' అన్నారు ఆశిష్. ''లవ్ మీ'తో నాన్ లీనియర్ నరేషన్‌కు దర్శకుడు అరుణ్ ఓ కొత్త నిర్వచనాన్ని ఇచ్చాడనిపించింది'' అన్నారు కీరవాణి. ''లవ్ మీ: ఇఫ్ యు డేర్'కి సీక్వెల్‌గా 'కిల్ మీ: ఇఫ్ యు లవ్' ఉంటుంది'' అన్నారు అరుణ్.

ఊ అన్నావా భామా..!


● త్రిప్తి దిమ్రి

'పుష్ప: ది రైజ్' చిత్రంలో స్పెషల్ సాంగ్ 'ఊ అంటావా మావ....' ఎంత పాపులర్ అయిందో తెలిసిందే. ఈ ప్రత్యేక పాటలో అల్లు అర్జున్‌తో కలిసి హాట్ హాట్ స్టెప్పులేశారు సమంత. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'పుష్ప: ది రూల్'లో కూడా ఇలాంటి ఓ ప్రత్యేక పాట ఉందని సమాచారం. ఈ పాటకు అల్లు అర్జున్‌తో కలిసి బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి కాలు కదపనున్నారని సమాచారం. రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్'లో చేసిన ఓ పాత్రతో త్రిప్తి బాగా పాపులర్ అయ్యారు. ఈ చిత్రం తర్వాత త్రిప్తీకి హిందీలో అవకాశాలు పెరిగాయి. ఇప్పుడు 'పుష్ప: ది రూల్' పాటకు ఆమెను తీసుకున్నారనే వార్త ప్రచారంలోకి రావడంతో 'ఊ అన్నావా భామా...!' అని అభిమానులు సరదాగా అంటున్నారు. మరి.. ప్రచారంలో ఉన్నట్లు ఈ పాటతో త్రిప్తి తెలుగుకి పరిచయం అవుతారా? వేచి చూడాల్సిందే.

29న అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే...

'పుష్ప: ది రూల్' సినిమా నుంచి ఈ నెల 1న 'పుష్ప..పుష్ప' అంటూ సాగే పాట విడుదలైన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమా నుంచి 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అంటూ సాగే మరో పాట లిరికల్ వీడియోను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో కూడా ఈ పాట విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరకర్త. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానుంది.

ఆస్కార్ లైబ్రరీలో పార్కింగ్




తమిళ చిత్రం 'పార్కింగ్'కు అరుదైన గౌరవం లభించింది. ఆస్కార్ లైబ్రరీలో 'పార్కింగ్' సినిమా స్క్రీన్‌ప్లేకు చోటు దక్కింది. హరీష్ కల్యాణ్, ఎమ్ఎస్ భాస్కర్, ఇందుజా రవిచంద్రన్ లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'పార్కింగ్'. రామ్‌కుమార్ బాలకృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, సుధన్ సుందరం-కేఎస్ సినీష్ నిర్మించిన ఈ చిత్రం 2023 డిసెంబరు 1న విడుదలై, మంచి విజయం సాధించింది. ప్రేక్షకులతో పాటు విమర్శకుల మెప్పు కూడా పొందింది. తాజాగా 'పార్కింగ్' సినిమా స్క్రీన్‌ప్లేకు ఆస్కార్ లైబ్రరీలో శాశ్వతంగా చోటు కల్పిస్తున్నామని ఆస్కార్ మేనేజింగ్ లైబ్రేరియన్ ఫిలిఫ్ గార్సియా నుంచి ఇ-మెయిల్ వచ్చిందని చిత్రనిర్మాత కేఎస్ సినీష్ సోషల్ మీడియాలో పేర్కొని, ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే... ఒకే ఇంట్లో అద్దెకు ఉండే ఐటీ ఉద్యోగి ఈశ్వర్, ప్రభుత్వోద్యోగి ఎస్. ఇళంపరుతి పార్కింగ్ విషయంలో ఈగోలకు పోయి ఒకరికి ఒకరు ఎలా హాని చేసుకున్నారు? ఆ తర్వాత తమ తప్పులను ఎలా తెలుసుకున్నారు? అనే అంశాల నేపథ్యంతో 'పార్కింగ్' కథ సాగుతుంది. రూ. 3 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా రూ. 15 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లుగా కోలీవుడ్ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ తమిళ 'పార్కింగ్' సినిమాను తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషలతో పాటు ఓ విదేశీ భాషలోనూ రీమేక్ చేయడానికి చిత్ర దర్శక-నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారని కోలీవుడ్ సమాచారం.

నవ్వుతూ ఉండటం ఓ సవాల్ - గెటప్ శ్రీను



''టీవీ రంగం నాకు మంచి పేరు తెచ్చి, ఆర్థిక స్థిరత్వాన్ని ఇచ్చింది. కానీ టీవీ షోలకు ఎక్కువగా టైమ్ కేటాయించడం వల్ల సినిమాల్లో మంచి పాత్రలను మిస్సవుతున్నాను. అందుకే ఇప్పుడు సినిమాలపై దృష్టి పెట్టాను'' అని 'గెటప్' శ్రీను అన్నారు. 'గెటప్' శ్రీను సోలో హీరోగా నటించిన తొలి చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వంలో కె. ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి నిర్మించిన ఈ చిత్రాన్ని నేడు నిర్మాత బన్నీ వాసు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విలేకర్లతో గెటప్ శ్రీను మాట్లాడుతూ– ''రాజు యాదవ్' ఫన్ అండ్ ఎమోషనల్ రైడ్. తల్లిదండ్రులు తమ కొడుకు నుంచి ఏం కోరుకుంటారు? తన తల్లిదండ్రులు ఎలా ఉండాలని ఓ కొడుకు ఆశపడుతుంటాడు? తల్లిదండ్రుల కలని సాకారం చేయడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎందుకు వెనకడుగు వేయకూడదు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఇది నిజమైన కథ. కానీ ఇందులో నా పాత్రను మలిచిన విధానం కల్పితం. ఎప్పుడూ నవ్వుతూ ఉండే పాత్ర చేయడం ఈజీ కాదు. కొన్ని సన్నివేశాల చిత్రీకరణ సమయంలో సవాల్‌గా అనిపించింది. ఇక రామ్ ప్రసాద్ ఓ కథ రాస్తున్నాడు. సుధీర్, రామ్ ప్రసాద్, నా కాంబినేషన్‌లో ఓ సినిమా చేసే ఆలోచన ఉంది'' అన్నారు.


సామాన్య మానవుని తళుకుబెళుకు లేని ఉత్సాహం, జీవితపు సవాళ్ళను ఎదుర్కొని ముందుకు సాగేలా చేస్తుంది. జీవితంలో ముందుకు కదలడం వారు గడుపుతున్న జీవన విధానానికి ప్రతీక.
వారి ఈతి బాధలు అంతర్గతంగా ఉన్న పట్టుదలను వెల్లడిస్తుంది, పరిస్థితులతో రాజీపడకుండా నిరాకరించడం, వారి మనసులో ఉన్న ఆశావాదంతో పురోగమించాలనే నిరంతర దృఢ సంకల్పం.
వారు ప్రేమ్మించే వారి మెరుగైన భవిష్యత్తు కొరకు వారి 'చేతులెత్తేయవద్దు అనే దృఢవిశ్వాసం' వారిని ముందుకు నడిపిస్తుంది.
నిర్ధారణతో వేసే ప్రతి అడుగు మెరుగైన దానికి మరింత దగ్గరవుతుందనే దానికి ఒక జ్ఞాపికలాగా పనిచేస్తుంది.
'పట్టుదల, ముందుకు సాగాలనే నిశ్చయపు స్ఫూర్తి.',
పారాగాన్‌కు ప్రేరణ కలిగిస్తుంది. ఈ వ్యక్తులకు వారి గమనంలో నిరంతరం నడుస్తూ ఉండేలా చేయడానికి, అది ఎంత కఠినంగా ఉన్నా సరే, వీరికి మద్దతును అందజేసేలా సౌకర్యాన్ని వారికి కల్పించడం ఎంతో గర్వ మైన కార్యమని మేము భావిస్తాము.
Paragon®
పట్టుదల, ముందుకు సాగాలనే దానికి.
Turmeriq-Paragon-Tel-102
Shop now
www.paragonfootwear.com
ప్రత్యేకమైన పారగాన్ స్టోర్స్ మరియు ప్రముఖ మల్టీ-బ్రాండ్ ఫుట్‌వేర్ దుకాణాలలో ఉపలభ్యం.
Follow us on /paragonfootwear
Model No. 6621
Model No. 6804
Model No. 6868
Model No. 7263
Model No. 9549

క్లుప్తంగా...

యాదాద్రిలో ఆర్జిత సేవలు పునఃప్రారంభం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శ్రీనృసింహ జయంతి ఉత్సవాలు జరిగిన నేపథ్యంలో ఆలయంలో భక్తులతో జరిపించే ఆర్జిత సేవలను ఆలయాధికారులు రద్దు చేశారు. జయంతి ఉత్సవాలు ముగిసిన తరువాత గురువారం ఉదయం శ్రీ సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను అర్చకులు ప్రారంభించారు. మూడ్రోజుల తరువాత పునఃప్రారంభమైన ఆర్జిత సేవల్లో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఇక ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి.

ఆలయంలో ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్ (పీవోఎస్) ఏర్పాటు చేసినట్లు ఈవో భాస్కర్‌రావు బుధవారం తెలిపారు. భక్తులు వెబ్ పోర్టల్ yadadritemple.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దర్శనం, పూజ కైంకర్యాల టికెట్లను బుక్ చేసుకోవచ్చునని వెల్లడించారు. గంట ముందు సైతం కరెంట్ బుకింగ్ దర్శనం, పూజ కైంకర్యాల బుకింగ్‌కు అవకాశం కల్పించామని వెల్లడించారు.

లక్ష్యసాధన కోసం విదేశీ సాంకేతిక పరిజ్ఞానం

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం



డెనిస్ ఈటన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని: రాబోయే రోజుల్లో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధన కోసం విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకోనున్నట్లు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. గురువారం ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటన్‌తో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో భేటీ అయ్యారు. సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో నిర్దేశించుకున్న వంద మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో సహకారం అందించే విషయంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం.. ప్రస్తుతం సింగరేణిలో ఉపయోగిస్తున్న సాంకేతికత, ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, సంస్థ వృద్ధి రేటును ఈటెన్ వివరించారు. గతంలో ఆస్ట్రేలియాకి చెందిన సింటార్స్ తదితర సంస్థలతో మైనింగ్, రక్షణ, సాంకేతిక విషయాల్లో సేవలు స్వీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా, సింగరేణిలో అమలవుతున్న సాంకేతికతను, సంస్థ చేపడుతున్న వ్యాపార విస్తరణ చర్యలను చూసేందుకు నవంబర్‌లో ఆస్ట్రేలియా బృందం పర్యటించనుందని ఈటెన్ తెలిపారు. ఈ భేటీలో సింగరేణి బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ కూడా పాల్గొన్నారు.

పురపాలికల్లో కీలక బాధ్యతల్లో ఔట్ సోర్సింగ్ సేవలు ఉపసంహరణ

సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ మినహా రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో రెవెన్యూ వసూళ్లు, చెల్లింపులు వంటి కీలక బాధ్యతల్లో ఔట్ సోర్సింగ్ సేవలను ప్రభుత్వం ఉపసంహరించింది. ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. పన్ను వసూళ్లు, చెల్లింపులు. క్యాష్ కౌంటర్లు, హ్యాండ్ హోల్డ్ మిషన్ల ద్వారా సంస్థకు వచ్చే ఆదాయాలను సేకరించడం వంటి సేవల్లో ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఉపసంహరించుకోవాలని ఆదేశించారు. ఈ బాధ్యతలను పురపాలక సంస్థల్లోని వార్డు ఆఫీసర్లు, ఇతర రెగ్యులర్ రెవెన్యూ ఉద్యోగులకు అప్పగించాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేశారు. మునిసిపాలిటీలు, కమిషనరేట్లలో కీలకమైన ఆస్తి పన్ను వసూళ్లు, క్యాష్ కౌంటర్లలో పన్ను ఆదాయం సేకరణ, బ్యాంకుల్లో చెల్లింపులు వంటి ప్రక్రియలను ఇప్పటి వరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే నిర్వహిస్తుండగా, అందులో అక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

టీజీఎస్ ఆర్టీసీ ఫేక్ లోగో రూపొందించిన వారిపై కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: టీజీఎస్ ఆర్టీసీ పేరుతో ఫేక్ లోగోను రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నవారిపై గురువారం కేసు నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా రూపొందించిన ఫేక్ లోగోపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో కొణతం దిలీప్, హరీశ్‌రెడ్డి అనే వ్యక్తులపై ఐపీసీ 469, 504, 505(1)(బీ)(సీ)తో పాటు ఐటీ యాక్ట్‌లోని 67 కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



జలగర్భం నుంచి బయటకు..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శ్రీరాంసాగర్ జలాశయం బ్యాక్‌వాటర్ ప్రాంతంలోని మెండోరా, దొంకేశ్వర్ మండలాల సరిహద్దుల్లో ప్రాచీన కుస్తాపురం శ్రీరామలింగేశ్వరాలయం సగంవరకు బయటపడింది. ప్రస్తుతం జలాశయంలో 10 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. 2015లో 4 టీఎంసీలకు, 2019లో 6 టీఎంసీలకు నీటిమట్టం పడిపోయినప్పుడు ఈ ఆలయం పూర్తిగా బయటపడింది. నెల రోజుల కిందట ఆలయ శిఖరం బయటపడగా ప్రస్తుతం సగం వరకు తేలింది. ఆలయ ముఖద్వారం, మండపం కనిపిస్తున్నాయి. మత్స్యకారులు ఇక్కడకు వచ్చి కొబ్బరికాయలు కొట్టి, సున్నం వేసి పూజలు నిర్వహించారు. వర్షాలు ఆలస్యం అయి, ఎగువ నుంచి నీరు రాకపోతే నీటిమట్టం మరింత తగ్గి ఆలయం పూర్తిగా బయటపడే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. శ్రీ రామలింగేశ్వరాలయంతో పాటు చుట్టుపక్కల ఉన్న గంగమ్మ గుడి (గంగాభాగిర్థి), దశరథుడి ఆలయ శిఖరాలు కూడా ముంపు నుంచి సగం మేర బయటపడ్డాయి. జలాశయంలో ముంపునకు గురైన నాటి నుంచి ఈ ఆలయం ఇప్పటివరకు మూడుసార్లు తేలిందని స్థానికులు చెబుతున్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో సగం తేలిన శ్రీరామలింగేశ్వర ఆలయం (ఇన్‌సెట్లో) సగం తేలిన గంగాభాగిర్థి గుడి శిఖరం

ఆర్థిక సంక్షోభం రాబోతుంది



- తెలంగాణను రక్షించుకునేందుకు మరో ఉద్యమం రావాలి
- నిజాం వారసులుగా నాడు బీఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్
- ప్రజల నెత్తిన భస్మాసుర హస్తం పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి/ జనగామ/ఖమ్మం మయూరి సెంటర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలివితక్కువ విధానాలతో త్వరలోనే ఆర్థిక సంక్షోభం రాబోతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. వరంగల్–నల్లగొండ– ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా ఆయన జనగాం, ఖమ్మం జిల్లాల్లో గురువారం పర్యటించారు. ముందుగా జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఇంట్లో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలతోపాటు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఎలా ముందుకు తీసుకెళతారో అధికార పార్టీ వద్ద క్లారిటీ లేదన్నారు. రేవంత్‌రెడ్డి ముందుచూపు లేకుండా గుడ్డిగా పాలన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికపరమైన దిశానిర్దేశం లేదని, ఇదే విధానం కొనసాగితే రాష్ట్ర అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడి, కాంగ్రెస్‌కు పట్టం కడితే, కొత్తగా వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు మరో నిజాం వారసుడిగా మారిపోయాడన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే, భస్మాసుర హస్తం పెట్టారని ఎద్దేవా చేశారు.

రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రాజ్యాంగ విలువలను, రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నాయని ఒక పార్టీలో గెలిచిన వారిని మరో పార్టీలోకి తీసుకుంటూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతుండగా.. త్వరలోనే బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పతనం కావడానికి పదేళ్లు పడితే.. కాంగ్రెస్‌కు ఐదేళ్లు చాలన్నారు. ఈ నాలుగున్నరేళ్లు రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ శాసనమండలి విలువను తగ్గించి, గౌరవమైన సభకు ప్రాధాన్యం లేకుండా చేసిందని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. తద్వారా నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుక అవుతారని తెలిపారు.

రేవంత్‌కు రైతు సమస్యల కంటే ఎన్నికలే ముఖ్యం

రైతుల సమస్యల కంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికలే ముఖ్యం అయ్యాయని జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల అమలును పక్కన పడేసి, సీఎం, మంత్రులు ఢిల్లీ టూర్లు, ఎన్నికల ప్రచారానికి వెళుతున్నారని, ఇక్కడి సంపదను కొల్లగొడుతూ ఢిల్లీకి సూట్ కేసులు మోస్తున్నారని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రాఘవాపూర్, రుద్రవెల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని 45 రోజులుగా వెయిటింగ్‌లో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ ధాన్యం మొలకలొస్తుంటే ఈ ముఖ్యమంత్రికి ఏ మాత్రం సిగ్గనిపిస్తలేదా? అని అన్నారు. నాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అంటే.. ఇప్పుడు దొడ్డు వడ్లు వేస్తే ఉరి అని రేవంత్ అంటున్నాడని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కిషన్‌రెడ్డి వెంట బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

'రేవ్'లో డ్రగ్స్ నిజమే!

- నటి హేమ సహా 84 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ
- బెంగళూరు రేవ్ పార్టీ కేసులో కీలక పరిణామం..
- 98 మంది రక్త నమూనాలు పరీక్షలకు పంపగా 84 మందికి పాజిటివ్
- వారందరికీ బెంగళూరు సీసీబీ పోలీసులు నోటీసులిచ్చి విచారణకు పిలిచే అవకాశం

సాక్షి, హైదరాబాద్/బనశంకరి: బెంగళూరు శివారులోని ఓ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాను రేవ్ పార్టీలో పాల్గొలేదని బుకాయిస్తూ ఏకంగా వీడియో విడుదల చేసిన తెలుగు నటి హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు బెంగ ళూరు పోలీసులు నిర్ధారించుకున్నారు. రేవ్ పార్టీలో పాల్గొన్న 103 మందిలో 98 మంది రక్త నమూనాలను సేకరించి పరీక్షించగా నటి హేమతో పాటు కన్న డ యువ నటి ఆషురై మరికొందరు డ్రగ్స్ తీసుకున్నట్లు ఈ పరీక్షల్లో తేలినట్లు తెలిసింది. మొత్తం ల్యాబ్‌కు పంపిన 98 మంది శాంపిల్స్‌లో 84 మందికి పాజిటివ్ వచ్చినట్లు తేలిందని బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ (సీసీబీ) వర్గాలు గురువారం తెలిపాయి. వారిలో 59 మంది పురుషులు, 25 మంది యువతులు ఉన్నారు. వారందిరికీ నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచేందుకు సీసీబీ పోలీసులు సిద్ధమవుతున్నారు. బెంగళూరు నగర శివారులోని హెబ్బగోడి వద్ద జీఆర్ ఫాంహౌస్‌లో గత ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు వాసు అనే వ్యక్తి బర్త్‌డే పేరిట రేవ్ పార్టీ నిర్వహించడం తెలిసిందే. లిక్కర్ ,డ్రగ్స్, గంజాయితో పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్నారనే సమాచారంతో సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు 20న తెల్లవాజామున 3 గంటల సమయంలో దాడులు చేశారు. ఈ కేసులో పార్టీ నిర్వాహకుడు వాసును ఏ1గా, అరుణ్‌కుమార్ ఏ2గా, నాగబాబును ఏ3గా మహ్మద్ అబూకర్ సిద్దిక్‌ను ఏ5గా, పార్టీ జరిగిన జీఆర్ ఫాంహౌస్ యజమాని గోపాల్‌రెడ్డిని ఏ6గా చేర్చారు. దర్యాప్తులో భాగంగా మరికొందరిని నిందితులగా చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ కేసు దర్యాప్తులో భాగంగా నటి హేమ బెంగళూరుకు ప్రయాణించిన విమాన టికెట్‌ను కూడా పోలీసులు సేకరించారు. ఈ ఫ్లైట్ టికెట్ సోషల్ మీడియాలోనూ చక్కర్లు కొడుతుండటం గమనార్హం.

'శ్రీ ప్రియాంక' స్కామ్‌లో దర్యాప్తు ముమ్మరం

సాక్షి, హైదరాబాద్: అబిడ్స్ తిలక్ రోడ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ చేసిన రూ.200 కోట్ల స్కామ్‌లో సీసీఎస్ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) మాజీ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాణిబాలతో పాటు ఆమె భర్త మేక నేతాజీ, కుమారుడు మేక శ్రీహర్ష ఈ కేసులో నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ తరహా నేరాల దర్యాప్తులో విశేష అనుభవం ఉన్న ఏసీపీ కేఎం కిరణ్ కుమార్‌కు ఈ కేసును అప్పగిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. శ్రీ ప్రియాంక సంస్థ చేతిలో 517 మంది మోసపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నెల 3న సిటీ సివిల్ కోర్టులో దివాళా పిటిషన్ దాఖలు చేసి ఆ మరుసటి రోజు నుంచి వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే వారు విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని భావిస్తున్న పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్లు జారీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

అధికారం ఇచ్చింది రైతుల్ని తిట్టడానికా?

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

- అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని ఇప్పుడు సన్నాలకే ఇస్తామంటారా?
- ఇది అన్నదాతలను మోసగించడం కాదా?
- అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాల్సిందే
- జగిత్యాల, భూపాలపల్లి జిల్లాల్లో రెండు ధాన్యం సేకరణ కేంద్రాల పరిశీలన



మల్లికాంబ అనే మహిళా రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కొండగట్టు (చొప్పదండి)/భూపాలపల్లి రూరల్: 'రైతుబంధు అడిగితే ఓ మంత్రి చెప్పుతో కొడతామంటున్నడు. మరో మంత్రి అన్నదాతలను కుక్కల్లా పోలుస్తూ మొరుగుతున్నారని కసరుకున్నడు. రైతులను తిట్టేందుకేనా మీకు ప్రజలు అధికారం ఇచ్చింది'అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి ఇప్పుడు సన్నాలకే ఇస్తామనడం అన్నదాతలను మోసగించడం కాదా అని నిలదీశారు. అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతోందంటూ రైతులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన గురువారం జగిత్యాల, భూపాలపల్లి జిల్లాల్లో రెండు ధాన్యం సేకరణ కేంద్రాలను సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులందరి పరిస్థితి దయనీయంగా ఉందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు క్వింటాలుకు 3 కిలోల చొప్పున తరుగు పెడుతున్నారని చెప్పారు. దీనిపై మంత్రులు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, యుద్ధప్రాతిపదికన తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అసెంబ్లీని స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పుడూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి హరీశ్ సందర్శించగా రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. 30–40 రోజులవుతున్నా అధికారులు ధాన్యం కొనట్లేదని.. దీంతో దళారులకు రూ.100 నుంచి రూ.200కు విక్రయించామని ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన సందర్భంగా హరీశ్‌రావు.. మల్లికాంబ అనే మహిళా రైతుతో మాట్లాడారు. ధాన్యం అమ్మకానికి తెచ్చి 15 రోజులైందని, బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయిందని.. ఇప్పుడు తన పరిస్థితి ఏమిటని ఆమె కన్నీటిపర్యంతమైంది. ఆమెను ఓదార్చిన హరీశ్‌రావు.. వెంటనే అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో ఫోన్లో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో నిమిత్తం లేకుండా కొనాలని కోరగా ఆయన అంగీకరించారు. అనంతరం హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ హృద్రోగి అయిన మల్లికాంబ కంటతడి పెట్టడం చూసి తన హృదయం ద్రవించిందన్నారు.

కొండగట్టులో మొక్కు చెల్లింపు

అంతకుముందు హరీశ్‌రావు కొండగట్టులో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వామి ఆశీస్సులతో భారీ మెజారిటీతో గెలవాలని ఆలయంలో ముడుపు కట్టిన హరీశ్.. అనుకున్నట్లే ఆయన రికార్డ్ మెజారిటీతో గెలవడంతో ముడుపువిప్పి మొక్కు చెల్లించుకున్నారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణలో సాగుతున్నది ప్రజాపాలన కాదని, ప్రజావ్యతిరేక పాలన ని హరీశ్ ధ్వజమెత్తారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప అన్నీ తుస్సుమన్నాయని ఎద్దేవా చేశారు. వరంగల్–నల్లగొండ–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం భూపాలపల్లి, వర్ధన్నపేట, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల పట్టభద్రులు, బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. హనుమకొండలోని సీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 'మోసాలు, అబద్ధాలతో కాంగ్రెస్ పాలన సాగుతోంది. మోసాల పునాదులపైనే ప్రభుత్వం ఏర్పడింది. రైతులకు మోసం.. నిరుద్యోగులకు మోసం.. మహాలక్ష్మి పేరిట మహిళలకు మహా మోసం.. అందరికీ మోసం.. అంతా మోసం.. ఇదే కాంగ్రెస్ నైజం'అని హరీశ్ దుయ్యబట్టారు.

40% మనోళ్లే

అమెరికాలో చదివే భారతీయ విద్యార్థుల్లో తెలుగువారి హవా..

- భారత్, అమెరికాల మధ్య బలమైన సంబంధాలు
- హైదరాబాద్‌లోని యునైటెడ్ స్టేట్స్ కాన్సులర్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



సదస్సులో పాల్గొన్న జెన్నిఫర్ లార్సన్, ప్రియా గజ్దార్, డెనిస్ ఈటన్, గారెత్ ఓవెన్

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భాష తెలుగు అని, అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థుల్లో 40శాతం మంది తెలుగువారే ఉన్నారని హైదరాబాద్‌లోని యునైటెడ్ స్టేట్స్ కాన్సులర్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ వెల్లడించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా 9 బిలియన్ల డాలర్లు భారతీయ విద్యార్థుల నుంచే అందుతున్నాయని తెలిపారు. ది కమిటీ ఆఫ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో 'గ్లోబల్ అలియెన్స్ స్ట్రెంథెనింగ్ ఎకనమిక్ బ్రిడ్జెస్''అంశంపై గురువారం నగరంలోని ఓ హోటల్‌లో సదస్సు నిర్వహించారు. ఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ ప్రియా గజ్దార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సదస్సుకి హైదరాబాద్‌లోని యునైటెడ్ స్టేట్స్ కాన్సులర్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, తెలంగాణ, ఏపీ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ ఓవెన్, దక్షిణాసియాలోని ఆస్ట్రేడ్‌కు ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెన్నిఫర్ మాట్లాడుతూ.. భారత్, అమెరికాల మధ్య ఉన్నంత బలమైన సంబంధాలు ఏ దేశాలకూ లేవన్నారు. ఫార్మా, ఐటీ, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర రంగాల్లో నిపుణుల కోసం కోసం అమెరికా ఆసక్తిగా ఉన్నట్టు జెన్నిఫర్ లార్సన్ పేర్కొన్నారు.

యూకేలో 1.3 లక్షల మంది భారత విద్యార్థులు

తెలంగాణ, ఏపీ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ ఓవెన్ మాట్లాడుతూ.. దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక మార్పిడి ఇరు దేశాల వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు దోహదపడుతుందన్నారు. చాలా మంది భారతీయ విద్యార్థులకు యూకే విద్యా గమ్యస్థానంగా ఉందన్నారు. యూకేలో 1.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. రక్షణ, విద్య, ఏఐ టెక్నాలజీ, సెమీ–కండక్టర్స్ తదితర రంగాలలో రెండు దేశాల మధ్య గొప్ప వాణిజ్య సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళా వ్యాపారవేత్తలు.. నిధు లను పొందడం ఎక్కడైనా సవాలుతో కూడుకున్నదేనని గారెత్ ఓ ప్రశ్నకు సమాధానంగా వ్యాఖ్యానించారు.

భారత్, ఆస్ట్రేలియా కలిసి ఆ రంగంలో ముందుకు..

భారతీయ మార్కెట్ అంటే చాలా ఇష్టమని దక్షిణాసియాలో ఆస్ట్రేడ్ ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటన్ అన్నారు. భారతదేశం, ఆస్ట్రేలియా క్రిటికల్ మినరల్స్ అంశంలో బలమైన భాగస్వామ్యం కలిగి ఉన్నాయని, తాము 2022లో భారత్‌తో ఆర్థిక వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశామని.. అది చాలా మార్పు తెచ్చిందని చెప్పారు. గతేడాది భారత్‌తో తమ వాణిజ్యం 35 శాతం పెరిగిందని ఈటన్ తెలిపారు.

రఘునాథశర్మ, భాస్కర్‌కు జీవన సాఫల్య పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య శలాక రఘునాథ శర్మ, సాహితీవేత్త నలిమెల భాస్కర్‌లు.. మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఆచార్య శలాక రఘునాథ శర్మ సంస్కృత భాషా సాహిత్య పరిశోధనా రంగంలో విశేష కృషి చేశారు. డాక్టర్ నలిమెల భాస్కర్ తెలుగు భాషా సాహిత్య పరిశోధనా రంగంలో విశేష కృషి చేశారు. దీంతో ఇద్దరికీ మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారం అందజేయాలని ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ నిర్ణయించింది. ఈనెల 26వ తేదీన ఉదయం 11 గంటలకు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అవార్డుల ప్రదానం జరగనుంది. కార్యక్రమానికి పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సభాధ్యక్షునిగా ప్రొఫెసర్ కె.యాదగిరి, సమన్వయకర్తగా ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు వ్యవహరించనున్నారు. సంస్కృత అధ్యయనంలో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు కూడా పురస్కారాలను ఈ కార్యక్రమంలో అందజేయనున్నట్టు ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ అప్పం పాండయ్య తెలిపారు.



అవార్డు అందుకున్న దాజీ

దాజీకి ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ అవార్డు ప్రదానం

సాక్షి, హైదరాబాద్: హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షులు దాజీకి ప్రతిష్టాత్మకమైన ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ అవార్డును ఈ నెల 21న గిల్డ్‌హాల్‌లో ప్రదానం చేశారు. విద్య, ఆరోగ్యం, ధ్యానం, ఆధ్యాత్మికత, పర్యావరణానికి సంబంధించిన అంశాల్లో కృషి చేయడంతో పాటు ఆయన జీవితాన్నంతా మానవాళికి అంకితం చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ పాలసీ చైర్మన్ క్రిస్ హేవార్డ్, సంస్థ ఫ్రీడమ్ అప్లికేషన్స్ సబ్–కమిటీ చైర్ రెహనా అమీర్‌లు కమలేశ్ పటేల్ (దాజీ)ను ఈ అవార్డుకు నామినేట్ చేశారు. ఈ సందర్భంగా దాజీ మాట్లాడుతూ, ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ అవార్డుతో మళ్లీ యునైటెడ్ కింగ్‌డమ్‌తో అనుసంధానం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ గుర్తింపు కేవలం లండన్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ వలంటీర్లు, అభ్యాసులందరికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ భాగస్వాములకు లభించిన అరుదైన గౌరవమని అన్నారు.

ఎంపీ ఫలితాల తర్వాత బీఆర్‌ఎస్ భూస్థాపితమే

- ప్రభుత్వం పోయిందని..కవిత జైలుకు వెళ్లిందనే ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్
- 12 ఎంపీ సీట్లు తగ్గకుండా గెలుస్తాం.. బీఆర్‌ఎస్‌కు డిపాజిట్ వస్తేనే ఎక్కువ
- మీడియాతో మంత్రి కోమటిరెడ్డి



వేద పండితుల ఆశీర్వచనం అందుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్‌ఎస్ భూస్థాపితం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి జోస్యం చెప్పారు. కవిత జైలుకు వెళ్లిందని...పార్టీ అధికారం కోల్పోయిందనే ఫ్రస్టేషన్‌లో కేటీఆర్ ఉన్నారని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అసహ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కోమటిరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 12 ఎంపీ సీట్లకు తగ్గకుండా కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌కు రెండు, మూడు చోట్ల డిపాజిట్ వస్తే ఎక్కువ అని చెప్పారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని, బీఆర్‌ఎస్ హయాంలో మద్యం అమ్మకాలు పెరిగాయే తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే సన్నాలకు బోనస్ ఇస్తామని చెప్పామన్నారు. దొడ్డు వడ్లు పండించే రైతులను కూడా ఆదుకుంటామని తెలిపారు. అనుమతులు తీసుకోకుండానే జిల్లాల్లో బీఆర్‌ఎస్ ఆఫీసులు కట్టారని, జూన్ 5 తర్వాత బీఆర్‌ఎస్ నేతలంతా కేపీ.పాల్‌లా తిరగాల్సిందేనన్నారు. వైఎస్సార్ తరహాలో రేవంత్‌రెడ్డి కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, మేమంతా టీం వర్క్‌తో కలిసి పనిచేస్తున్నట్టు చెప్పారు. తమ సంక్షేమపాలన చూసి కేసీఆర్ మతిస్థిమితం కోల్పోయారని ధ్వజమెత్తారు. రేవంత్‌కు భయపడి కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ఎల్పీ బాధ్యత కేటీఆర్‌కు ఇస్తే, హరీశ్‌రావు కొత్త దుకాణం పెట్టే ఆలోచనలో ఉన్నారని చెప్పారు. కేసీఆర్ కుటుంబం ఇక బెయిల్ కోసం ప్రయత్నం చేస్తే బెటర్ అని ఎద్దేవా చేశారు. అమెరికాలో పెద్ద చదువులు చదువుకున్నానని చెప్పే కేటీఆర్ మాటలు అనాగరికంగా ఉన్నాయని, ముఖ్యమంత్రి పదవికి కూడా మర్యాద ఇవ్వకుండా ఇష్టారీతిన మాట్లాడుతుండడం బాధాకరమని కోమటిరెడ్డి అన్నారు. ఉద్యమకారుడు మహేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి వెళ్లగొట్టిందే కేటీఆర్ అని ధ్వజమెత్తారు. తీన్మార్ మల్లన్న మీద కేసులు ఉన్నాయంటున్న కేటీఆర్‌కు కవిత కేసులపై మాట్లాడే ధైర్యం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ ఫ్లోర్‌లీడర్ అయ్యి నెల రోజులు కూడా కానీ వ్యక్తి, ఆర్టీఐ కింద 70 లెటర్లు పెట్టాడని ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. కోమటిరెడ్డి తన జన్మదినం సందర్భంగా ఇద్దరు వికలాంగులకు ట్రై వెహికల్స్ అందజేశారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.